# అధ్యాయం - 1

## ఆంధ్రప్రదేశ్‌లో షెడ్యూల్డు తెగలు, వారి సాంప్రదాయక నివాస ప్రాంతాలు, ఆచార వ్యవహారాలు

భారత రాజ్యాంగంలో షెడ్యూల్డు తెగలు అనే మాట, ఆర్టికల్ (366), క్లాజు (25) నందు, రాజ్యాంగం కోసం ఆర్టికల్ (342) క్రింద షెడ్యూల్డు తెగలుగా ప్రకటించబడిన **తెగలు లేక తెగల సముదాయాలు లేక ఆయా తెగల్లోని ఉపతెగలు లేక వర్గాలు** అని నిర్వచించబడింది.

ఆర్టికల్ (342), క్లాజు (1) ప్రకారం ఏదేని రాష్ట్రం లేక రాష్ట్రంలోని ఏదేని ప్రాంతానికి సంబంధించి, ఆ రాష్ట్ర గవర్నరును సంప్రదించి పబ్లిక్ నోటిఫికేషన్ ద్వారా**తెగలు లేక తెగల సముదాయాలు లేక వాటిలోని ఉపతెగలు లేక వర్గాలను** ఆ రాష్ట్రంలో/ ప్రాంతంలో షెడ్యూల్డు తెగలుగా రాష్ట్రపతి నిర్ధారించ వచ్చును.

ఆర్టికల్ (342), క్లాజు (2) ప్రకారం క్లాజు (1) క్రింద జారీ చేయబడిన నోటిఫికేషన్‌లో నిర్ధారింపబడిన షెడ్యూల్డు తెగల జాబితాలో ఏదైనా **తెగ లేక తెగల సముదాయం లేక వాటిలోని ఉప తెగలు లేక వర్గాలను** పార్లమెంట్ చట్టం ద్వారా చేర్చవచ్చును లేక తొలగించవచ్చును.

అనగా షెడ్యూల్డు తెగల జాబితాను ప్రకటించడానికి రాష్ట్రపతికి, జాబితాలను సవరించడానికి / మార్పు చేయడానికి పార్లమెంటుకు మాత్రమే అధికారం కలదు.

షెడ్యూల్డు తెగల జాబితా తొలిసారి రాజ్యాంగ (షెడ్యూల్డు తెగల) ఉత్తర్వు, 1950లో భారత రాష్ట్రపతిచే ప్రకటించబడింది. ఇప్పటి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతాలు అప్పట్లో మద్రాసు మరియు హైదరాబాద్ రాష్ట్రాల్లో ఉండేవి. ఈ రెండు రాష్ట్రాలకు వేరువేరుగా జాబితాలు ప్రకటింపబడ్డాయి. ఈ రాష్ట్రపతి ఉత్తర్వులు 1953, 1956, 1976 మరియు 2002 (యాక్ట్ నెం.109/2003) సంవత్సరాలలో పార్లమెంట్ చేసిన చట్టాల ద్వారా సవరించబడ్డాయి. కావున ప్రస్తుతం 2003వ సంవత్సరంలో ప్రకటింపబడ్డ షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలు ఉత్తర్వులు (సవరణ) చట్టం – 2002లోని జాబితాలోని తెగలనే షెడ్యూల్డు తెగలుగా పరిగణించాలి. ఈ చట్టంలో మన రాష్ట్రానికి సంబంధించినంత వరకు, కొన్ని తెగలకు చెందిన ఉపతెగలు, పర్యాయ పదాలతోబాటు 'నక్కల', 'కుర్వికారన్' అనే తెగను జాబితాలో చేర్చడం జరిగింది. అలాగే 1976 సంవత్సరపు జాబితాలో సీరియల్ నెం.17లో ఉన్న ధులియ, పుటియ, పెయికో తెగలను సీరియల్ నెం.35గా ఏరియా రెస్ట్రిక్షన్‌తో వేరుగా ఇవ్వడం జరిగింది.

**షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల ఉత్తర్వులు (సవరణ) చట్టం 2002 మరియు ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014లను అనుసరించి ఆంధ్రప్రదేశ్‌లోని షెడ్యూల్డు తెగల జాబితా :**

1 అంధ్, సాదుఅంధ్;

2 భగత;

3 భిల్;

4 చెంచు;

5 గదబ, బోడోగదబ, గుటోబ్‌గదబ, కల్లాయిగదబ, పరంగిగదబ, కత్తెరగదబ, కాపుగదబ;

6 గోండు, నాయకపోడు, రాజ్‌గోండు, కొయితూర్;

7 గౌడు (ఏజన్సీ ప్రాంతాల్లో)

8 హిల్ రెడ్డీస్

9 జాతాపు;

10 కమ్మర;

11 కట్టు నాయకన్;

12 కొలాము, కొలవార్;

13 కొండదొర, కుబి;

14 కొండకాపు;

15 కొండరెడ్డి;

16 ఖోండ్స్, కోది, కోధు, దేశియఖోండ్స్, డొంగ్రియఖోండ్స్, టికిరియఖోండ్స్, ఏనేటిఖోండ్స్, కువింగ;

17 కొటియ, బెంతొఒరియా, బర్తిక, దులియ, హొల్వ, సన్రోన, సిద్ధోపైకొ;

18 కోయ, డోలికోయ, గుట్టకోయ, కమ్మరకోయ, ముసరకోయ, ఒడ్డికోయ, పట్టిడికోయ, రాజకోయ, రాషకోయ, లింగధారికోయ (ఆర్డినరి), కొట్టుకోయ, భినెకోయ, రాజ్‌కోయ;

19 కులియ;

20 మాలి;

21 మన్నెదొర;

22 మూకదొర, నూకదొర;

23 నాయక్ (ఏజన్సీ ప్రాంతాల్లో)

24 పర్ధాన్;

25 పోర్జ, పరంగి పెర్జ;

26 రెడ్డిదొర;

27 రోన, రేన;

28 సవర, కాపుసవర, మలియసవర, ఖుట్టోసవర;

29 సుగాలి, లంబాడి, బంజారా;

30 వాల్మీకి (విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి మరియు పశ్చిమగోదావరి జిల్లాల్లోని షెడ్యూల్డు ప్రాంతాల్లో)

31 యానాది, చల్లయానాది, కప్పలయానాది, మంచియానాది, రెడ్డియానాది;

32 ఎరుకల, కొరచ, దబ్బఎరుకల, కుంచపూరిఎరుకల, ఉప్పుఎరుకల;

33 నక్కల, కుర్వికారన్

34 ధులియ, పైకొ, పుటియ (విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో)

చాలా షెడ్యూల్డు తెగలు సాంప్రదాయకంగా అదిలాబాద్, వరంగల్, ఖమ్మం, ఉభయగోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని అటవీ ప్రాంతాల్లోను; కర్నూలు, మహబూబ్‌నగర్, ప్రకాశం, గుంటూరు, నల్గొండ జిల్లాల్లో విస్తరించిన నల్లమల అడవుల్లోను నివసిస్తున్నారు.

ఎరుకల, యానాది, నక్కల తెగలవారు మైదాన ప్రాంతాల్లో నివసిస్తుండగా, సుగాలీ / లంబాడ తెగవారు అటవీ ప్రాంతాలు మరియు మైదాన ప్రాంతాల్లో కూడా నివసిస్తున్నారు. వివిధ తెగలు ఏ ఉత్తర్వుల్లో మొట్టమొదట షెడ్యూల్డు తెగలుగా ప్రకటింపబడ్డాయి, వారు సాంప్రదాయకంగా నివసించే ప్రాంతాల వివరాలు అనుబంధం–1లో ఇవ్వబడ్డాయి. 2011 సంవత్సరపు జనాభా లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల వారీగా వివిధ షెడ్యూల్డు తెగల జనాభా అనుబంధం–2లో ఇవ్వబడింది.

## 1. అంధ్ :

ఈ తెగవారు సాంప్రదాయకంగా అదిలాబాద్ జిల్లాలోని అటవీ ప్రాంతంలో నివసిస్తున్నారు. వీరి ముఖ్య వృత్తి వ్యవసాయం. కొంతమంది అటవీ ఉత్పత్తులను సేకరించి విక్రయిస్తారు. ఈ తెగలో వర్తాలి మరియు ఖల్‌తాలి అను రెండు విభాగాలుంటాయి. ఏ విభాగం వారు అదే విభాగంలో పెళ్ళిళ్ళు చేసుకోవాలి. ఒక్కో విభాగంలో కొన్ని ఇంటి పేర్లుంటాయి (అద్మాన్). ఒక ఇంటి పేరుకు సంబంధించినవారు అదే ఇంటి పేరు కలవారితో వివాహం చేసుకోరాదు. వీరి మాతృభాష మరాఠి. వీరిలో సంప్రదింపుల ద్వారా జరుగు వివాహాలతో బాటు వితంతు వివాహాలు కూడా ఆమోదింపబడతాయి. కాని మిగతా తెగల్లోవలె వితంతువులు చనిపోయిన భర్త యొక్క తమ్మునితోగాని అదే ఇంటి పేరుగల వ్యక్తితో చేసుకొను వివాహం వీరిలో నిషిద్ధము. సఖ్యత లేని దంపతులు వివిధ కారణాలతో విడాకులు పొందవచ్చును. వారు మాంసాహారులే కాని గొడ్డు మాంసం తినరు.

## 2. బగత :

బగత తెగవారు ఎక్కువగా విశాఖపట్నం జిల్లాలోని షెడ్యూల్డు ప్రాంతాల్లోను, విజయనగరం జిల్లాలోని అటవీ ప్రాంతాల్లోను నివసిస్తున్నారు. విశాఖపట్నం జిల్లాలో ఎక్కువమంది పూర్వపు ముఠాదార్లు, గ్రామ పెద్దలు ఈ తెగకు చెందినవారే. ఆ ప్రాంత గిరిజనుల్లో వీరు సాంఘికంగా ఉన్నత హోదాకలవారు.

బగతలు స్థిర వ్యవసాయంతోబాటు అవసరాన్ని బట్టి పోడు వ్యవసాయం కూడా చేస్తారు. వీరిలో పులి, నాగ, సురభి, సూర్య, అలమ, మత్స్య, ఎలుగు మొదలగు గోత్రాలు. ఈ గోత్రాలలో కొన్ని ఇంటి పేర్లు ఉంటాయి. ఒకే ఇంటి పేరు, గోత్రం కలవారి మధ్య వివాహాలు నిషిద్ధము. వీరిలో సంప్రదింపులు, ప్రేమించి పారిపోయి పెళ్ళి చేసుకోవడం, అమ్మాయిని పట్టుకెళ్ళి పెళ్ళి చేసుకోవడం, కాబోయే మామ గారింట్లో పని చేసి అతని కూతుర్ని పెళ్ళి చేసుకోవడం, అన్న చనిపోతే వదినను మరిది పెళ్ళి చేసుకోవడం (లెవిరేట్) అనే పద్ధతులలో వివాహాలు జరుగుతాయి. వితంతు మరియు విడాకులు పొందిన స్త్రీలు కూడా వివాహాలు చేసుకోవచ్చును. వివాహిత స్త్రీని ఇంకో వ్యక్తి పెళ్ళి చేసుకోవాలంటే మొదటి భర్తకు పెద్దల నిర్ణయం ప్రకారం 'మగనాలి' మొత్తం చెల్లించాలి. గ్రామస్థాయిలో తగవులు తీర్చుకోవడానికి సాంప్రదాయ పంచాయితీలుంటాయి. ఈ పంచాయితీ పెద్దమనిషిని 'నాయుడు' అంటారు. 'బోర్‌బాయి' అనే సలహాదారు, 'బారిక' లేక 'చల్లన్' అనే సహాయకుడు ఉంటారు. వీరు సంకు దేవుడు, గంగ దేవుడు, నంది దేవుడు, నిశాని దేవత, జాకరి దేవత మొదలగు దేవతలను పూజిస్తారు.

**మెదక్, రంగారెడ్డి జిల్లాలోని బిచ్చపోల్లు అనే కులంవారు, కోస్తా జిల్లాల్లో 'బగటా' అనే మత్స్యకార కులం వాళ్ళు. 'బగత' షెడ్యూల్డు తెగగా క్లెయిము చేస్తుంటారు.**

## 3. చెంచు :

చెంచులు సాంప్రదాయకంగా కర్నూలు, మహబూబ్‌నగర్, ప్రకాశం, గుంటూరు, నల్గొండ జిల్లాల్లో విస్తరించిన నల్లమల అటవీ ప్రాంతాల్లోను, రంగారెడ్డి జిల్లాలోను నివసిస్తున్నారు. చెంచు తెగలో గోత్రాలకు బదులు ఇంటి పేర్లుంటాయి. వీటినే గోత్రాలుగా పిలుస్తారు. కొన్ని గోత్రాలు – ఉత్తలూరి, ఉడుతల, పులిచెర్ల, జల్లి, నిమ్మల, భూమని, మేకల, కుడుముల, మండ్లి, దాసరి, అర్తి, తోకల, నాగల, కాట్రాజు, ఇండ్ల, చిగుర్ల, గజ్జల, దమ్‌సమ్, గుల్ల, నల్లబోతుల మొదలగునవి. చెంచుల్లో కూడా సంప్రదింపులు, ప్రేమించి పారిపోవడం, పట్టుకెళ్ళి వివాహం చేసుకోవడం, వితంతు వదినతో మరిది పెళ్ళి (లెవిరేట్), మామగారింట్లో పనిచేసి పెళ్ళి చేసుకోవడం అనే వివాహ పద్ధతులుంటాయి. చెంచుల సాంప్రదాయక వృత్తి అటవీ ఉత్పత్తుల సేకరణ. కాని ప్రభుత్వ సహాయ పథకాల ద్వారా చాలామంది ప్రస్తుతం వ్యవసాయం చేస్తున్నారు. కొందరు వ్యవసాయ లేక అటవీ కూలీలుగా కూడా జీవనం సాగిస్తున్నారు.

వీరు గారెల మైసమ్మ, గౌలుసమ్మ, లింగమయ్య, నరసింహస్వామి, ఎల్లమ్మ మొదలగు దేవతలను పూజిస్తారు. వీరికి కూడా, కులపంచాయితి ఉంటుంది. కులపెద్దను 'పెద్దమనిషి' అంటారు.

**గుంటూరు జిల్లాలో నల్లమల అడవులకు దగ్గరలోని మైదాన ప్రాంతాల్లోను పశ్చిమ గోదావరి, మహబూబ్‌నగర్ జిల్లాల్లోను కొందరు చెంచు షెడ్యూల్డు తెగకు చెందినట్లు క్లెయిము చేస్తుంటారు. ఈ క్లెయిముల్లో వీరికి నల్లమల అటవీ ప్రాంతంలోని చెంచులకు సాంఘిక, వివాహ సంబంధాలున్నాయా? 1950కు పూర్వం వారి గ్రామాల జననమరణ రికార్డులు, స్కూలు రికార్డుల్లో వారి కులం చెంచు అని ఉందా అనే అంశాలు పరిశీలించాలి. అలాగే కడప జిల్లాలో పోరుమామిళ్ళ మండలంలో కొంతమంది చెంచు వారిగా క్లెయిము చేశారు. కాని వారు బలిజ, దాసరి కులాల వాళ్ళు అని తేలింది.**

**మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో కూడా చెంచు కులము, అడవుల్లో ఔషధ మొక్కలు సేకరించి అమ్ముతామని క్లెయిములు వస్తుంటాయి. వీరు కూడా చెంచులు కాదు.**

## 4. గదబ :

వీరు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లోని అటవీ ప్రాంతాలు, వాటి దగ్గర్లోని మైదాన ప్రాంతాల్లో సాంప్రదాయకంగా నివసిస్తున్నారు. వీరికి ప్రత్యేకమైన భాషకలదు. వారి భాషలో శ్రీకాకుళం జిల్లాలోని గదబలు 'గుటోమి' అని విశాఖపట్నం జిల్లా గదబలు 'గిటాదిమ్' అని పిలుచుకుంటారు. వీరిలో బోడో లేక గుటోబ్, పరేంగ, ఒల్లేరి, కొల్లాయి, కత్తెరి, కాపు

మరియు బోయి గదబలు అనే వర్గాలుంటాయి. కాని ప్రస్తుతకాలంలో ఈ వర్గాల పేర్లను మరిచిపోయి అందరూ 'గదబ' తెగగా పిలుచుకుంటారు. గదబలు పూర్వపు వృత్తి రాజుల, జమీందారుల పల్లకీలు మోయడము. కాని ప్రస్తుతం వ్యవసాయం, వ్యవసాయ కూలి, అటవీ ఉత్పత్తుల సేకరణ వీరి వృత్తులు.

వీరిలో తోడమ్ లేక దేడబాయ్, సమిద్కిల్ లేక ముపనూటిర్, పురికిల్ లేక పరికినిన్ మొదలగు గోత్రాలు ఉంటాయి. వీరిలో కూడా ఆ ప్రాంత మిగతా గిరిజనుల్లో వలెనే వివాహ పద్ధతులుంటాయి. జాకరి దేవత, దిసమ్మవారు, రాటల్ పోలమ్మ మొదలగు దేవతలను పూజిస్తారు.

## 5. గోండు :

గోండు తెగ ముఖ్యంగా అదిలాబాద్ జిల్లాలోను, కొంత జనాభా కరీంనగర్ జిల్లాలోను వున్నారు. షెడ్యూల్డు తెగల జాబితాలో నాయకపోడు తెగ కూడా గోండు తెగలతో కలిపి ప్రకటించబడింది. కాని ఇవి రెండూ వేర్వేరు తెగలు. గోండుల ముఖ్య వృత్తి వ్యవసాయం, వ్యవసాయ కూలి.

గోండు తెగలో (1) నాల్వేన్‌సగ, (2) సీవేన్‌సగ, (3) సర్‌వేన్‌సగ మరియు (4) ఏడ్‌వేన్‌సగ అని నాలుగు విభాగాలుంటాయి. వేన్ అంటే దేవుడు. ఒక విభాగం వారు వేరే విభాగం వారితో వివాహం చేసుకోవాలి. ఒక్కో విభాగం మళ్ళీ గోత్రాలు (పాడి)గా విభజించబడి ఉంటుంది. సగోత్ర పెళ్ళిళ్ళు నిషిద్ధము. ఒక్కో 'సగ' లోని గోత్రాలు కొన్ని క్రింది విధంగా ఉంటాయి. వీటినే ఇంటి పేర్లుగా ఉపయోగిస్తారు.

| | | |
|---|---|---|
| నాల్వేన్‌సగ | : | సెద్మకి, సిడమ్, పర్‌చకి మొదలైనవి |
| సీవేన్‌సగ | : | కుమ్ర, అడ, కెనక, జుగ్‌నక, అరక మొదలైనవి |
| సర్‌వేన్‌సగ | : | అత్రమ్, గొడమ్, టుమ్రమ్, కట్లె, పెందూర్, కుడ్‌మెత మొదలైనవి |
| ఏడ్‌వేన్‌సగ | : | మెస్రమ్, మడవి, మర్సకోల, పుర్క, కోడమ్, వేడ్‌మూర్ మొదలైనవి |

ఏడ్‌వేన్‌సగ మరియు సర్‌వేన్‌సగవారి మధ్య వివాహాలు నిషేధము. ఈ రెండు అన్నదమ్ముల వర్గాలని భావిస్తారు. మేనరికం పెళ్ళిళ్ళు ఆమోదించబడతాయి. కాని స్వంత అక్క కూతురితో పెళ్ళి నిషేధము. సంప్రదింపులు, మామగారింట్లో పని చేయడము, అమ్మాయిని ఎత్తుకెళ్ళడం, అమ్మాయి బలవంతంగా అబ్బాయి ఇంట్లో చొరబడటం, ప్రేమించి పారిపోవడం, వితంతు వదినను మరిది పెళ్ళాడడం (లెవిరేట్) వంటి పద్ధతుల ద్వారా వివాహాలు జరుగుతాయి. వితంతు వివాహాలు, విడాకులు ఆమోదిస్తారు. సాంప్రదాయకంగా వరుడు 'ఓలి' ఇవ్వడమేగాక, వివాహ ఖర్చులన్నీ భరించాలి.

గోండులు పూజించే దేవతలు పెర్సాపేన్, అకిపేన్, భీమదేవ్, జంగుబాయి, హనుమాన్, నాట్ అవ్వాల్, పొలమ్‌రాజులు, గౌరిపేన్, దోడిమర్కో మొదలైనవి. పై దేవతలందరికి వివిధ కాలాల్లో పూజలు, పండుగలు చేస్తారు. దివాలి పండుగ సమయంలో దండారి లేక గుసడి నృత్యం చేస్తారు. క్రొత్త పంటలు కోసేముందు వాటిని దేవతలకు అర్పించి పూజిస్తారు. ఈ పండుగలను వారి గోండి భాషలో 'నోవోన్' అంటారు.

గోండు తెగవారికి గ్రామస్థాయిలో 'పటేల్' నేతృత్వంలో పంచాయితీ ఉంటుంది. 5 నుంచి 10 గ్రామాల సముదాయానికి 'రాయ్‌సభ' అనే పంచాయితి ఉంటుంది. ఆయా గ్రామాల కులపంచాయితీల సభ్యులందరు ఇందులో సభ్యులుగా ఉంటారు. వీరు 'గోండు' భాష మరియు తెలుగు కూడా మాట్లాడుతారు.

## 6. గౌడు (ఏజన్సీ ప్రాంతాల్లో) :

ఏజన్సీ ప్రాంతాల్లో నివసించే 'గౌడు' తెగ వారిని మాత్రమే షెడ్యూల్డు తెగగా ప్రకటించబడింది. వీరు సాంప్రదాయకంగా విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి జిల్లాల ఏజన్సీ ప్రాంతాల్లో వ్యవసాయం, పోడు వ్యవసాయం, పశుపోషణ ముఖ్య వృత్తిగా జీవిస్తున్నారు.

వీరిలో అపాటొగౌడు, బెహెరగౌడు, దొంగయాటొగౌడు, బర్తికగౌడు, చిట్టిగౌడు, కౌసల్యగౌడు, దూధ్‌కొన్‌రియగౌడు మొదలగు ఉపతెగలుంటాయి. కాని ఇటీవలి కాలంలో ఈ ఉపతెగల విభాగాలు అంతగా కానరావు. అందరూ గౌడు అనే చెప్పుకుంటారు. కొర్ర, కిల్లో, పాంగి, వంతల, గొల్లోరి, సమర్ది, స్వాబి మొదలగు గోత్రాలుంటాయి. సంప్రదింపులు, ప్రేమించుకొని పారిపోవడము, అమ్మాయిని ఎత్తుకెళ్ళి పెళ్ళాడ్డము, లెవిరేట్ (వింతంతు వదిన – మరిదిల పెళ్ళి), మామగారింట్లో పనిచేసి అతని కూతుర్ని పెళ్ళాడ్డం వంటి వివాహ పద్ధతులు పాటిస్తారు. నిశాని, సంకు దేవత, జాకిరి దేవత, ఠకురాణి, నందిదేవుడు మొదలగు వారిని పూజిస్తారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో 'గౌడు' తెగవారు 'ఆదివాసి ఒరియ' భాషను తూర్పుగోదావరి జిల్లాలో తెలుగు మాట్లాడతారు.

మైదాన ప్రాంతాల్లో నివసించే కల్లుగీత లేక అమ్మడం వృత్తిగాగల గౌడ, కలాలి, గమల్ల, గౌండ్ల, ఈడిగ, శెట్టిబలిజ కులాలవారు గౌడు (షెడ్యూల్డు తెగ) అని సర్టిఫికెట్లకోసం దరఖాస్తు చేసుకుంటారు. ఈ కులాలన్నీ బి.సి. జాబితాలో గ్రూపు (బి)లో చేర్చబడ్డాయి. షెడ్యూల్డు తెగ 'గౌడు'కు పై కులాలకు వృత్తి, ఆచారాలు, సాంప్రదాయాల్లో ఎలాంటి పోలికలుండవు. గౌడు (షెడ్యూల్డు తెగ) జాతివారికి కల్లుగీత, అమ్మడం తెలియదు. ఏజన్సీ/షెడ్యూల్డు ప్రాంతాల బయట గౌడు షెడ్యూల్డు తెగకు చెందినట్లు క్లెయిము చేస్తే అలాంటివారు వారి పూర్వీకులు ఏజన్సీ ప్రాంతంలో స్థిరనివాసులని గౌడు షెడ్యూల్డు తెగవారి ఆచార వ్యవహారాలు పాటిస్తున్నట్లు ఏజన్సీ ప్రాంతానికి వారికి ఉన్న సంబంధాన్ని ఋజువు చేసుకోవాలి.

**ఆంధ్రప్రదేశ్ హైకోర్టువారు, రిట్ అప్పీలు నెం.439/1980, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం Vs దాసరి సుబ్బాయమ్మ కేసులో మైదాన ప్రాంత నివాసులైన గౌడ, గౌండ్ల, కలాలి, గమళ్ళ, ఈడిగ, శెట్టిబలిజ కులాలవారు ఏజన్సీ ప్రాంతంలో నివసించినా కూడా వారికి షెడ్యూల్డు తెగ హోదా రాదు అని 19-04-1985 తేదీన తీర్పు ఇచ్చియున్నారు.**

## 7. కొండరెడ్డి / హిల్‌రెడ్డి :

రాజ్యాంగ (షెడ్యూల్డు తెగల) ఉత్తర్వు 1950 అప్పటి మద్రాసు రాష్ట్రం (ప్రస్తుత ఆంధ్ర ప్రాంతం)లో కొండరెడ్డి అని, అప్పటి హైదరాబాద్ రాష్ట్రం (ప్రస్తుత తెలంగాణా ప్రాంతం)లో హిల్‌రెడ్డి అని, ఒకే తెగ రెండు పేర్లతో ప్రకటింపబడి, తరువాత కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా రెండు తెగలుగానే గుర్తింపబడుతూ వుంది. కాని ఈ రెండూ కూడా 'కొండరెడ్డి' గానే పరిగణించాలి. 'హిల్‌రెడ్డి' అని వాడుకలో లేదు.

కొండరెడ్డి తెగవారు ఉభయ గోదావరి, ఖమ్మం జిల్లాల్లోని అటవీ ప్రాంతాల్లో సాంప్రదాయకంగా నివసిస్తున్నారు. వీరి ముఖ్య వృత్తి పోడు వ్యవసాయం, వెదురుతో తడికలు, బుట్టలు, చాపలు అల్లడం. వివాహాలు, సంప్రదింపులు, అమ్మాయిని ఎత్తుకెళ్ళడం, ప్రేమించుకొని పారిపోవడం, మామగారింట్లో సేవ చేయడం, లెవిరేట్ (వితంతు వదిన – మరిది పెళ్ళి) మొదలగు పద్ధతుల్లో చేసుకుంటారు. పంది మాంసం తింటారు. కొండరెడ్లు ముత్యాలమ్మ, భూమిదేవి, గంగానమ్మ, పాండవ దేవర్లు, గుంటమ్మ, సారలమ్మ మొదలగు దేవతలను పూజిస్తారు. మామిడికొత్త, భూమిదేవి పండుగ, గంగమ్మ పండుగ, వనదేవుడు పండుగలు చేస్తారు. వీరిలో గోత్రాలుండవు. ఇంటి పేర్లే ఉంటాయి. వీరు తెలుగు భాష మాట్లాడతారు. ప్రత్యేక భాష లేదు.

గ్రామస్థాయిలో పంచాయితీ ఉంటుంది. పంచాయితీ పెద్దను 'పెదకాపు' అంటారు. గ్రామంలోని ఇతర పెద్దలు ఇందులో సభ్యులుగా ఉంటారు. పెదకాపు పంచాయితీ పెద్దగానే కాక, వివిధ పూజల్లో, పండుగల్లో పూజారిగా కూడా వ్యవహరిస్తాడు.

**మైదాన ప్రాంతాల్లో నివసించే రెడ్డి కులం వారు కొండరెడ్డి షెడ్యూల్డు తెగకు చెందినట్లుగా క్లెయిము చేస్తుంటారు. వీరిలో మోటాటి, పాకనాటి, పంట, కొడితి మొదలగు ఉపకులాలుంటాయి. ఒక్కోదానికి వేరు వేరు గోత్రాలుంటాయి. ఇవి కొండరెడ్లలో కానరావు. కొండరెడ్లలోని వివాహ పద్ధతులు, పండుగలు, దేవతలు, కులపంచాయితీలు మైదాన ప్రాంతపు రెడ్డి కులంలో ఉండవు.**

## 8. జాతాపు :

జాతాపు తెగ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లోని అటవీ ప్రాంతాలలో నివసిస్తారు. ఖోండు / కోదు తెగలోని జాతపు కోదు అనే ఉపతెగ, వారి భాషను మరచి వేరే

తెగగా మారి 'జాతాపు' తెగగా గుర్తించబడింది అనే వాదన కూడా ఉంది. వీరిని 'జాతపు దొర' అని కూడా వ్యవహరిస్తారు. వీరు తెలుగు భాష మాట్లాడతారు. కాని మిగతా ఆచార వ్యవహారాలు, దేవతలు, వివాహ పద్ధతులు, పండుగలు ఖోండు / కోదు తెగ లేక ఆ ప్రాంతపు షెడ్యూల్డు తెగల్లో వలనే వుంటాయి.

## 9. కమ్మర :

కమ్మర తెగవారు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల్లోని అటవీ ప్రాంతాల్లో నివసిస్తారు. వీరు కోయకమ్మర / కొండకమ్మర అని చెప్పుకుంటారు. వీరి సాంప్రదాయ వృత్తి కమ్మరి పని మరియు వ్యవసాయం.

వీరిలో కూడా ఆయా ప్రాంతాల ఇతర షెడ్యూల్డు తెగల్లో వలెనే కొర్ర, కిల్లో, భాగ్, భల్లు, పాంగి, సమర్ది మొదలగు గోత్రాలు, వివాహ పద్ధతులు, దేవతలు, పండుగలు ఉంటాయి. సాంప్రదాయకంగా పంది, గొడ్డు మాంసం తింటారు.

**రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని మైదాన ప్రాంతాల్లో నివసించే 'కమ్మరి' కులం వారు కమ్మర షెడ్యూల్డు తెగకు చెందినట్లుగా దరఖాస్తు చేస్తుంటారు. ఈ మైదాన ప్రాంత కమ్మరి కులం వారు విశ్వబ్రాహ్మణుల్లో ఒక వర్గంగా, కంసలి, వడ్రంగి, కంచరి, శిల్పి కులాలతో కలిపి బి.సి. (బి.గ్రూప్)లో చేర్చబడ్డారు. వీరు సాంప్రదాయంగా శాఖాహారులు. జందెము ధరిస్తారు. వీరిలో వివాహ పద్ధతులు, దేవతలు, పండుగలు మొదలగు ఆచారాలన్నీ మిగతా హిందూ కులాలవారిలో వలెనే ఉంటాయి. వీరి సాంప్రదాయ వృత్తి 'కమ్మరి' పని మాత్రమే, వ్యవసాయం చేయరు.**

**ఈ మధ్యకాలంలో ఖమ్మం, వరంగల్లు, నల్గొండ, కరీంనగరు, నెల్లూరు, ప్రకాశం, కృష్ణా, గుంటూరు, కడప మొదలగు జిల్లాలనుండి కొందరు తాము బి.సి. కమ్మరి కులం వాళ్ళు కాదని, బైటి కమ్మర్లు అని, షెడ్యూల్డు తెగ కమ్మర్లు తాము ఒకటే అని షెడ్యూల్డు తెగ సర్టిఫికెట్ల కోసం క్లెయిము చేస్తున్నారు. వీళ్ళు షెడ్యూల్డు తెగ కమ్మర్లు కారు.**

**కమ్మర షెడ్యూల్డు తెగను నిర్ధారించుటకు మార్గదర్శకాలు ప్రభుత్వ మెమో నెం.984/ సి.వి.2/ 98-3, తేది 23.07.1999లో ఇవ్వబడ్డాయి.**

## 10. కోలామ్ / కొలవార్ :

కోలాము తెగవారు, వారి కోలామి భాషలో 'కొలవార్' అని చెప్పుకుంటారు. వీరు సాంప్రదాయకంగా అదిలాబాద్ జిల్లాలో నివసిస్తున్నారు మరియు గోండు తెగవారికి పూజారులుగా వ్యవహరిస్తారు. వీరి తెగలోనూ గోండు తెగలో వలెనే ఏడు దెయ్యాలఖేర్ (గోండుల్లో ఏడ్వేన్సగ), ఆరు దెయ్యాలఖేర్ (సర్వేన్సగ), ఐదు దెయ్యాలఖేర్ (సీవేన్సగ), నాలుగు దేయ్యాలఖేర్ (నాల్వేన్సగ)

అని విభాగాలు ఉంటాయి. కొన్ని ఇంటి పేర్లు కూడా గోండు వారివే ఉంటాయి. వివాహ పద్ధతులు కూడా, సంప్రదింపులు (కొలామి భాషలో కడియం పెండ్లి), అమ్మాయిని ఎత్తుకెళ్ళి చేసుకునే పెళ్ళి (సుమ్‌తప్‌సార్), ప్రేమించుకొని పారిపోయి చేసుకునే పెళ్ళి (గొరక పెళ్ళి లేక మెస్ పెళ్ళి), మామగారింట్లో పనిచేసే పెళ్ళి (ఇల్లటమ్ పెళ్ళి), అబ్బాయి ఇంట్లోకి అమ్మాయి చొరబడి చేసుకునే పెళ్ళి (యెల్లసొంక్త పెళ్ళి), గోండు తెగలో మాదిరే ఉంటాయి. వితంతు వదినను మరిది పెళ్ళి చేసుకోవడం కూడా వీరి ఆచారము. ఇలాంటి పెళ్ళిని 'పాట్' అంటారు. విడాకులను 'పారికత్' అంటారు. ఆ ప్రాంత ఇతర గిరిజనులకు కొందరు కోలాములు వైద్యులుగా కూడా వ్యవహరించే వారు. కోలాములు భీమయ్యక్, నడిదియమ్మ, ఇడుమలదేవి, పోతరాజు, జంగుబాయి మొదలగు దేవతలను పూజిస్తారు. భీమయ్యక్ లగ్న, పొక్కెకొత్త పండుగ (కొత్త పంటలను తినేముందు), మోండాస్ (ఏరువాక చేసే కొత్త సంవత్సరాది), అఖాడి (పశువుల) పండుగలు చేస్తారు.

కోలాము తెగ కులపంచాయితీ పెద్దను 'నాయకోన్' అంటారు. అందులో దేలక్ (పూజారి), మహాజన్ (వార్తాహరుడు), తర్మక్ (వంటవాడు), గటియ (వడ్డించువాడు) ఇతర గ్రామ పెద్దలు సభ్యులు.

రాజ్యాంగ (షెడ్యూల్డు తెగలు) ఉత్తర్వు 1950లోను, తరువాత 1956 మరియు 1976 సంవత్సరాలలో సవరించబడిన షెడ్యూల్డు తెగల జాబితాలలో 'కోలాము మన్నెర్‌వార్లు' అని వుండినది. 1970–1980 దశకంలో కరీంనగర్, మెదక్, నిజామాబాద్, వరంగల్, నల్గొండ జిల్లాల్లో నివసించే 'మునీర్‌వార్లు'గా చెప్పుకునే కులం వాళ్ళు చాలామంది కోలామ్ మన్నెర్‌వార్లు లేక మన్నెర్ వారుగా షెడ్యూల్డు తెగ సర్టిఫికేట్లు పొందేవారు. అలాగే మన్నె (ఎస్.సి.) కులం వాళ్ళు కూడా మన్నెర్‌వారుగా క్లెయిము చేసేవారు. వీరి బెడదను తొలగించడానికి **మన్నెర్‌వార్లకు బదులుగా కొలవార్ పదం 2003వ సంవత్సరంలో సవరించబడిన షెడ్యూల్డు తెగల జాబితాలో చేర్చబడింది. అందువలన ప్రస్తుతం అమల్లో ఉన్న జాబితా ప్రకారం 'మన్నెర్‌వార్లు' అని షెడ్యూల్డు తెగ సర్టిఫికెట్లు ఇవ్వడానికి వీలు లేదు**. అదిలాబాద్ జిల్లాలో తూర్పు ప్రాంతమైన ఒకప్పటి అసిఫాబాద్, లక్సెట్టిపేట్, చెన్నూరు తాలుకాలలోని కొన్ని మండలాల్లో కోలాము తెగకు చాలా అంశాల్లో సంబంధం ఉండి, కాలక్రమేణ కోలామి భాషను మరచిపోయి తెలుగు భాష మాట్లాడే 'మన్నెర్‌వార్లు లేక మన్నెవారు'గా పిలువబడే తెగవారు నివసిస్తున్నారు. వీరు కూడా కోలాము తెగకు సంబంధము కలవారే. 2003వ సంవత్సరంలో షెడ్యూల్డు తెగ జాబితా ప్రకటించకముందు వీరికి మన్నెర్‌వార్లుగా షెడ్యూల్డు తెగ సర్టిఫికెట్లు ఇవ్వబడ్డాయి. అదిలాబాద్ జిల్లాలోని కోలాము తెగకు సంబంధం కలిగిన మన్నెర్‌వార్లకు వారు కోలాము తెగతో సంబంధాలు కలిగియున్నట్లు నిరూపిస్తే, కోలాము తెగకు చెందినట్లుగా సర్టిఫికెట్లు ఇవ్వవచ్చునని ఆదేశాలు జారీ చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపడం జరిగింది. కాని ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు జారీ చేయబడలేదు.

## 11. కొండదొర :

కొండదొర తెగ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాల్లోని అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వీరికి 'కుబి' అను ప్రత్యేక భాష కలదు. ఈ భాషలో తమ తెగను 'కుబింగ్' అని చెప్పుకుంటారు. ఈ భాషను విశాఖపట్నం జిల్లాలోని కొండదొరలు మాట్లాడుతారు. వీరితోబాటు ఆదివాసి ఒరియా మరియు తెలుగు భాష కూడా మాట్లాడుతారు. కాని **శ్రీకాకులం, విజయనగరం, గోదావరి జిల్లాల కొండదొరలు తెలుగు మాట్లాడుతారు. వీరి తెగలో కూడా కొర్ర, కిల్లో, స్వాబి, హొంతల, పాంగి, కిముడు, పరలెక్, బిదిక, సర్రెక్ మొదలగు గోత్రాలుంటాయి.** వివాహ పద్ధతులు కూడా ఆయా ప్రాంతాల ఇతర గిరిజనుల్లో వలెనే ఆచరిస్తారు. **బోడాదేవత, సంకుదేవత, నిశానిదేవత, జాకరిదేవతలను పూజిస్తారు. చైత్రపండుగ, బల్లిపండుగ, కొర్రకొత్త, సామకొత్త, చిక్కుడుకొత్త, కాడపండయ్ (విత్తనాల పండుగ) మొదలగు పండుగలు జరుపుకుంటారు.**

సాంప్రదాయకంగా పోడు వ్యవసాయం చేసేవారు. కాలక్రమేణ స్థిర వ్యవసాయం అలవర్చు కున్నారు. అటవీ ఉత్పత్తులను సేకరించి విక్రయిస్తారు.

**శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో కొందరు క్షత్రియ కులం వారికి కొండ దొరలుగా ఇంతకు ముందు షెడ్యూల్డు తెగ సర్టిఫికెట్లు ఇవ్వబడి, వివిధ విచారణ స్థాయిల్లో ఉన్నాయి. కొన్ని రద్దు పరచబడినవి. వీరికి సంబంధించిన పాఠశాల, భూమి రికార్డుల్లో 'క్షత్రియ' కులంగా రికార్డు చేయబడి ఉంటుంది. వీరికి వివాహ బంధుత్వాలన్నీ విజయనగరం జిల్లాలోను, ఇతర రాష్ట్రాల్లోని క్షత్రియ కులం వారితోనే జరుగుతాయి. కొండదొర షెడ్యూల్డు తెగల గోత్రాలు, ఇతర ఆచారాలు, ఈ క్షత్రియులకు ఉండవు. అందువలన శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల అధికారులు ఈ విషయంలో జాగ్రత్త వహించాలి.**

## 12. కొండకాపు :

తూర్పు గోదావరి జిల్లా షెడ్యూల్డు ఏరియాలోని రంపచోడవరం, మారేడుమిల్లి, దేవీపట్నం, యల్లవరం మండలాల్లోని సుమారు 40-50 గ్రామాల్లో కొండకాపు తెగ వారున్నట్లు గిరిజన సాంస్కృతిక పరిశోధన మరియు శిక్షణా సంస్థ వారి అధ్యయనంలో తేలింది.

వీరిలో గోత్రాలు ఉండవు. ఇంటి పేర్ల ఆధారంగా వివాహాలు చేసుకుంటారు. కొన్ని ఇంటి పేర్లు అన్నదమ్ముల వరసకు, కొన్ని వివాహము చేసుకోదగ్గ ఇంటి పేర్లు ఉంటాయి. మొదటి వర్గం వారి మధ్య వివాహాలు జరుగవు. కొన్ని ప్రాంతాల్లో కొండదొర తెగవారు, విశాఖపట్నం జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో భగత తెగవారు కూడా కొండకాపులుగా చెప్పుకుంటారు.

కొండకాపుల్లో కూడా ఆ ప్రాంతాల ఇతర షెడ్యూల్డు తెగల్లో వలెనే వివాహ పద్ధతులు వుంటాయి. వీరు గంగాలమ్మ, భూదేవి, కొండదేవత, సీతపల్లి తల్లి, బాపనమ్మ దేవతలను పూజిస్తారు. విత్తనాల పండుగ, జాతర పండుగ, కొర్రకొత్త, బుడమకొత్త, చిక్కుడుకొత్త, కందికొత్త (పప్పుపండుగ) మొదలగు పండుగలు జరుపుకుంటారు. ఆవు / ఎద్దు మాంసం తింటారు కాని గొడ్డు మాంసం తినరు. వీరికి కుల పంచాయితీ ఉంటుంది. పెద్దమనిషిని 'మునసబు', సహాయకున్ని 'బంట్రోతు' అంటారు.

**విశాఖపట్నం ఏజన్సీ ప్రాంతంలోను, తూర్పు గోదావరి ఏజన్సీ ప్రాంతంలోని రాజొమ్మంగి, వై.రామవరం, యల్లవరం మండలాల్లోని కొన్ని గ్రామాల్లో చాలాకాలం క్రితమే మైదాన ప్రాంతాల నుంచి వలస వచ్చి స్థిరపడినటువంటి, సాధారణంగా 'కాపు'లుగా పిలవబడేవారు కొండకాపు షెడ్యూల్డు తెగ అని క్లెయిము చేస్తారు. అలాగే తూర్పుగోదావరి జిల్లా పూర్వపు ప్రత్తిపాడు తాలుకా నుండి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, కడప మొదలగు జిల్లాలనుండి కూడా 'కొండకాపు' నకిలీ సర్టిఫికెట్లు జారీ చేయబడ్డాయి. రాయలసీమ జిల్లాల్లో రెడ్డి వర్గంవారి కులం 'కాపు' అని రికార్డుల్లో ఉంటుంది. వీరు కూడా కొండకాపు షెడ్యూల్డు తెగకు చెందినట్లుగా క్లెయిము చేస్తుంటారు. ఇలాంటి క్లెయిములను జాగ్రత్తగా పరిశీలించి తోసిపుచ్చాలి.**

## 13. ఖోండ్ / కోదు :

ఖోండ్ లేక కోదు తెగవారు సాంప్రదాయకంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లోని షెడ్యూల్డు ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వీరికి ప్రత్యేక 'కుయి లేక కువి' భాష కలదు. వీరి భాషలో తమ తెగను 'కుయింగ లేక కుయిదొర' అని చెప్పుకుంటారు. కొంతమంది బయటివారితో తెలుగులో మాట్లాడుతారు. వీరిలో డోంగ్రియా, దేసియా, టికిరియా, కుట్టియ మరియు యేనేటి ఖోందులు అని ఉపతెగలుంటాయి. కాని కాలక్రమేణ ఈ ఉపతెగల ఉనికి కనుమరుగై, అన్ని ఉపతెగలవారు ఖోందులమనే చెప్పుకుంటారు. ఖోందు తెగ కొన్ని గోత్రాలుగా విభజించబడింది. ఒక్కో గోత్రానికి ఒక ఇంటి దేవత ఉంటుంది. ఒకే ఇంటి దేవత రెండు మూడు గోత్రాలవారికి కూడా ఉంటుంది. వీటిలో కొన్ని అన్నదమ్ముల గోత్రాలు (తైంగ) మరికొన్ని వరుస గోత్రాలుంటాయి (సమ్‌దింగ). అన్నదమ్ముల తైంగ గోత్రాల మధ్య వివాహాలు నిషేధము. అంటే 'సమ్‌దింగ' గోత్రాల మధ్యనే పెళ్ళిళ్ళు జరుగుతాయి. దేవతను వారి భాషలో 'పేను' అంటారు.

| **గోత్రం** | **ఇంటి దేవత** |
|---|---|
| మల్లెక | గంగపేను |
| వింగోడ | గంగపేను |

| | |
|---|---|
| హారెక | గంగపేను |
| సీరిక | గంగపేను |
| పర్సేక | గంగపేను |
| మండింగ | సన్నులుపేను |
| హుయిక / ఉయిక | దొంగపేను |
| మినియేక | దొంగపేను |
| నిసిక | సీతపేను |
| హొల్క | సీతపేను |
| మూటక | సీతపేను |
| కుమ్రిక | సీతపేను |
| లిమ్మక | సీతపేను |
| కిల్లెక | దోడిపేను |
| బొయికింగ | హొల్లుపేను |

వీరికి కులపంచాయితీ ఉంటుంది. పంచాయితీ పెద్దను 'హవంత' అంటారు. పూజారిని 'దిసరి' అంటారు. ముఖ్యంగా వీరి తెగలో ఆడ పూజారి 'పెజ్జినిబుడ్డి' ఉంటుంది. ఇంకో ప్రత్యేకత ఏమంటే వీరిలో చావుకు సంబంధించిన ఆచారాలు / పూజలు చేయుటకు 'మహిని పూజారి' ప్రత్యేకంగా ఉంటాడు.

వీరు వితంతు వదినతో మరిది పెళ్ళి (లెవిరేట్ మ్యారేజి), ప్రేమించుకొని పారిపోయి పెళ్ళాడ్డము, కుండమార్పిడి పెళ్ళి మొదలగు పద్ధతులు పాటిస్తారు.

సాంప్రదాయకంగా పోడు వ్యవసాయం, చాపలు, బుట్టలు అల్లడం, వేట, చేపలు పట్టుట, అటవీ ఫలసాయ సేకరణ వీరి వృత్తులు.

**శ్రీకాకుళం జిల్లాలో భామిని, కోటబొమ్మాళి, సారవకోట, పాతపట్నం, టెక్కలి, మెళియాపుట్టు, జుల్మూరు, పాలకొండ మండలాల్లోను, విజయనగరం జిల్లాలోని కురుపాం మండలంలోని అటవీ ప్రాంతాలకు దగ్గరలోని మైదాన ప్రాంతాల్లోని కొన్ని గ్రామాల్లో నివసించే ఏనేటి, ఏనేటు, ఏనేటోల్లు లేక ఏనేటు కులం అని పిలువబడే కొందరు, తాము ఏనేటి ఖోంద్ షెడ్యూల్డు తెగ అని క్లెయిము చేస్తుంటారు. వీరికి ఖోందు తెగవారికి ఎలాంటి సంబంధ బాంధవ్యాలు లేవు. ఖోందు తెగలోని**

**గోత్రాలు, వివాహపద్ధతులు, ఇంటి దేవతలు, పండుగలు, కులపంచాయితీ పెద్ద, పూజారుల పేర్లు ఏనేటి కులం వారిలో ఉండవు. గత కాలానికి సంబంధించిన వీరి జనన మరణ పత్రాలలోను, స్కూలు రికార్డుల్లోను వీరి కులం ఏనేటు, ఏనేటి, పామిడి, పాయిడి, ఏనేట్లుగా నమోదు కాబడింది. కాని 1980 తరువాత రికార్డుల్లో ఏనేటి కొండ అని నమోదు చేసుకున్నారు. అందువలన ఇట్లాంటి క్లెయిములలో సంబంధిత అధికారులు జాగ్రత్తగా పరిశీలించి చర్య తీసుకోవాలి.**

## 14. (ఎ) కొటియ :

కొటియ తెగ సాంప్రదాయకంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లోని షెడ్యూల్డు ప్రాంతాల్లో నివసిస్తున్నారు. కాని ఎక్కువమంది ఒరిస్సా రాష్ట్ర సరిహద్దుగా ఉన్న విశాఖపట్నం జిల్లాలోని ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వీరు 'సన్‌రోనా' అని కూడా చెప్పుకుంటారు. వీరిలో కిల్లొ (పులి), కొర్ర (సూర్యుడు), గొల్లోరి (హనుమంతు / కోతి), వంతల (పాము), పాంగి (గెద్ద పక్షి), గబంగ్ (ఎలుగుబంటి), అర్లాబ్ (సూర్యుడు), కిన్‌బుడి (ఎలుగుబంటి) మొదలగు గోత్రాలుంటాయి. వీటినే ఇంటి పేర్లుగా వ్యవహరిస్తారు. సగోత్ర వివాహాలు నిషేధము. సంప్రదింపులు (ఒరియ భాషలో హరిబోల్), ప్రేమించుకొని పారిపోయి చేసుకునే పెళ్ళి (ఉడిలియ), అమ్మాయిని ఎత్తుకెళ్ళి పెళ్ళాడ్డము (జింకఉట్ర), అమ్మాయి అబ్బాయి ఇంట్లో చొరబడి తరువాత పెళ్ళిచేసుకోవడం (పైసా ముండి), మామగారింట్లో పని చేసి అతని కూతుర్ని పెళ్ళాడ్డము (ఘర్‌జవోన్), వితంతు వదినతో మరిది పెళ్ళి మొదలగు వివాహ పద్ధతులు పాటిస్తారు. మేనరికం పెళ్ళిళ్ళు ఎక్కువగా చేసుకుంటారు. గ్రామస్థాయిలో తగవులు తీర్చుకోవడానికి కులపెద్ద 'నాయక్ లేక నాయిడు లేక భట్‌నాయక్' ఉంటాడు. అతని సహాయకులుగా 'చలన్', 'బారికి' (వార్తాహరుడు) ఉంటారు.

చైత్రపురబ్, లియకాళిపురబ్, బండపౌర్ణమి, దసరాతోబాటు దీపావళి, కొత్త పండుగలు జరుపుకుంటారు. జాకరి, గంగ, నిశాని, నంది, బల్లి, ఠకురాణి మొదలగు దేవతలను పూజిస్తారు. వీరు ముఖ్యంగా వ్యవసాయదారులు, వ్యవసాయ కూలీలు, మహారాజుల కాలంలో పైకో (పదాది దళం) అంటే సైనికులుగా పని చేసేవారని చెప్పుకుంటారు. వీరు ఒరియ భాష మాట్లాడుతారు.

## (బి) బర్తిక :

బర్తిక తెగను 'బహర్‌అటిక, బారాటిక' అని కూడా అంటారు. వీరు ఒరియా భాష మాట్లాడుతారు. ముఖ్యంగా వ్యవసాయమే వీరి వృత్తి. వీరు విశాఖపట్నం జిల్లాలోని ముంచింగుపుట్టు మండల ప్రాంతాల్లో నివసిస్తారు.

వీరు వేరే గ్రామాలకు వెళ్ళినప్పుడు తమతో తెచ్చుకున్న 12 మట్టి లేక ఇతర పాత్రల్లో ఇళ్ళ వెలుపల వంట చేసుకొని తింటారు కావున వీరికి బాహర్‌అటిక (బాహర్ అంటే బయట, అటిక

అంటే పాత్ర) అనియు బారా అంటే (12) మరియు అటిక అంటే పాత్ర అనియు అందువల్ల 'బారాటిక' అనే పేరు వచ్చిందని చెపుతారు. కొత్త పండుగలు చేసేటప్పుడు గ్రామదేవత అయిన ఠకురాణి పూజకు 12 క్రొత్త మట్టి కుండలు వాడుతారు కావున వీరికి 'బారాటిక' అనే పేరు వచ్చిందని, ఈ పేరు వాడుకలో 'బర్తిక' అయ్యిందని చెప్తారు.

సాంప్రదాయకంగా వీరు తమ ప్రాంతాల్లోని యే ఇతర కులాల వారినుండి భోజనము స్వీకరించరు. అందువల్ల 'శుద్ధోపైకో' (శుద్ధో అంటే పరిశుద్ధులు, పైకో అంటే పదాతి సైనికులుగా పనిచేసేవారు) అని పిలుచుకుంటారు. వీరు మాంసాహారులే కాని పంది, గొడ్డు మాంసాలు తినరు.

వీరిలో పూజారి, మజ్జి, నాయ్‌కో, పాత్రొ, రౌటో, ప్రధాని, మల్లికొ, దొలాయి, దొలపతి మొదలగు ఇంటిపేర్లు ఉంటాయి. ఇవన్నీ వారి పూర్వీకులు జయపూర్ రాజ్యంలో పనిచేసినప్పుడు వారికున్న బిరుదులు / హోదాలు. వీరు గోత్రాలను 'బంసొ' (వంశము) అంటారు. నాగొ (పాము), సుర్జొ (సూర్య), కొన్‌చో (శంఖం), కపిలో (ఆవు), కొచిపొ (తాబేలు), భల్లు (ఎలుగుబంటి) వీరి గోత్రాల్లో కొన్ని.

వీరు మేనరిక పెళ్ళిళ్ళకు ప్రాధాన్యత ఇస్తారు. బహుభార్యాత్వము కూడా ఉంటుంది. వితంతువుల పెళ్ళి, విడాకులు జరుగుతాయి. వారి ప్రాంతాల్లోని మిగతా తెగలవలెనే సంప్రదింపులు (ఒరియాలో హారిబోల్), మామగారింట్లో పని చేసే పెళ్ళి (ఘర్‌జవోన్), ప్రేమించుకొని పారిపోయి చేసుకొనే పెళ్ళి (ఉడిలియ) మొదలగు వివాహ పద్ధతులుంటాయి. ఇటీవలి కాలంలో బ్రాహ్మణ పురోహితులచే పెళ్ళిళ్ళు జరుపుతున్నారు.

గ్రామస్థాయిలో 'భట్‌నాయక్' నేతృత్వంలో చలన్, పాణిగ్రాహి సహాయకులుగా పంచాయితీ ఉంటుంది. నిశాని దేవత, జాకరి దేవత, బల్లి దేవత, ఠకురాణి దేవతలను పూజిస్తారు. చైత్రపురబ్, పూస్‌పురబ్, నౌఖియ (క్రొత్త పండుగ) పండుగలు చేస్తారు.

**(సి) ధులియ :**

వీరు కూడా ఒరియా భాష మాట్లాడే వ్యవసాయం వృత్తిగాకల తెగ. వీరిని 'పుటియపైకొ' అని కూడా అంటారు. వీరు గొడ్డు మాంసం తింటారు కావున తక్కువ సాంఘిక హోదా ఉంటుంది. వీరు ధూళిలో పనిచేస్తారు కావున 'ధుళియ' అని పేరు వచ్చినట్లు పాతరికార్డుల్లో చెప్పబడ్డాయి. ఈ తెగలో కొర్ర (సూర్య), పాంగి (గ్రద్ద / పక్షి), కిల్లొ (పులి), గుంట (చేప), కింబుడి (ఎలుగుబంటి), బురిడి (కోతి), వంతల (పాము) మొదలగు 'బొంసొ (వంశాలు)' లేక గోత్రాలు ఉంటాయి. హరిబోల్ (సంప్రదింపుల పెళ్ళి), ఉడిలియ (ప్రేమించి పారిపోయి చేసుకునే పెళ్ళి), జింకఉట్ర

(అమ్మాయిని ఎత్తుకెళ్ళి చేసుకొనే పెళ్ళి), ఘర్‌జానోన్ (మామగారింట్లో పనిచేసి చేసుకునే పెళ్ళి) మొదలగు వివాహ పద్ధతులు ఉంటాయి. సాంప్రదాయకంగా వివాహ సమయంలో జందెము ధరిస్తారు. వితంతు వివాహాలు, విడాకులు చెల్లుబాటు అవుతాయి. వివాహం 'దిశరి' అనబడు పూజారి నిర్వహిస్తాడు. వీరికి కూడా గ్రామస్థాయిలో 'భట్‌నాయక్' పెద్దగా, 'చలన్' సహాయకునిగా సాంప్రదాయ పంచాయితీ ఉంటుంది. ఠకురాణి, నిశాని దేవత, బల్లి దేవత, జాకర దేవతలను పూజిస్తారు. చైత్ర పురబ్, నౌఖియ, పూస్‌పురబ్ పండుగలు జరుపుకుంటారు. ధులియ లేక దులియ లేక పుటియ అనునని ఒకే తెగకుగల వేర్వేరు పేర్లు.

### (డి) హొల్వ :

హొల్వ తెగకూడా ఒరియా భాష మాట్లాడే వ్యవసాయం చేసే తెగ. వీరి పేరు 'హల్' అంటే హలము/నాగలి నుండి వచ్చిందని చెప్తారు. పాత రికార్డుల్లో పంటియ లేక పెంటియ కులం వాళ్ళు కూడా హొలువ, హలబ లేక హల్బ అని పిలుచుకుంటారని చెప్పబడింది.

**హొల్వ తెగలో బోడొ (పెద్ద లేక అసలైన) మరియు సానొ (చిన్న) అని రెండు విభాగాలుంటాయి. పైన తెలిపిన కొటియ, బర్తిక, ధులియ తెగల్లోవలెనే వీరి గోత్రాలు, వివాహ పద్ధతులు, సాంప్రదాయ పంచాయితీ, దేవతలు, పండుగలు ఉంటాయి. శ్రీకాకుళం జిల్లాలో 'హొలువ' అనే ఒరియ బ్రాహ్మణులు 'హొల్వ' షెడ్యూల్డు తెగగా నకిలీ క్లెయిములు చేస్తుంటారు.**

### (ఇ) పెయికొ :

'పెయికొ' అనునది ఒక తెగ కాదని సైనికులుగా ఇతర స్థాయిల్లో అప్పటి మహారాజులు, ఒరియా జమిందార్ల దగ్గర పనిచేసే వారందరిని 'పెయికొ'లని పిలిచేవారు. వీరికి, వారి సేవలకు ప్రతిగా భూములు కేటాయించబడేవి. ఆ భూముల్లో వ్యవసాయము చేస్తూ అవసరమైనప్పుడల్లా సైనికులుగా పనిచేసే తెగలన్నింటిని పైకోలుగా పిలిచేవారు. చాలామటుకు 'పెయికొ'లుగా పిలువబడే తెగలన్నీ ఒడియా కులంగా అంటే ఒరిస్సా రాష్ట్రం, ఒరియా భాష మూలాలనుండి వచ్చిన వారిగా చెప్పవచ్చు. అంటే రోస, కొటియా, బర్తిక, ధులియ, సన్‌రొనా, సుద్ధోపైకొ, పుటియ, హొల్వ మొదలగు తెగలన్నీ సైనిక వృత్తి, వ్యవసాయం, ఒకే రకమైన ఆచారవ్యవహారాలు, ఒరియా రాష్ట్రం, ఒరియా భాష మొదలగునవి సమిష్టిగా కలిగి ఉన్నందున ఈ తెగలన్నింటిని షెడ్యూల్డు తెగల జాబితాలో ఒకే వరుస నెంబరులో పేర్కొనబడినట్లు నిర్ధారించవచ్చును.

## 15. కోయ :

కోయ తెగవారు ముఖ్యంగా ఉభయ గోదావరి, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో ఉన్నారు. అదిలాబాదు జిల్లాలోని పూర్వపు చెన్నూరు, ఆసిఫాబాద్ తాలుకాల్లో కరీంనగర్ జిల్లాలో కూడా కొంతమంది వున్నారు.

వీరికి కోయ భాష ప్రత్యేకంగా ఉంటుంది. వారి భాషలో తమను 'కొయతూర్' అని చెప్పుకుంటారు. అలాగే దొరల సట్టము లేక కోయదొరలు అని కూడా అంటారు. అదిలాబాద్, కరీంనగర్, తూర్పుగోదావరి జిల్లాల్లో కొన్ని ప్రాంతాల కోయవారు కోయ భాష మరచిపోయి తెలుగు మాట్లాడుతారు.

వీరిలో రాచకోయ, డోలికోయ, ఒడ్డికోయ, గుట్టకోయ, కమ్మరకోయ, పట్టిడికోయ, లింగధారి కోయ, భినెకోయ మొదలగు (వారు చేసే వృత్తులు, ఆచారాల ఆధారంగా) ఉపతెగలు/ వర్గాలు ఉన్నా కాలక్రమేణా ఈ ఉపతెగల పేర్లు వాడుకలో లేకుండాపోయి అన్ని ఉపతెగలవారూ కోయ తెగగానే చెప్పుకుంటారు. వరంగల్, ఖమ్మం జిల్లాల కొన్ని ప్రాంతాల్లో మాత్రము లింగధారి కోయ తెగవారు వున్నారు. కోయతెగలో మూడవ గట్టు, నాలుగవ గట్టు, ఐదవ గట్టు, పెరంబోయడు లేక ఆరవ గట్టు, పరేదు గట్టు లేక ఏడవ గట్టు అనే విభాగాలుంటాయి. ఒక్కోదాని క్రింద కొన్ని ఇంటి పేర్లు ఉంటాయి.

కోయతెగలో కూడా సంప్రదింపుల పెళ్ళి, ప్రేమించుకొని పారిపోయి చేసుకునే పెళ్ళి, అమ్మాయిని పట్టుకెళ్ళి చేసుకునే పెళ్ళి, మామగారింట్లో పనిచేసి చేసుకునే పెళ్ళి, వితంతు వదిన–మరిది పెళ్ళి మొదలగు పద్ధతులు ఉంటాయి. వితంతు వివాహాలు, విడాకులు ఆమోదింపబడతాయి.

సాంప్రదాయ కులపంచాయితీ ద్వారా సాధారణ తగవులు తీర్చుకుంటారు. కులపంచాయితీ పెద్దను 'పోయి' అంటారు. అతనికి సహాయకులుగా 'పినపెద్ద' (సలహాదారు), వ్యాపారి (వార్తాహరుడు) ఉంటారు. వరంగల్ జిల్లాలో కులపెద్దను 'పటేల్' అని కూడా పిలుస్తారు. పది పదిహేను గ్రామాలకు ఒక 'సముత' అనే పంచాయితీ ఉంటుంది. దీని పెద్దను 'సముతు దొర' అంటారు. అతనికి 'బంట్రోతు' సహాయకునిగా ఉంటాడు.

ఆదిరాజు, భీమదేవుడు, కొర్రాజులు, మామిలి, పోతరాజు, సమ్మక్క–సారలమ్మ దేవతలను పూజిస్తారు. మామిడికొత్త, సామకొత్త, విజ్జుపేండుమ్ (విత్తనాల పండుగ), కొండలకొలువు మొదలగు పండుగలు చేస్తారు.

కోయ తెగవారు 'పెరంబోక్ ఆట' అనే నృత్యాన్ని పండుగలు, పెళ్ళిళ్ళ సందర్భాల్లో చేస్తారు. ఈ తెగలోని లింగధారి కోయ ఉపతెగవారు శివభక్తులు మరియు వివాహమయిన మగవారు లింగం ధరిస్తారు. మిగతా ఆచార వ్యవహారాలన్ని కోయతెగలో వలెనే ఉంటాయి.

**జంగము, బాలసంతు, బహురూపి మొదలగు కులాల వారు లింగధారి కోయ తెగకు చెందినట్లుగా క్లెయిము చేస్తుంటారు. ఇంతకు ముందు మెదక్, రంగారెడ్డి, నల్గొండ, కర్నూలు మొదలగు జిల్లాల్లో లింగధారి కోయ అని నకిలీ షెడ్యూల్డు తెగల సర్టిఫికెట్లు జారీ చేయబడ్డాయి.**

## 16. కులియ :

కులియ తెగవారు ముఖ్యంగా విశాఖపట్నం జిల్లాలోని షెడ్యూల్డు ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వీరినే 'ములియ' అని కూడా అంటారు. వీరిలో కూడా కొర్ర, కిల్లొ, గొల్లోరి, పాంగి, నాగ, మత్స్య మొదలగు గోత్రాలుంటాయి. ఒరియా వీరి మాతృభాష, తెలుగు కూడా మాట్లాడుతారు. వివాహ పద్ధతులు, పండుగలు ఆ ప్రాంతంలోని మిగతా తెగల వలెనే ఉంటాయి. వీరి ముఖ్య దేవుళ్ళు పూరిజగన్నాథ స్వామి, సింహాచల అప్పల నరసింహస్వామి.

వీరి ముఖ్య వృత్తి వ్యవసాయము. కొంత మంది గాజులు, పూసలు మొదలగు ఆభరణాలు, అటవీ ఉత్పత్తులు వారపు సంతలలో అమ్ముకొని జీవిస్తుంటారు.

కులియ తెగలో 'గోత్‌బంద్‌బార్' అని పిలవబడే పవిత్ర స్నేహబంధం ఆచారంలో ఉంది. దీని ప్రకారం వారి తెగలో ఒక గోత్రానికి లేక ఇతర తెగలోని వ్యక్తితోగాని వారి వివాహ సమయంలో దేవతలకు పూజచేసి, స్నేహబంధము చేసుకుంటారు. ఇలాంటి నేస్తములు లేక స్నేహితులు అన్ని సమయాల్లో సహాయం చేసుకుంటారు. ఒకరి రహస్యాలు ఇంకొకరు కాపాడుతారు. వారి పిల్లల మధ్య కూడా వివాహాలు చేసుకోరు. అంటే స్నేహితులు అన్నదమ్ములుగా వ్యవహరిస్తారు.

## 17. మాలి :

తెలంగాణా జిల్లాలు మినహా మిగతా ప్రాంతాల్లోనే 'మాలి' షెడ్యూల్డు తెగగా ప్రకటించబడింది. కాని వీరు విశాఖపట్నం జిల్లా షెడ్యూల్డు ప్రాంతాల్లోనే సాధారణంగా నివసిస్తున్నారు. వీరిలో బోడొమాలి, సానొమాలి అని రెండు ఉపతెగలుంటాయి. బోడొమాలి తెగలో స్త్రీపురుషులిద్దరూ జందెము ధరిస్తారు. సానొమాలి తెగలో మగవారు మాత్రమే జందెము ధరిస్తారు. బోడొ వర్గములో ఖంద్యమాలి, పొందరమాలి, తగూర్‌మాలి, కోసల్యమాలి అనియూ, సానొ వర్గములో పన్నారిమాలి, సొర్కువమాలి, దొంగురడియమాలి అని ఉపతెగలుంటాయి. మాలి తెగవారు మిశ్రమ ఒరియా భాష మాట్లాడుతారు. ఆ ప్రాంత మిగతా గిరిజనుల్లో వలెనే వివాహ పద్ధతులు ఇతర ఆచారాలుంటాయి. సాంప్రదాయకంగా వీరు పూల మొక్కలు పెంచి పూలు అమ్మే వృత్తి గలవారు. కాని ప్రస్తుతం స్థిర వ్యవసాయం చేస్తూ, పండ్లు, కూరగాయలు పండించి, వారాంతపు సంతలలో విక్రయిస్తుంటారు.

**తెలంగాణా జిల్లాల్లో, ఇతర ప్రాంతాలనుంచి వలస వచ్చిన మాలి తెగవారికి తప్ప ఇతరులకు మాలి తెగ సర్టిఫికెట్లు ఇవ్వరాదు.**

## 18. మన్నెదొర :

మన్నెదొరలు సాధారణంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల్లోని అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వారు 'మన్నెరాజులు' అని కూడా చెప్పుకుంటారు. వీరి తెగలో కిల్లో, మత్స్య, గొల్లోరి, రాంబి, పాంగి, కొర్ర మరియు నాగ అనే విభాగాలుంటాయి. ఈ విభాగాలను పాడేరు ప్రాంతంలో 'కులం' అని, అరకు ప్రాంతంలో 'బొంసో' (వంశం) అని మిగతా ప్రాంతాల్లో 'గోత్రం' అని అంటారు. ఒకే కులం/బొంసొ/గోత్రానికి చెందిన వ్యక్తుల మధ్య వివాహాలు నిషేధము. నేస్తము లేక గోత్‌బంద్‌బార్ అనబడే సాంప్రదాయ స్నేహ పద్ధతి వీరిలో కూడా పాటిస్తారు.

వివాహ పద్ధతుల్లో అమ్మాయిని ఎత్తుకెళ్ళి పెళ్ళి చేసుకోవడం, ప్రేమించుకొని పారిపోయి పెళ్ళి చేసుకోవడం ఆచారపరంగా చెల్లుబాటు అయినా కూడా సంప్రదింపుల ద్వారానే ఎక్కువ వివాహాలు జరుగుతాయి. వితంతు వదినతో మరిది పెళ్ళి, భార్య చెల్లెలుతో వివాహం కూడా జరుగుతాయి. వీరిలో సాంప్రదాయ పరంగా పంది, గొడ్డు మాంసం తినరు. వీరు సాధారణంగా తెలుగు మాట్లాడతారు. కాని ఒరిస్సా రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ఒరియా కూడా మాట్లాడతారు.

జాకిరి దేవత, నిశాని దేవత, గంగ దేవుడు, సంకు దేవత మొదలగు దేవతలను ఆయా దేవతల పండుగలలో పూజిస్తారు. కొత్త పండుగలు కూడా చేస్తారు. వీరిలో కూడా కులపంచాయితీ ఉంటుంది. పెద్ద మనిషిని 'కులపెద్ద' అంటారు. విజయనగరం జిల్లాలోని మొండెం కల్లు చుట్టుపట్ల గ్రామాల్లో ఏజన్సీలో స్థిరపడ్డ తెలగ/కాపు కులం వారు మన్నె దొరలుగా నకిలీ క్లెయిములు చేస్తున్నట్లు ప్రభుత్వ దృష్టికి వచ్చింది.

## 19. మూకదొర, నూకదొర :

మూకదొర విజయనగరం, విశాఖపట్నం జిల్లాల అటవీ ప్రాంతంలో సాధారణంగా నివసిస్తారు. విశాఖపట్నం ఏజన్సీలో మూకదొరలు 'రెడ్డిదొర' అని కూడా చెప్పుకుంటారు.

వీరిలో కొర్ర, గమెల్ల, కాకర, సుగ్ర, కించోయి, యామిరివారు, చిక్కుడు, మామిడి మొదలగు గోత్రాలు ఉంటాయి. ఈ గోత్రాలనే ఇంటి పేర్లుగా వాడుతారు. సంప్రదింపులు, అమ్మాయిని ఎత్తుకెళ్ళడం, ప్రేమించుకొని పారిపోవడం, మామగారింట్లో పనిచేయడం, వితంతు వదినను మరిది పెళ్ళాడ్డం (లెవిరేట్), భార్య చెల్లిని పెళ్ళాడ్డం మొదలగు వివాహ పద్ధతులు ఆచరిస్తారు. మాతృభాష తెలుగు. కాని ఆదివాసి–ఒరియా కూడా మాట్లాడుతారు. సాంప్రదాయకంగా పంది, గొడ్డు మాంసాలు తినడం నిషేధము. బోడొ దేవత, జాకిరి దేవత, సంకు దేవుడు, నిశాని దేవత, గంగ దేవతలను ఆయా దేవతల పండుగల్లో పూజిస్తారు. చైత్ర పండుగ వీరికి చాలా ముఖ్యం. వీరి ముఖ్య వృత్తి వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల విక్రయం ద్వారా అదనపు ఆదాయం పొందుతారు.

## 20. నాయకపోడు :

నాయకపోడు తెగ షెడ్యూల్డు తెగల జాబితాలో గోండు తెగతో కలిపి ప్రకటించబడింది. కాని ఇవి రెండూ విభిన్న తెగలు. ఈ రెండింటి మధ్య ఆచార వ్యవహారాలు, పూజించే దేవతలు, పండుగలు, వివాహ పద్ధతులు, గోత్రాలు వేర్వేరుగా ఉంటాయి. నాయకపోడులు గోండు తెగకంటే పైస్థాయి వారమని చెప్పుకుంటారు. సాంప్రదాయకంగా గోండులతో సహపంక్తి భోజనం చేయరు.

నాయకపోడు తెగలో గోత్రాలుండవు. ఇంటి పేర్లు మాత్రమే ఉంటాయి. వీరు అదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల గిరిజన ప్రాంతాలు, వాటి దగ్గరలోని కొన్ని మైదాన ప్రాంతాల్లోను సాధారణంగా నివసిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో కూడా. అదిలాబాద్ జిల్లా సరిహద్దు గ్రామాల్లో నాయకపోడు తెగవారున్నారు. లక్ష్మీదేవత, భీమన్న వీరి ముఖ్య దేవతలు. లక్ష్మీదేవర, కృష్ణుడు, శివుడు, పాండవులు, పందిరాజు, పోతరాజు, గొర్రెపోతు, సింగబోయుడు మొదలగు దేవతల గుర్తులుగా కర్రతో చేసిన తొడుగులు ముఖాలకు / తలకు ధరించి నృత్యము చేస్తారు. గోండులు నాయకపోడు వారిని 'మత్స్యాలు' (చేపలు పట్టువారు) అని అంటారు.

## 21. నాయక్ (ఏజన్సీ ప్రాంతంలో మాత్రమే) :

సాంప్రదాయకంగా నాయక్ తెగవారు పశ్చిమగోదావరి, ఖమ్మం జిల్లాల్లోని షెడ్యూల్డు/ ఏజన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వీరు కోయ నాయకులు, పాండవ నాయకులు అని కూడా చెప్పుకుంటారు. వీరు మాంసాహారులు. కాని గొడ్డు మాంసం తినరు.

నాయక్ తెగలో సర్వసాధారణంగా సంప్రదింపుల ద్వారా వివాహాలు జరుగుతాయి. కాని అమ్మాయిని ఎత్తుకెళ్ళడం, ప్రేమించుకొని పారిపోవడం, అమ్మాయి ఇంట్లో చొరబడడం, మామగారింట్లో పనిచేయడం, వితంతు వదిన–మరిది పెళ్ళి మొదలగునవి ఆచార ప్రకారం చెల్లుబాటవుతాయి. మేనరికం పెళ్ళిళ్ళకు ప్రాధాన్యత ఇస్తారు.

ఈ తెగలో గోత్రాలు ఉండవు. ఇంటి పేర్ల ద్వారానే వివాహాలు చేసుకుంటారు. కొన్ని ఇంటి పేర్లవారు అన్నదమ్ముల వరసగాను మరికొన్ని వివాహము చేసుకోదగ్గ వరసగాను ఉంటాయి. వితంతు వివాహాలు జరుగుతాయి.

కొర్రాజులు, పెద్దమ్మ, ముత్యాలమ్మ, మారెమ్మ, కొవ్వాడమ్మ, పోతన్న, చెవులుకొండ సంగరమ్మ మొదలగు దేవతలను, శ్రీరాముడు మొదలగు హిందూ దేవుళ్ళను పూజిస్తారు. పెద్దమ్మ తీర్థము, కొర్రాజుల తీర్థము, పోతురాజు పండుగ, కొత్త పండుగలతోబాటు సంక్రాంతి పండుగ జరుపుకుంటారు. నాయక్‌ల సాంప్రదాయ పంచాయితీ పెద్దను 'పెద్దకాపు' అంటారు. అతనికి సహాయకులుగా చిన్న పెద్ద, బంట్రోతు ఉంటారు.

వీరిలో చాలామంది వ్యవసాయ కూలీలు. కొంతమంది తక్కువ కమతాలతో వ్యవసాయదారులు ఉంటారు. అటవీ ఉత్పత్తులను విక్రయిస్తారు. **పశ్చిమగోదావరి, ఖమ్మం జిల్లాల్లో ఏజన్సీకి దగ్గరలోని మైదాన ప్రాంతాల్లో నాయకులు, చంద్రు నాయకులు, బోయ నాయకులు, బోయ-వాల్మీకి మొదలగు పేర్లతో పిలవబడేవారు తాము నాయక్ తెగవారిమని, ఏజన్సీ ఏరియా నిబంధన తొలగించి వారిని కూడా నాయక్ షెడ్యూల్డు తెగగా గుర్తించాలని క్లెయిము చేస్తున్నారు. వీరికి ఏజన్సీలోని నాయక్ తెగవారికి ఎలాంటి సంబంధాలు, పోలికలు లేవు.**

**ఏజన్సీ ప్రాంతాలనుండి బయటకు వలస వెళ్ళిన నాయక్ తెగవారు ఆ ప్రాంతాలతోను, అక్కడి నాయక్ తెగవారితో తమకున్న సంబంధ బాంధవ్యాలు ఋజువు చేసుకోవాలి.**

## 22. పర్ధాన్ :

పర్ధాన్ తెగ సాంప్రదాయకంగా అదిలాబాద్ జిల్లాలో నివసిస్తున్నారు. ఆచార ప్రకారం వీరు గోండు తెగ కుటుంబాలకు సేవకులు, అంటే గోండు రాజుల, పూర్వీకుల వంశ వృక్షాల గురించి, వారి దేవతలను గురించి, వారి పురాణాల గురించి, పెళ్ళిళ్ళు, పండుగలు మొదలగు సందర్భాలలో పాటలు పాడి వారు సాంప్రదాయంగా ఇచ్చు బహుమతులు, డబ్బు తీసుకునే సంబంధం కలవారు. ఇది గోండులు రాజులుగా, భూయజమానులుగా ఉండే కాలం నుండి వచ్చు ఆచారం. కాని కాలక్రమేణ మారిన పరిస్థితులకు అనుగుణంగా ఈ సంబంధాలు కనుమరుగవుతున్నాయి. కాని ఈ నాటికి పర్ధానులు పాడే పాటల వల్లనే గోండుల పురాణాలు, దేవతల కథలు, ఆచారాలు, మౌఖికంగా కొనసాగుతున్నాయి. పర్ధాన్ తెగలో కూడా నాలుగు విభాగాలు/వర్గాలు సాతదేవి (గోండుల్లో ఏడువేన్ సగ), సహదేవి (సర్వేన్ సగ), పచదేవి (సీవేన్ సగ), చౌదేవి (నాలివేన్ సగ) ఉంటాయి. ఒక్కో వర్గంలో గోండుల్లో వలెనే కొన్ని గోత్రాలు ఉంటాయి. వివాహ పద్ధతులు కూడా గోండు తెగలో మాదిరే ఆచరిస్తారు.

పర్ధాన్‌ల కులపంచాయితీని 'పంచ్' అంటారు. కులపెద్దను 'పటేల్' అంటారు. అతనికి సహాయకులుగా మహాజన్, దేవరి (పూజారి), హవల్దార్ (వార్తాహరుడు), కారొబారి (రికార్డు చేయువాడు) ఉంటారు.

పర్ధాన్‌ల మాతృభాష మరాఠి. కాని గోండులతో వారికున్న సాంప్రదాయక సంబంధమువలన గోండి భాష ఎక్కువగా వాడుతారు. ప్రస్తుత కాలంలో పర్ధానుల ముఖ్య వృత్తి వ్యవసాయం మరియు వ్యవసాయ కూలీ పని.

ఇటీవలి కాలంలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పట్టణ ప్రాంతాల్లో నివసించే పార్ధి లేక నిర్షికారి లేక పిట్టలవాండ్లు (బి.సి.) కులం వాళ్ళు తాము పర్ధాన్ తెగవారమని క్లెయిము చేస్తున్నారు. వీరికి పర్ధాన్‌లకు ఏ విషయంలోను పోలికలు, సంబంధాలు లేవు. అలాంటి క్లెయిములను నిర్ద్వందంగా తిరస్కరించవచ్చును.

## 23. పోర్జ :

పోర్జ తెగవారు సాంప్రదాయకంగా శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల్లోని అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వీరిలో పరెంగి పోర్జ, బోడో పోర్జ, జోడియ పోర్జ, డిడోయి పోర్జ, పెంగు పోర్జ, కొల్లోయి పోర్జ మొదలగు ఉపతెగలున్నా కూడా ఇటీవలి కాలంలో అందరూ 'పోర్జ' అనే చెప్పుకుంటారు. షెడ్యూల్డు తెగల జాబితాలో కూడా పరెంగి పోర్జ మాత్రమే పేర్కొనబడింది.

పోర్జ తెగ కిల్లొ, కొర్ర, సమర్ది, ఒంతల, పాంగి, గొల్లోరి, కిముడు మొదలగు గోత్రాలుగా విభజించబడింది. ఈ గోత్రాలనే ఇంటి పేర్లుగా పెట్టుకుంటారు. వీరు సాంప్రదాయకంగా పోడు వ్యవసాయం చేస్తారు. అటవీ ఫలసాయం సేకరిస్తారు. వీరిలో కూడా కొందరు వ్యక్తుల మధ్య 'సాంప్రదాయక నేస్తము లేక పవిత్ర స్నేహం' అనే ఆచారముంటుంది. అలాంటి వ్యక్తులు ఒకరికొకరి బాగు కొరకు పాటు పడతారు. వారి పిల్లల మధ్య వివాహాలు జరుగవు. ఈ స్నేహము తరువాతి తరాల్లో కూడా కొనసాగుతుంది.

సంప్రదింపులు, అమ్మాయిని ఎత్తుకెళ్ళే పెళ్ళి, ప్రేమించుకొని పారిపోయే పెళ్ళి, మామగారింట్లో పని చేసే పెళ్ళి మొదలగు వివాహ పద్ధతులుంటాయి. కాని సంప్రదింపుల వివాహాలే ఎక్కువగా జరుగుతాయి. వితంతు వివాహాలు, విడాకులు ఆమోదించబడతాయి.

పోర్జలు బోడో దేవత, సంకు దేవత, నిశాని దేవత, జాకిరి దేవత, నంది దేవతలను, పితరులను పూజిస్తారు. గిలియబ్ పొరబ్ (వేట పండుగ), పోడుజ (విత్తనాలు వేసే ముందు పండుగ), గోట్నాకియ (భూమిదున్ను పండుగ), మామిడి కొత్త పండుగ, నంది పొరబ్ మొదలగు పండుగలు చేస్తారు. జోడియ పోర్జ తెగవారు నంది పొరబ్ నాడు జోడియనాట్ లేక జెల్లినాట్ అనే నృత్యము చేస్తారు. వీరు పంది, గొడ్డు మాంసాలు తింటారు. వీరి కులపంచాయితీ పెద్దను 'నాయుడు' అంటారు.

## 24. రెడ్డి దొర :

విశాఖపట్నం జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో నివసించే మూకదొర లేక నూకదొరలు రెడ్డిదొర అని కూడా చెప్పుకుంటారు. వీరి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, జీవన విధానం అన్నీ మూకదొరల్లో లాగానే ఉంటాయి.

## 25. రోన, రేన :

రోనాతెగ, పైకో తెగలోని కొటియా, సిద్దోపైకో, పుటియ, ధులియ మొదలగు తెగలన్నింటికంటే ఎక్కువ సాంఘిక హోదా కలిగి ఉంటారు. వీరి పూర్వీకులు మహారాజు, జమీందార్ల

దగ్గర సైనికులుగా పనిచేసేవారు. తరువాతి కాలాల్లో వ్యవసాయం, పోడు వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల సేకరణ, వ్యవసాయ కూలీ పని చేస్తున్నారు. విశాఖపట్నం జిల్లాలో కొంతమంది బగత తెగ వారు కూడా 'రోనా' అని హోదాకోసం చెప్పుకుంటారు.

రోనా తెగ సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలన్నీ కొటియ మొదలగు తెగలలో వలెనో వుంటాయి. వీరి మాతృభాష ఒరియా.

## 26. సవర :

సవర తెగవారు సాధారణంగా శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని షెడ్యూల్డు ప్రాంతాలు, అటవీ ప్రాంతానికి దగ్గర్లోని మైదాన ప్రాంతాల్లోను నివసిస్తున్నారు. వీరిలో సాంప్రదాయకంగా గోత్రాలు, ఇంటి పేర్లు ఉండవు. అందువలన మేనరికం పెళ్ళిళ్ళు, ఒక ఊరివారు మరో ఊరి సవరలతో వివాహాలు చేసుకునేవారు (ఒకే ఊరు సవరలందరూ అన్నదమ్ములుగా భావించేవారు). వీరిలో మైదాన ప్రాంతాల్లో నివసించే కాపు లేక శుద్ధ సవరలు, అడవుల్లో నివసించే లంజియ సవర, దులియ సవర, పర్‌బత్ లేక మలియ లేక కొండ సవరలు అని ఉపతెగలుంటాయి. ఇటీవలి కాలంలో కాపు మరియు కొండ సవరలని రెండు వర్గాలుగా చెప్పుకుంటారు. అడవుల్లో నివసించే ఉపతెగలు జాతపు తెగవారి అరిక, బిడ్డిక, గేదల, కొండగొర్రి, అడ్డాకుల, మూటక మొదలగు ఇంటిపేర్లను, మైదాన ప్రాంత కాపు సవరలు ఆయా ప్రాంతాల్లోని తెలుగు కులాల యొక్క పరసింగి, పొద్దిడి, జమ్మి, లబర, కొంకడ, తడకల, బొమ్మిక, తుముక, బొంతు, పాతూరి మొదలగు పేర్లను ఇంటి పేర్లుగా వాడుతున్నారు.

వీరికి 'సవరభాష' అని ప్రత్యేక భాష కలదు. కాపు సవరలు సాధారణంగా తెలుగు మాట్లాడుతారు. సంప్రదింపులు (సవర భాషలో పాన్‌కుయ్), ప్రేమించుకొని పారిపోవడం (డమ్‌డమ్‌టపి), అమ్మాయిని ఎత్తుకెళ్ళడం (డింగ్‌డింగ్‌బాయ్), ఇల్లరికం (కినార్‌సంగ్), కుండమార్పిడి (ఉలైబాయ్) మొదలగు వివాహ పద్ధతులను ఆచరిస్తారు. వితంతు వదినతో మరిది పెళ్ళి (దందాల జుంబాయ్) కూడా ఆమోదింపబడుతుంది. సాంప్రదాయక గ్రామ పెద్దను 'గొమాంగొ లేక చోడమర్' అని వైద్యున్ని 'కుడుంబోయ్', పూజారిని 'బుయా' అంటారు.

జాకిరి దేవత లేక జనంగో, బారు బుయో (కొండదేవత), యోంగుబుయో (మశూచి దేవత), గుసడబుయో (గ్రామ సరిహద్దు దేవత), ముండదబొయో (ఇంటి దేవత) మొదలగు దేవతలను పూజిస్తారు. సవర తెగ కొత్త పండ్లు / పంటలు తినే పండుగ (ఆగమ్ పండుగ), విత్తనాల పండుగ (కిల్‌జాబ్), పిల్లల పుట్టెంట్రుకలు తీయు పండుగ (జుమ్‌జుమ్‌జాల్)లు ముఖ్యంగా జరుపుకుంటారు.

సవర తెగలో ముఖ్యమైన ఆచారం, వారి ఇంటిలో పూజచేసే ప్రదేశంలోనే గోడమీద, వారి భాషలో 'ఇట్టల్‌మరన్ లేక ఎడిసింగ్' అనే చిత్రాన్ని / బొమ్మని గీస్తారు.

కాపుసవరలకు స్థిర వ్యవసాయం మరియు అడవుల్లో నివసించే కొండ సవరలకు పోడు వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల సేకరణ ప్రధాన వృత్తులు.

వివిధ ఋతువులు, పండుగలు, వివాహాల సమయాల్లో సవరలు తార్పా, రాజన్, తుడుము, గిడుగు, మురింగాం, రగోల్‌బరి, క్యాడింగ్ మొదలగు వాయిద్యాల సంగీతం, పాటలతో వివిధ నృత్యాలు చేస్తారు.

**ఇతర మైదాన ప్రాంతాల్లో నివసిస్తూ సవరాలు అమ్ముకుంటూ జీవించే సవరాల కులం వాళ్ళు మరియు కొన్ని ప్రాంతాల్లో మొండిబండ కులం వాళ్ళు సవర షెడ్యూల్డు తెగగా క్లెయిము చేస్తుంటారు. ఇంతకుముందు కర్నూలు, గుంటూరు మొదలగు జిల్లాల్లో ఇలాంటి నకిలీ క్లెయిములు, సర్టిఫికెట్లు వచ్చాయి.**

## 27. సుగాలి, లంబాడి, బంజార :

**సుగాలి తెగ అప్పటి ఆంధ్ర ప్రాంతానికి సంబంధించి షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల (సవరణ) చట్టము, 1956, తేది 25.09.1956లోని షెడ్యూల్డు తెగల జాబితాలో చేర్చబడినది. తెలంగాణా ప్రాంతానికి సంబంధించి, షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలు ఉత్తర్వులు (సవరణ) చట్టము, 1976 తేది 27.06.1977 ద్వారా షెడ్యూల్డు తెగల జాబితాలో చేర్చబడింది.** అలాగే, షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలు ఉత్తర్వులు (సవరణ) చట్టం, 2002 (చట్టం నెం.10/2003, తేది 07.01.2003)లోని జాబితాలో అదనంగా బంజార అనే పదం చేర్చబడింది.

సుగాలి / లంబాడి తెగవారు సాధారణంగా శ్రీకాకుళం నుండి తూర్పు గోదావరి వరకు వున్న కోస్తా జిల్లాలు మినహా, రాష్ట్రంలోని మిగతా అన్ని జిల్లాల్లోను నివసిస్తున్నారు.

**సుగాలి/లంబాడి తెగలో రాథోడ్ (భుక్య), జాధవ్ (వడిత్య), చవాన్, పొమార్, ఆడె (బాణోత్) అని 5 విభాగాలుంటాయి. ఒక్కో విభాగంలో కొన్ని పాడి / జాతులు (గోత్రాలు) ఉంటాయి. ఈ పాడి/జాతి పేర్లే ఇంటి పేర్లుగా పెట్టుకుంటారు. రాథోడ్‌లో 27 పాడీలు, జాధవ్‌లో 52, చవాన్‌లో 6, పొమార్ నందు 12, బాణోత్‌లో 13 జాతులుంటాయని చెప్తారు.** ఒక విభాగంలోనివారు ఇతర విభాగాల వారితోనే వివాహాలు చేసుకోవాలి.

సాంప్రదాయకంగా లంబాడీలకు 'డప్పన్' అనే సేవకులుంటారు. వీరిలో భట్, ధాడి (వివాహాల్లో లంబాడీల వంశ చరిత్రను గురించి పాటలు పాడుతారు), ధాలియ లేక డప్పడియా

(డప్పు వాయించేవారు) ఉంటారు. వీరితోబాటు నావి (మంగలివారు), సునార్ (ఆభరణాలు చేయువారు) అనే వృత్తుల వారుంటారు.

సాధారణంగా సుగాలి / లంబాడీలు సంప్రదింపుల ద్వారానే వివాహాలు చేస్తారు. కొన్ని సందర్భాలలో, కాబోయే మామగారింట్లో సేవ చేసి అతని కూతుర్ని వివాహం చేసుకునే పద్ధతిని పాటిస్తారు. సాంప్రదాయకంగా 'ఓలి' (కన్యాశుల్కం) ఇచ్చేవారు. కాని ఇటీవలి కాలంలో 'వరకట్నం' ఇచ్చే ఆచారం కూడా పాటిస్తున్నారు.

లంబాడీల కులపంచాయితీ పెద్దను 'నాయక్', సలహాదారును 'కారొబారి' మరియు వార్తాహరున్ని 'డప్పన్' అంటారు. వివాహాల్లో సాంప్రదాయకంగా వీరి ముగ్గురి హాజరు తప్పనిసరి. తుల్జాభవాని, సీతల, మెరమ, కంకాళి, రూపసతి, లక్ష్మిసతి, హూమసతి, కోసలి సతి, సొసతి, సోమలిసతి మొదలగు దేవతలను, రాముడు, బాలాజి, సేవభయా మొదలగు దేవుళ్ళను పూజిస్తారు. సీతల, తీజ్, తుల్జాభవాని పండుగలతోబాటు ఉగాది, దసరా, దీపావళి, నాగపంచమి, హోళి పండుగలు జరుపుకుంటారు.

సాంప్రదాయకంగా వీరి వృత్తి పశుపోషణ అయినా ఇటీవల కాలంలో వ్యవసాయం, వ్యవసాయ కూలి, పట్టణ ప్రాంతాల్లో భవన నిర్మాణ కూలీ మొదలగు వృత్తులు చేస్తారు. లంబాడీలలో 'జాంగడు' పద్ధతి ఉంటుంది. దీని ద్వారా ఇతర కులాల వారిని తమలోనే తప్పుచేసి తక్కువగా చూడబడే కుటుంబాల వ్యక్తులను కుల పెద్దలంతా కలిసి శుద్ధిచేసి కులంలో చేర్చుకుంటారు.

**నిజామాబాద్, అదిలాబాద్, మెదక్ మొదలగు తెలంగాణ జిల్లాల్లో నివసిస్తున్న మథుర/ మథురలబాన్ కులంవారు వెనుకబడిన తరగతులు (బి.సి.లు)గా గుర్తింపబడ్డారు. వీరినే కెయితి లంబాడీలని కూడా పిలుస్తారు. వీరు లంబాడీ షెడ్యూల్డు తెగగా దరఖాస్తు చేస్తుంటారు. కాని లంబాడీల్లోని రాథోడ్, చవాన్, జాధవ్, పవార్, బాణోతు అనే విభాగాలు వీరిలో లేవు. వీరికి ముఖ్య దేవుడు శ్రీ కృష్ణుడు మరియు గోకులాష్టమి ముఖ్య పండుగ. మథురలబాన్ కులంవారు సాంప్రదాయకంగా శాకాహారులు. జందెము ధరిస్తారు. లంబాడీలు మాంసాహారులు, జందెము వేసుకోరు. మథుర-లబాన్ కులంవారు తాము సుద్ధి లంబాడీలని, లంబాడీ తెగవారిని మురికి లంబాడీలు అని పిలుస్తారు. ఈ రెండింటి మధ్య వివాహ సంబంధాలు ఉండవు. మథురలబాన్ కులం వివాహాలలో బ్రాహ్మణులు పురోహితులుగా వ్యవహరిస్తారు. ఈ సాంప్రదాయం లంబాడీలకు లేదు. మరియు మథుర లేక మథురలబాన్ లేక కెయితిలంబాడి అనే పదం షెడ్యూల్డు తెగల జాబితాలో ప్రకటించబడలేదు. కావున షెడ్యూల్డు తెగ సర్టిఫికెట్లు పొందుటకు అనర్హులు.**

**అలాగే వంజరి అనే కులం వెనుకబడిన తరగతుల జాబితాలో ఉంది. కాని బంజార-వంజరి అనే మాటల్లోని కొద్దిపాటి పోలిక ఆధారంగా ఇంతకుముందు వంజరి కులం వారు నకిలీ సర్టిఫికెట్లు**

**పొందియున్నారు. అలాంటివి రద్దు చేయబడ్డాయి. రిట్ పిటీషన్ నెం.3490/1979, బాలం కుమరయ్య, వంజరి సంఘం Vs సెక్రటరీ, సాంఘిక సంక్షేమ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కేసులో కూడా వంజరి కులం సుగాలి/లంబాడి షెడ్యూల్డు తెగ కాదు అని హైకోర్టుచే తీర్పు ఇవ్వబడింది. మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, రంగారెడ్డి మొదలగు జిల్లాల్లో ఇలాంటి క్లెయిములు రావడానికి అవకాశముంది.**

## 28. వాల్మీకి (ఏజన్సీ ప్రాంతాల్లో) :

వాల్మీకి ఏజన్సీ ప్రాంతాల్లో మాత్రమే షెడ్యూల్డు తెగగా గుర్తించబడింది. వీరు సాంప్రదాయకంగా విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల్లోని ఏజన్సీ (షెడ్యూల్డు) ప్రాంతాల్లో నివసిస్తున్నారు. **వీరి తెగలో నాగ, మత్స్య, పాంగి, వంతల, కిల్లో, కొర్ర, భల్లు మొదలగు వంశాలు (బొంశ్)/గోత్రాలు ఉంటాయి. కాని తూర్పుగోదావరి జిల్లాల్లో ఈ గోత్రాలుండవు. ఇంటి పేర్లుంటాయి.** ఆయా ప్రాంతాల ఇతర గిరిజనుల్లోవలెనే వివాహ పద్ధతులు, పండుగలు ఉంటాయి. **సాధారణంగా గొడ్డు మాంసం తింటారు.** వీరి ముఖ్య వృత్తి వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల సేకరణ, కొంతమంది సంతలలో వ్యాపారాలు, వడ్డీ వ్యాపారం చేస్తారు.

**శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి ఏజన్సీ ప్రాంతాల్లో నివసించే మరియు మైదాన ప్రాంతాల నుండి అక్కడికి వలస వెళ్ళిన షెడ్యూల్డు కులాలకు చెందినవారు వాల్మీకి షెడ్యూల్డు తెగగా క్లెయిము చేస్తుంటారు. వారికి వాల్మీకి షెడ్యూల్డు తెగ హోదా రాదు.**

**అలాగే రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో మైదాన ప్రాంత నివాసులైన వాల్మీకులుగా పిలుచుకొనే బోయ-వాల్మీకి కులంవారు కూడా వాల్మీకి షెడ్యూల్డు తెగకు చెందినట్లు క్లెయిము చేస్తారు. ఇంతకు ముందు ఇట్టి వారికి నకిలీ సర్టిఫికెట్లు కూడా జారీ అయి ఉన్నాయి. బోయ-వాల్మీకి కులం వెనుక బడిన తరగతుల జాబితా (గ్రూప్-ఎ)లో చేర్చబడింది. షెడ్యూల్డు తెగ వాల్మీకి తెగలోని వంశాలు (గోత్రాలు), దేవతలు, పండుగలు బోయ వాల్మీకులకు లేవు. బోయ వాల్మీకులు మాంసాహారులేగాని గొడ్డు మాంసం తినరు. వాల్మీకి-బోయ కులంవారు ముఖ్యంగా రాయలసీమ జిల్లాలు, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కృష్ణా, పశ్చిమగోదావరి, ఖమ్మం, నల్గొండ, కరీంనగర్, వరంగర్ మొదలగు జిల్లాల్లో నివసిస్తున్నారు.**

**కొంతమంది వాల్మీకులు ఏజన్సీ ప్రాంతాలనుండి చదువుకోసం, ఉద్యోగాలు ఇతర బ్రతుకు తెరువుకోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళి ఉండవచ్చు. అలాంటి వారు తాము లేక తమ పూర్వీకులు ఏజన్సీ ప్రాంతమువారని, వారి ఆర్డినరీ రెసిడెన్స్ (స్వస్థలం) ఏజన్సీ ప్రాంతమని ఋజువులతో నిర్ధారణ చేసుకోవాలి.**

## 30. యానాది :

యానాది తెగవారు ముఖ్యంగా నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం, గుంటూరు, కడప, కృష్ణా జిల్లాల్లో నివసిస్తున్నారు. కొంతమంది ఉభయ గోదావరి జిల్లాల్లో కూడా ఉన్నారు. సాంప్రదాయకంగా వీరిలో రెడ్డి యానాది లేక మంచి యానాది మరియు చల్ల యానాది అనే ఉపతెగలున్నాయి. యానాది వారు రెడ్ల ఇళ్ళల్లో (ముఖ్యంగా నెల్లూరు జిల్లాలో) సేవకులుగాను, వారి పొలాలు, తోటల్లో కావలివారు గాను పని చేసేవారు. కాని ఇటీవలి కాలంలో వ్యవసాయం కూడా చేస్తున్నారు. పూర్వం విస్తరాకుల్లో మిగిలిన ఆహారం సేకరించి తినేవారిని చల్లయానాదులుగా అనేవారు. అలాగే అడవుల్లో నివసించేవారిని అడవి యానాదులని, కప్పలు పట్టే వారిని కప్పల యానాదులని చెప్పుకునేవారు. కాని ఇటీవలి కాలంలో ఈ పేర్లు, పనులు కనుమరుగయి అందరూ యానాదులనే చెప్పుకొనుచున్నారు.

యానాదుల్లో సంప్రదింపులు, ప్రేమించుకొని పారిపోవడం అనే పద్ధతుల ద్వారా వివాహాలు చేసుకుంటారు. వితంతు మరియు విడాకులు తీసుకున్నవారు కూడా వివాహాలు చేసుకుంటారు.

పోలేరమ్మ, చెంచమ్మ, నరసింహుడు, మహాలక్ష్మమ్మ, వినాయకుడు, రాముడు, వెంకటేశ్వరుడు మొదలగు దేవతలను పూజిస్తారు. మిగతా హిందూ కులాలతో కలిసి జీవిస్తున్నందున హిందూ దేవతలను పూజిస్తూ హిందూ పండుగలను జరుపుకుంటారు.

వీరి సాంప్రదాయక వృత్తి కుంటలు, కాలువలు, చెరువుల్లో చేపలు పట్టుట, మరియు పొలాలు, తోటల్లో కావలికాయుట, కూలీపని. వీరి నివాస ప్రాంతాలను సాధారణంగా యానాది సంఘం లేక కాలనీ అంటారు. యానాదులు కులపంచాయితీ పెద్దను 'మేస్త్రీ' అంటారు.

శ్రీకాకుళం జిల్లాలోని జలుమూరు, గార, రణస్థలి, సరసన్నపేట, జామి మండలాల్లో ఎర్రగొల్లలు కులం వాళ్ళు యానాది షెడ్యూల్డు తెగ అని క్లెయిము చేస్తుంటారు. వీరి ముఖ్యవృత్తి భిక్షాటన, కావలికాయుట, కూలీ పనులు, వీరి స్త్రీలు పచ్చబొట్లు పొడవడము, సవరాలు అమ్మడం చేస్తుంటారు. వీరికి యానాది తెగకు సంబంధము లేదు.

## 31. ఎరుకల :

ఎరుకల తెగవారు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లోను నివసిస్తున్నారు. వీరికి ఎరుకల భాష అని ప్రత్యేక భాషకలదు. వారి భాషలో వారి తెగను 'కుర్రు' అంటారు. సాంప్రదాయకంగా బుట్టలు అల్లడము, పందుల పెంపకము వీరి వృత్తులు. స్త్రీలు 'సోది' చెప్పేవారు. వారు చేసే వృత్తినిబట్టి ఎరుకల తెగలో దబ్బఎరుకల (వెదురుదబ్బలతో బుట్టలు అల్లేవారు), ఈత పుల్లల ఎరుకల (ఈత పుల్లలతో బుట్టలు అల్లేవారు), కుంచపూరి ఎరుకల (మగ్గాలకు ఉపయోగించే

కుంచెలు చేసేవాళ్ళు), ఉప్పు ఎరుకల (ఉప్పు అమ్మేవాళ్ళు) మొదలగు వర్గాలుంటాయి. ఎరుకల వారిని కర్ణాటక సరిహద్దులోని రాయలసీమ జిల్లాల్లో 'కొరచ' అని కూడా పిలుస్తారు. కాని సాధారణంగా అన్ని వర్గాలవారు 'ఎరుకల' అనే చెప్పుకుంటారు.

**వీరి తెగ సాతుపాడి, కావడి, మానుపాడి, మేంద్రగుత్తి అనే నాలుగు గోత్రాలుగా విభజించ బడింది.** ఒక్కో గోత్రము క్రింద కొన్ని ఇంటి పేర్లుంటాయి. ఒకే గోత్రము లేక ఇంటి పేరుకలవారి మధ్య వివాహాలు చేసుకోరు. మేనరికం పెళ్ళిళ్ళకు ప్రాధాన్యత ఇస్తారు. సంప్రదింపులు, కుండమార్పిడి పద్ధతుల్లోనే సాధారణంగా వివాహాలు జరుగుతాయి. విడాకులు, వితంతు వివాహాలు సాంఘికంగా ఆమోదిస్తారు. అమ్మాయిలు వివాహంలో సాంప్రదాయకంగా మేనమామ నిర్ణయానికి ప్రాధాన్యత ఇస్తారు. మేనమామ కుమారునికి కాక వేరే అతనితో పెళ్ళి చేయాల్సివస్తే, మేనమామకు కొంత మొత్తాన్ని అతని హక్కుగా ఇవ్వాలి.

వెంకటేశ్వరస్వామి, నారాయణస్వామి, నరసింహస్వామి, అంకమ్మ, కొల్లాపురమ్మ, సుంకులమ్మ, పోలేరమ్మ, యల్లమ్మ మొదలగు దేవతలను పూజిస్తారు. కులపంచాయితీ ఉంటుంది. కుల పెద్దను వారి భాషలో 'బోరోమాన్‌సాన్' (పెద్దమనిషి) అంటారు. సాంప్రదాయకంగా కుల పంచాయితీలో నిజనిర్ధారణ కోసం, వేడినూనెలో చేతులుంచడం, కాల్చిన గడ్డపారను పట్టుకోవడం, నిప్పుల్లో నడవడం మొదలగు పద్ధతులు పాటించేవారు. వీరు మాంసాహారులు, పందిమాంసం తింటారు.

**వెదురుతో బుట్టలు, గంపలు మొదలగు వస్తువులు తయారు చేసే 'మేదర' (బి.సి.లు) కులంవారు, వృత్తిలోని పోలిక ఆధారంగా ఎరుకల షెడ్యూల్డు తెగ అని క్లెయిము చేస్తుంటారు. ఎరుకల వారి గోత్రాలు, వృత్తి ఆధారిత వర్గాలు, ప్రత్యేకమైన కుర్రు భాష మేదర్లకు ఉండవు.**

**చిత్తూరు, కడప జిల్లాల్లోని 'ఏకిరి, పాల ఏకిరి లేక ఏకిలి దొర' అనే కులంవాళ్ళు ఎరుకల షెడ్యూల్డు తెగ అని క్లెయిము చేస్తుంటారు. ఎరుకలకు వీరికి వృత్తుల్లోను, ఆచారాల్లోను ఎలాంటి సంబంధాలు లేవు.**

## 32. నక్కల, కుర్వికారన్ :

**నక్కల, కుర్వికారన్ తెగ అన్ని జిల్లాల్లోను ముఖ్యంగా పట్టణ ప్రాంతాలు, పుణ్యక్షేత్రాలు మొదలగు ప్రాంతాల్లో తాత్కాలిక గుడారాల్లో చెట్ల క్రింద నివసిస్తుంటారు. ఈ తెగవారు సాంప్రదాయకంగా నక్కలను వేటాడి వాటి మాంసం తింటారు కావున నక్కల అని పేరు వచ్చిందని అంటారు. వీరినే గువ్వలోల్లు, 'షికారీ'లు అని కూడా అంటారు. తమిళనాడులోను ఆ రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లోని మన రాష్ట్రంలో కూడా 'కుర్వికారన్' అంటే పక్షులను పట్టేవారు అని పిలుస్తారు.**

**వీరి ముఖ్య వృత్తి చిన్న చిన్న జంతువుల, పక్షుల వేట, ప్లాస్టిక్ వస్తువులు (పువ్వులు, దువ్వెనలు, బొమ్మలు మొదలైనవి), సూదులు, అద్దాలు, పూసలు, కృత్రిమ ముత్యాలు అమ్ముట. కొందరు పొలాలు, చేపల/రొయ్యల చెరువుల కాపలా, రోజు కూలీ పని, కొన్ని మున్సిపాలిటీల్లో కుక్కలు, పందులు, కోతులను పట్టుకొను పనులు కూడా చేస్తారు.**

నక్కల తెగవారికి ప్రత్యేక భాష ఉంటుంది. ఈ భాషలో తమ తెగను 'వ్యాఘ్రివాలా' అని చెప్పుకుంటారు. నక్కల తెగలో భోకడోమారావాల (మేకలను బలి ఇచ్చేవారు), బేఖోమారావాల (గేదెలను బలి ఇచ్చేవారు) అని రెండు విభాగాలుంటాయి. భోకడోమారావాల విభాగంలో ధుగవ్వాల లేక ధబ్బి మరియు నూకడ్‌వాలా అని రెండు వర్గాలుంటాయి. ధుగవ్వాల వర్గంలో దత్తో, దల్‌ఖాయ్ మన్నె, మక్రియో మొదలగు వంశాలు; నూకడ్‌వాలా వర్గంలో ఖేత, భోకొ, మేవాడో, నంద/గని, నావల్, నీలాజీ, ధర్కియో, హెరో, నామో, వీత్యో మొదలగు వంశాలు ఉంటాయి. బేఖోమారావాల విభాగంలో జంబ్ల, గుజరాతి మరియు పవార్ అనే వర్గాలుంటాయి. జంబ్ల వర్గంలో హజొ/హజ, గోయిండి, జంబొ, సింగ్డి, సకు, నెంచింగ్, టెన్‌చింగ్, తొబనియో, పిత్యో, కల్‌చింగ్ మొదలగు వంశాలు; పవార్ వర్గంలో ఉబరియో, లింబో, డంబో, సెలియో మొదలగు వంశాలు ఉంటాయి. సాంప్రదాయకంగా ఒక విభాగానికి, వర్గానికి, వంశానికి చెందిన వ్యక్తులు ఇతర విభాగాలు, వర్గాలు, వంశాల వారితో వివాహము చేసుకోవాలి.

వీరు మాంసాహారులు. అన్ని రకాల మాంసాలు తింటారు. కాని భోకడోమారావాల విభాగంవారు గేదె మాంసం తినరు. అలాగే బేఖొమారావాల విభాగంవారు మేక మాంసం తినరు.

నక్కల తెగవారు నౌకడ్‌దేవి, విరఘన్, వాఘాయ్‌దేవి, జోగన్, జోగాయ్, పోలేరమ్మ, కనికాలమ్మ, దుర్గాదేవి, మధురమీనాక్షి, భద్రకాళి, పార్వతి దేవి, చాముండేశ్వరి మొదలగు దేవతలను పూజిస్తారు. వీరి ముఖ్య ఆచారం ఏమంటే ప్రతి కుటుంబంలో కూడా ఇంటి దేవతల బొమ్మలున్న వెండి ఫలకం, ఇతర పూజాసామాగ్రి, బలి ఇచ్చే జంతువుల రక్తంతో తడిపిన గుడ్డలో చుట్టిన మూట ఉంటుంది. దీన్ని 'స్వామి మూట' లేక వారి భాషలో 'మోలియ' అంటారు. ఈ స్వామి మూటను ప్రతి కుటుంబం ఒక ఆస్తిగా పరిగణించి, తండ్రి నుంచి కొడుక్కి అలా ముందు తరాల వారికి వారసత్వంగా సంక్రమింపచేస్తారు. ప్రతి కుటుంబం యజమాని తన జీవితకాలంలో ఒక్కసారైనా ఈ స్వామి మూటకు పూజలు నిర్వర్తించాలి. ఈ పండుగకు బంధువులనందరిని పిలిచి వారి విభాగం ఆచారంగా మేకలు లేక గేదెలను బలి ఇచ్చి భారీ ఎత్తున విందులు చేస్తారు.

వీరి కుల పంచాయితీని 'వాఘ్రివాలి నావోన్' అని కుల పెద్దను 'మేస్త్రీ' లేక 'మోటో ఆద్మి' అంటారు.

నక్కల/కుర్వికారన్ తెగ, షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల ఉత్తర్వులు (సవరణ) చట్టము 2002 (చట్టము నెం.10/2003)లో ప్రకటింపబడిన షెడ్యూల్డు తెగల జాబితాలో చేర్చబడినది. అంతకు ముందు 'నక్కల' అని వెనుకబడిన తరగతుల గ్రూపు (ఎ)లో ఉండినది.

హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా మరికొన్ని జిల్లాల్లోని పట్టణ ప్రాంతాల్లో నివసించే పార్ధి / నిర్‌షికారి / పిట్టలోల్లు అని చెప్పుకునే కులం వాళ్ళు వెనుకబడిన తరగతుల గ్రూపు (ఎ) నందు గుర్తింపబడ్డారు. వీరు ఇంతకుముందు, తాము పర్ధాన్ షెడ్యూల్డు తెగవారు ఒకటేనని, పర్ధాన్ కులంలో ఆడవారిని పార్ధి అంటారని కావున తమకు పర్ధాన్ షెడ్యూల్డు తెగ సర్టిఫికెట్లు ఇవ్వాలని క్లెయిము చేసేవారు. కాని సఫలీకృతులు కాలేదు.

వీరి ముఖ్యవృత్తి వివిధరకాల పక్షులను వేటాడి అమ్మడం మరియు పండ్లు కూరగాయల వ్యాపారం చేస్తుంటారు. ఇప్పుడు నక్కల తెగను షెడ్యూల్డు తెగల జాబితాలో చేర్చినందున, నక్కల వారికీ వీరికీ వృత్తిలోను, వీరి యొక్క కొన్ని ఇంటి పేర్లు నక్కలవారి వంశాల పేర్లలోను ఉన్న కొద్దిపాటి పోలికలు, సారూప్యత ఆధారంగా తాము కూడా నక్కల వారమని క్లెయిము చేస్తున్నారు. కాని వెనుకబడిన తరగతుల జాబితాలో నక్కల, పార్ధి కులాలు వేరు వేరుగా గుర్తింపబడ్డాయి. పార్ధి లేక నిర్‌షికారి కులాన్ని షెడ్యూల్డు తెగల జాబితాలో ప్రకటించలేదు కావున వీరికి షెడ్యూల్డు తెగ హోదా రాదు.

నక్కల తెగ క్రింద సర్టిఫికెట్లు ఇచ్చే ముందు అట్టి అభ్యర్థికి లేక తల్లిదండ్రులకు రక్త సంబంధీకులకు నక్కల బి.సి. లేక పార్ధి (బి.సి.) అని సర్టిఫికెట్లు ఉన్నాయా అని పరిశీలించినచో కొంతవరకు వారి క్లెయిము నిజమా కాదా అని తెలుసుకోవచ్చు.

# అధ్యాయం - 2

## 1993 సంవత్సరపు చట్టం నెం.16 మరియు సంబంధిత (రూల్స్) అనుగుణంగా షెడ్యూల్డు తెగలవారికి కులధృవీకరణ పత్రాలు జారీచేయు విధానం

ఆంధ్రప్రదేశ్ (షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, వెనుకబడిన తరగతులు) కులధృవీకరణ పత్రాల జారీ క్రమబద్ధీకరణ చట్టం–1993 (చట్టం నెం.16) మరియు సంబంధిత నిబంధనలు (రూల్సు) ఎస్.సి., ఎస్.టి., బి.సి.లకు కలిపి ఉమ్మడిగా రూపొందించబడ్డాయి. కాని ఈ పుస్తకంలో షెడ్యూల్డు తెగలకు సంబంధించిన సమాచారం మాత్రమే ఇవ్వబడింది.

### పై చట్టం మరియు నిబంధనల్లో కాంపిటెంట్ అధికారులకు అవసరమైన సెక్షన్లు, రూల్సు వివరణ:

### షెడ్యూల్డు తెగలు సెక్షన్ 2(ఐ):

భారత రాజ్యాంగం, ఆర్టికల్ 366 క్లాజు (25)లో తెల్పినవిధంగా ఆర్టికల్ 342(1) క్రింద భారత రాష్ట్రపతిచే ప్రకటించబడిన, ఆర్టికల్ 342(2) క్రింది వివిధ సంవత్సరాల్లో భారత పార్లమెంటు చేసిన చట్టాల ద్వారా సవరించబడిన జాబితాల్లో ఉన్నటువంటి తెగలను షెడ్యూల్డు తెగలుగా గుర్తించారు. అంటే 2003వ సంవత్సరంలో వెలువడ్డ జాబితాలోని షెడ్యూల్డు తెగలకు చెందిన వారికి మాత్రమే షెడ్యూల్డు తెగ ధృవీకరణ పత్రాలు ఇవ్వాలి.

### కులధృవీకరణ పత్రం (సెక్షన్ 2 (బి) మరియు రూల్ 3)

కాంపిటెంట్ అధికారిచే ఒక వ్యక్తి షెడ్యూల్డు తెగకు చెందినట్లుగా అతని/ఆమె తెగను తెలుపుతూ జారీ చేయబడే ధృవీకరణ పత్రం. ఈ కులధృవీకరణ పత్రం, జి.ఓ.నెం.58, సాంఘిక సంక్షేమ శాఖ, తేది 12.05.1997లోని అనుబంధం II లోని ఫారము III నమూనాలోనే జారీ చేయాలి (ఇది చాలా అవసరము).

### కాంపిటెంట్ అధికారి (సెక్షన్ 2(సి) రూల్ 2(సి), నిబంధన (రూల్స్)ల్లోని అనుబంధం–I మరియు జి.ఓ.ఎమ్.ఎస్.నెం.122, సాంఘిక సంక్షేమ శాఖ, తేది 01.09.1977లో ఇచ్చిన సవరణ:

షెడ్యూల్డు ప్రాంతాల్లోని తమ తమ మండల పరిధుల్లో సాధారణంగా నివసించే అన్ని షెడ్యూల్డు తెగలవారికి కులధృవీకరణ పత్రాలను సంబంధిత తహశీల్దార్లు జారీ చేయవచ్చు. కాని నాన్ షెడ్యూల్డు ప్రాంతాల్లో, తహశీల్దార్లు తమ మండలాల్లో సాధారణంగా నివసించే ఈ క్రింది

(22) షెడ్యూల్డు తెగలవారికి మాత్రమే కులధృవీకరణ పత్రాలు ఇవ్వవచ్చును.

1 అంధ్, సాదుఅంధ్;

2 భగత;

3 భిల్;

4 చెంచు;

5 గదబ, బోడోగదబ, గుటోబ్‌గదబ, కల్లాయిగదబ, పరంగిగదబ, కత్తెరగదబ, కాపుగదబ;

6 గోండు, నాయకపోడు, రాజ్‌గోండు, కొయితూర్;

7 జాతాపు;

8 కట్టు నాయకన్;

9 కోలాము, కొలవార్;

10 ఖోండ్స్, కోది, కోధు, దేశియఖోండ్స్, డొంగ్రియఖోండ్స్, టికిరియఖోండ్స్, ఏనేటిఖోండ్స్, కువింగ;

11 కోయ, డోలికోయ, గుట్టకోయ, కమ్మరకోయ, ముసరకోయ, ఒడ్డికోయ, పట్టిడికోయ, రాజకోయ, రాషకోయ, లింగధారికోయ (ఆర్డినరి), కొట్టుకోయ, భినెకోయ, రాజ్‌కోయ;

12 కులియ;

13 మాలి (అదిలాబాద్, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, మెదక్, నల్గొండ, నిజామాబాద్, వరంగల్ జిల్లాలలో కాకుండా మిగతా జిల్లాల్లో);

14 మూకదొర, నూకదొర;

15 పర్ధాన్;

16 పోర్జ;

17 రోన, రేన;

18 సవర, కాపుసవర, మలియసవర, కుట్టోసవర;

19 సుగాలి, లంబాడి, బంజారా;

20 యానాది, చల్లయానాది, కప్పలయానాది, మంచియానాది, రెడ్డియానాది;

21 ఎరుకల, కొరచ, దబ్బఎరుకల, కుంచపూరిఎరుకల, ఉప్పుఎరుకల;

22 నక్కల, కుర్వికారన్.

ఈ క్రింది మిగతా (13) షెడ్యూల్డు తెగల వారికి కులధృవీకరణ పత్రాలు జారీ చేయు అధికారం నాన్‌షెడ్యూల్డు ప్రాంతాల్లో సంబంధిత డివిజను పరిధుల్లో ఆర్.డి.ఒ./సబ్‌కలెక్టర్/ అసిస్టెంట్ కలెక్టర్లకు మాత్రమే కలదు.

1 గౌడు (ఏజన్సీ ప్రాంతాల్లో);

2 హిల్‌రెడ్లు;

3 కమ్మర;

4 కొండదొర, కుబి;

5 కొండకాపు;

6 కొండరెడ్డి;

7 కొటియ, బెంతోఒరియ, బర్తిక, దులియా, హోల్వా, సన్‌రోనా, సిద్ధోపెయికో;

8 మన్నెదొర;

9 నాయక్ (ఏజన్సీ ప్రాంతాల్లో);

10 రెడ్డిదొర;

11 వాల్మీకి (విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లోని షెడ్యూల్డు ప్రాంతాల్లో);

12 ధులియ, పెయికో, పుటియ (విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో).

**ఐటిడిఏల పరిధిలోని గ్రామాల్లో కాంపిటెంట్ అధికారుల పరిధి:**

**ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయమేమంటే కొన్ని మండలాల్లో షెడ్యూల్డు గ్రామాలు, నాన్ షెడ్యూల్డు గ్రామాలు కలిసి ఉంటాయి. షెడ్యూల్డు గ్రామాల్లో అయితేనే అన్ని తెగలకు తహశీల్దార్లు సర్టిఫికెట్లు ఇవ్వవచ్చు. అదే మండలంలోని నాన్ షెడ్యూల్డు గ్రామాల్లో తహశీల్దార్లు పైన తెలిపిన (22) తెగలకూ, సంబంధిత ఆర్.డి.ఓ./సబ్‌కలెక్టర్/అసిస్టెంట్ కలెక్టర్ మిగతా తెగలకు సర్టిఫికెట్లు జారీ చేయవచ్చును. ఇంకో విషయమేమంటే, రాష్ట్రంలోని 8 ఐటిడిఎ పరిధుల్లో షెడ్యూల్డు గ్రామాలు, నాన్‌షెడ్యూల్డు సబ్-ప్లాన్ గ్రామాలు ఉంటాయి. మీలో కొంతమందికి ఈ ఐటిడిఏ పరిధిలోని నాన్ షెడ్యూల్డు సబ్-ప్లాన్ గ్రామాలు కూడా ఏజన్సీ ప్రాంతాలే కదా, వాటిలో నివసించే అన్ని షెడ్యూల్డు జాతుల వారికి తహశీల్దార్లు సర్టిఫికెట్లు ఇవ్వవచ్చునా అని సందేహం రావచ్చు లేక అపోహ వుండవచ్చు. అట్టి నాన్ షెడ్యూల్డు సబ్-ప్లాన్ గ్రామాలు వాటి క్రింది శివారు నివాస ప్రాంతాలు, షెడ్యూల్డు లేక ఏజన్సీ గ్రామాలు కావు. వాటిల్లో పైన తెలిపిన విధంగా (22) షెడ్యూల్డు తెగలకు తహశీల్దార్లు, మిగతా (12) తెగలకు ఆర్.డి.ఓ./సబ్‌కలెక్టర్లు/అసిస్టెంట్ కలెక్టర్లు వారి వారి పరిధులకు లోబడి సర్టిఫికెట్లు ఇవ్వవచ్చును.**

ఇక్కడ మీకు ఇంకో అనుమానం కలిగే అవకాశముంది. అదేమంటే ఏజన్సీ లేక షెడ్యూల్డు ఏరియా అనే ఏరియా రెస్ట్రిక్షన్ విధింపబడిన తెగలైన గౌడు, వాల్మీకి మరియు నాయక్ తెగలవారికి సర్టిఫికెట్లు ఇచ్చే అధికారం ఆర్.డి.ఓ./సబ్‌కలెక్టర్లకు ఇవ్వబడింది. అలాగే షెడ్యూల్డు గ్రామాల్లో అన్ని తెగలకు (పై మూడు తెగలు కలిపి) సర్టిఫికెట్లు ఇచ్చే అధికారం తహశీల్దార్లకు ఇవ్వబడింది. పై మూడు తెగలవారు షెడ్యూల్డు ఏరియాలో ఉంటేనేకదా వారికి యస్.టి. హోదా వస్తుంది. అలాంటప్పుడు ఆర్.డి.ఓ./సబ్‌కలెక్టర్లు ఎలా సర్టిఫికెట్లు ఇవ్వవచ్చును? దీనిపై వివరణ ఏమంటే, ఈ మూడు తెగలకు చెందినవారు ఏజన్సీలో ఉంటే తహశీల్దార్లు, నాన్‌షెడ్యూల్డు ప్రాంతాల్లోకి వలసవచ్చి ఉంటే ఆర్.డి.ఓ./సబ్‌కలెక్టర్లు సర్టిఫికెట్లు ఇవ్వాలి. ఇలాంటి సందర్భాల్లో వలస వచ్చిన వారికి సర్టిఫికెట్లు ఇవ్వడానికి భారత ప్రభుత్వంచే జారీ చేయబడ్డ మార్గదర్శకాలు పాటించాలి. అంతేగాక, అలాంటివారి తల్లిదండ్రులు, పూర్వీకులు ఏజన్సీ/షెడ్యూల్డు ప్రాంతం నివాసులేనని సంబంధిత అభ్యర్థులు ఋజువు చేసుకోవాలి.

## సాధారణ నివాసం :

ఈ సందర్భంగా తెలుసుకోవాల్సిన మరో ముఖ్య విషయం - ఏజన్సీ ప్రాంతాల్లో కాని మైదాన ప్రాంతాల్లోకాని తమ అధికార పరిధిలోని గ్రామాలు/శివారు నివాస ప్రాంతాల్లో సాధారణ నివాసం కలిగి ఉండే షెడ్యూల్డు తెగలవారికి మాత్రమే సంబంధిత అధికారులు కులధృవీకరణ పత్రాలు జారీ చేయవచ్చును. సాధారణ నివాసం అంటే మామూలుగా అనుకునే, దరఖాస్తుదారుడు దరఖాస్తు చేసిన సమయంలో నివసించే స్థలం/గ్రామం కాదు.

భారత ప్రభుత్వం, నెం.బి.సి.**12025/2/76**-ఎస్.సి.టి.I, తేది **22.03.1977**లో జారీచేసిన ఆదేశాల ప్రకారం 'సాధారణ నివాసం' అంటే దరఖాస్తుదారుడు క్లెయిము చేసిన తెగను, సంబంధిత ప్రాంతంలో షెడ్యూల్డు తెగగా గుర్తిస్తూ రాష్ట్రపతి ప్రకటన చేసిన తేది నాటికి అతను స్థిరంగా నివసించే గ్రామం లేక నివాస స్థలం. అతను అట్టి రాష్ట్రపతి ప్రకటన తరువాత జన్మించినట్లయితే, అతని తండ్రి స్థిర నివాసంగా ఉండిన గ్రామాన్ని అతని సాధారణ నివాసంగా పరిగణించాలి. దీన్ని దృష్టిలో ఉంచుకుంటే, తన పరిధిలోని ప్రాంతంలో సాధారణ నివాసులు కాకుండ ప్రస్తుతం నివాసులై, దరఖాస్తు చేస్తే అలాంటి వారిని, వారి సాధారణ నివాసానికి సంబంధించిన అధికారి నుండి ధృవీకరణ పత్రం పొందమని సలహా ఇవ్వాలి లేకుంటే అట్టి దరఖాస్తుదారుని నివాస ప్రాంతానికి సంబంధించిన అధికారి జారీ చేసిన కులధృవీకరణ పత్రం సమర్పిస్తే అది సరైనదా కాదా అని పరీక్షించి, దాని ఆధారంగా కులధృవీకరణ పత్రం జారీ చేయవచ్చును.

## దరఖాస్తు చేసుకొను విధానము (సెక్షన్ (3), రూలు (4):

షెడ్యూల్డు తెగలకు చెందిన ఏదేని వ్యక్తి, అతని/ఆమె తల్లిదండ్రులు లేక సంరక్షకులు తమ జాతిని తెలుపుకొనుటకుగాని, ఉద్యోగాల్లోను, రాష్ట్రంలోని లేక ఇతర రాష్ట్రాల్లోని విద్యాసంస్థలో ప్రవేశంకొరకు ఉద్దేశించిన రిజర్వేషను సదుపాయాలు పొందుటకుగాని, స్థానిక సంస్థలు లేక సహకార సంస్థల్లోని ఎన్నిక కాదగ్గ పదవుల ఎన్నికల్లో పోటీ చేయడానికిగాని, షెడ్యూల్డు ప్రాంతాల్లో 5వ షెడ్యూలు క్రింద చేయబడ్డ లేక అమలులో ఉన్న ఏవేని చట్టాలు, రెగ్యులేషన్ల క్రింద ఇవ్వబడిన రక్షణలు, సదుపాయాలు పొందుటకుగాను కులధృవీకరణ పత్రం కొరకు దరఖాస్తు చేసుకొనవచ్చును. దరఖాస్తుదారుడు మైనరు అయినచో అతని తరపున తల్లిదండ్రులు లేక సంరక్షకులు సంబంధిత అధికారికి ఫారము–Iలో దరఖాస్తు చేసుకోవచ్చును.

## దరఖాస్తులను పరిశీలించి కులధృవీకరణ పత్రం జారీ చేయు విధానం (సెక్షన్ (4), రూలు (54):

ఫారము–Iలో దరఖాస్తుతోపాటు అందులో అన్ని అంశాలకు సంబంధించిన పూర్తి సమాచారం మరియు దానికి సంబంధించిన సాక్ష్యాధారాలు ఇవ్వబడినవా లేదా అని జారీచేయు అధికారిగాని అతనిచే అధికారమివ్వబడిన ఇతర అధికారిగాని క్షుణ్ణంగా పరిశీలించి, దరఖాస్తు అందినట్లు ఫారము–Iలోని నమూనాలో రసీదు ఇవ్వాలి.

దరఖాస్తుదారుడు/తల్లిదండ్రులు/సంరక్షకులు సమర్పించిన దరఖాస్తులోని సమాచారం, సంబంధిత సాక్ష్యాధారాలు సరిగ్గా ఉన్నాయని కాంపిటెంట్ అధికారి సంతృప్తి చెందినచో దరఖాస్తు అందిన తరువాతి 30 రోజుల్లో ఫారము–IIIలో కులధృవీకరణ పత్రము జారీ చేయాలి. షెడ్యూల్డు తెగల వారికిచ్చే కులధృవీకరణ పత్రంలో దరఖాస్తు దారులు తమ తెగకు సంబంధించి షెడ్యూల్డు తెగల జాతితాలోని ఏదైనా ఉపతెగకి చెందిన వారైతే అట్టి ఉపతెగని కూడా పేర్కొనాలి.

**దరఖాస్తులో ఇచ్చిన అంశాలపై విచారణ అవసరమని తలిస్తే, దరఖాస్తు దారునికి సంబంధించిన స్కూలు రికార్డులు, జనన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను పరిశీలించాలి. దరఖాస్తుదారుని తల్లిదండ్రులు, బంధువులు, వారి గురించి తెలిసిన ఇతరులను విచారించాలి. దరఖాస్తుదారుని తెగలో ఉండేటటువంటి సంబంధిత లక్షణాలైన పూజించే దేవతలు, పూజా పద్ధతులు, ఆచారాలు, వివాహం మరియు మరణ సంబంధిత పద్ధతులు, వారి తెగలోని విభాగాలు, గోత్రాలు, ఇంటి పేర్లు దరఖాస్తుదారునికి తెలుసునా, వారి కుటుంబం బంధువర్గాల్లో వాటిని పాటిస్తున్నారా అని కూడా విచారించాలి. ఇచ్చిన సమాచారంతో సంతృప్తి చెందనియెడల, సంబంధిత పూర్తి సమాచారాన్ని తెప్పించుకొనుటకు, సాక్ష్యాధారాలు సేకరించుటకు దరఖాస్తుదారుని తల్లిదండ్రులు, సంరక్షకులను**

**ఫారము–IIలో 15 రోజుల సమయంతో నోటీసు ఇచ్చి విచారణ జరుపు అధికారం కాంపిటెంట్ అధికారికి కలదు. ఈ నోటీసు ద్వారా విచారణకు హాజరవుటకు 30 రోజులకంటే ఎక్కువ సమయం ఇవ్వరాదు.**

ఫారము–IIలో ఇచ్చిన నోటీసు అందిన 30 రోజుల తరువాత దరఖాస్తుదారుడు లేక అతని తల్లిదండ్రులు లేక సంరక్షకులు విచారణకు హాజరుకానట్లయితే తన వద్దనున్న దరఖాస్తులోని సమాచారం దానికి సంబంధించిన సాక్ష్యాల ఆధారంగా దరఖాస్తుదారుని క్లెయిము/అభ్యర్థనను తోసిపుచ్చవచ్చును లేదా నిజమని సంతృప్తి చెందినచో కులధృవీకరణ పత్రం జారీ చేయవచ్చును. కాంపిటెంట్ అధికారి చట్టబద్దంగా విచారణ జరిపి విచారణలో సేకరించిన ఇతర సమాచారం, సాక్ష్యాలు, సంబంధిత వ్యక్తులు ఇచ్చిన వాంగ్మూలాలు, సమర్పించిన పత్రాలను పరిగణించి, దరఖాస్తుదారుడు షెడ్యూల్డు తెగకు చెందినవాడా కాదా అని నిర్ధారించవచ్చును లేక అతని అభ్యర్థనను త్రోసిపుచ్చవచ్చును.

కాంపిటెంట్ అధికారి, దరఖాస్తుదారుడు లేక అతని తల్లిదండ్రులు లేక సంరక్షకులకు వారి క్లెయిము/అభ్యర్థనను ఋజువు చేసుకొనే సమయాన్ని అవకాశాన్ని ఇవ్వాలి. విచారణ జరిపే స్థలం, సమయాలను చాటింపు లేదా ఇతర వీలైన పద్ధతుల ద్వారా సంబంధిత గ్రామం/నివాస ప్రాంతంలో ప్రకటించాలి. ఏదేని వ్యక్తి లేదా సంఘం, దరఖాస్తుదారుని క్లెయిము/అభ్యర్థనను వ్యతిరేకిస్తే అట్టి వ్యక్తికి/సంఘానికి తమ వాదనను సరియైన సాక్ష్యాలను వ్యక్తిగతంగా సమర్పించుటకు అవకాశమివ్వాలి. అలా అవకాశమిచ్చిన తరువాత కాంపిటెంట్ అధికారి అవసరమైన రీతిలో విచారణ జరిపి దరఖాస్తుదారుడు/తల్లిదండ్రులు/సంరక్షకుల అభ్యర్థనను దాన్ని వ్యతిరేకించిన వ్యక్తులు/సంఘాల అభ్యంతరాలను పరిగణించి ధృవీకరణ పత్రం జారీ చేయాలా లేక అభ్యర్థనను తోసిపుచ్చాలా అనే నిర్ణయం తీసుకోవాలి.

**కాంపిటెంట్ అధికారి జరిపే విచారణల్లో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామాభివృద్ధి అధికారి, గ్రామ పరిపాలనాధికారులు లేక ఇతర ఏదేని అధికారుల సహాయ సహకారాలాను తీసుకొనవచ్చును. కాని కులధృవీకరణ పత్రం జారీచేయు లేక త్రోసిపుచ్చు బాధ్యత మాత్రం జారీచేయు అధికారిపై ఉంటుంది. అంతేగాని పై సహాయక అధికారులు చేసిన విచారణ ఆధారంగా ధృవీకరణ పత్రం ఇవ్వబడింది అనడానికి వీలులేదు.**

**షెడ్యూల్డు జాతుల కులధృవీకరణ పత్రాల కోసం అభ్యర్థనను ఆమోదించుటకు లేక వ్యతిరేకించుటకు అట్టి జాతులు సాంప్రదాయకంగా తన అధికార పరిధి ప్రాంతంలో నివసించేవారు**

**కానట్లయితే సంబంధిత జిల్లా గిరిజన సంక్షేమ అధికారి లేక గిరిజన సాంస్కృతిక పరిశోధన సంస్థ, హైదరాబాద్ వారిని వారి సలహా కోసం సంప్రదించాలి. వివిధ గిరిజన జాతుల సాంప్రదాయక నివాస ప్రాంతాలు అనుబంధంలో ఇవ్వబడినవి.**

పైన తెలిపిన విధంగా విచారణ చేసి, దరఖాస్తు అందిన 60 రోజుల్లోపల, దరఖాస్తుదారుని/తల్లిదండ్రుల లేక సంరక్షకుల, కులధృవీకరణ పత్రం జారీ కోసం చేసిన అభ్యర్థన/క్లెయిమును ఆమోదించి ధృవీకరణ పత్రం జారీ చేయాలి లేదా తిరస్కరించాలి.

అభ్యర్థనను తిరస్కరించేటట్లయితే, అందుకు కారణాలను వ్రాతపూర్వకంగా నమోదు చేయాలి.

పైవిధంగా విచారణ చేసిన తరువాత కూడా ఏదేని అభ్యర్థన/క్లెయిములు సందేహంగా వుంటే, వాటిని జిల్లాస్థాయి పరిశీలన సంఘం చైర్మన్ అయిన జాయింట్ కలెక్టరుగారికి వారి సిఫార్సుల కొరకు పంపి, వారు ఇచ్చే సిఫార్సులను అనుసరించి దరఖాస్తుదారులు అభ్యర్థనను ఆమోదించవచ్చును లేక తిరస్కరించవచ్చును.

## ఋజువు చేసుకొనవలసిన బాధ్యత: సెక్షన్ (6) మరియు రూలు (6):

కులధృవీకరణ పత్రం కోసం కాంపిటెంట్ అధికారికి దరఖాస్తు సమర్పించినప్పుడు అట్టి అధికారిగాని, ముందే ధృవీకరణ పత్రం పొందిన వ్యక్తులు, వారి సర్టిఫికెట్ల విషయంలో సర్టిఫికెట్టు రద్దుచేయు అధికారం గల జిల్లా కలెక్టరుగాని, అప్పెలేట్ అధికారిగాని, జిల్లాస్థాయి/రాష్ట్రస్థాయి పరిశీలన సంఘాలుగాని కాలానుగుణంగా జరుపు విచారణల్లో తాను షెడ్యూల్డు తెగకు చెందిన వాడినని ఋజువు చేసుకొను మరియు అవసరమైన సాక్ష్యాలు, పత్రాలు దాఖలు చేయవలసిన బాధ్యత దరఖాస్తుదారుడు లేక సర్టిఫికెట్ కలిగియున్న వ్యక్తులపైనే ఉంటుంది.

## అప్పీలు : సెక్షన్ 7 (1) మరియు రూలు (10):

సెక్షన్ 4(1) మరియు రూలు 5(హెచ్) క్రింద అభ్యర్థి క్లెయిమును తిరస్కరిస్తూ కాంపిటెంట్ అధికారి ఇచ్చిన ఉత్తర్వుపై అట్టి ఉత్తర్వు పొందిన తేదీనుండి (30) రోజుల్లో సదరు అభ్యర్థి జిల్లా కలెక్టరుకు అప్పీలు చేసుకొనవచ్చును. దీనిపై జిల్లా కలెక్టరు సదరు అభ్యర్థి చేసిన అప్పీలులోని కారణాలను పరిశీలించి, అవసరమైతే సంబంధిత సాక్ష్యాలు, పత్రాలు తెప్పించుకొని, అభ్యర్థి తన వాదనను వినిపించే అవకాశం కల్పించిన తరువాత, తిరస్కరించిన ఉత్తర్వును ఆమోదించవచ్చును లేదా అట్టి ఉత్తర్వును రద్దు చేస్తూ కులధృవీకరణ పత్రం జారీ చేయమని కాంపిటెంట్ అధికారిని ఆదేశించవచ్చును.

## కాంపిటెంట్ అధికారికి సివిల్ కోర్టు అధికారులు : సెక్షన్ (9) మరియు రూలు (14):

ఈ చట్టం క్రింద నిర్వహించే విచారణల్లో తహశీల్దారు, ఆర్.డి.ఓ./సబ్ కలెక్టరు/అసిస్టెంట్ కలెక్టరు, జిల్లాస్థాయి మరియు రాష్ట్రస్థాయి పరిశీలన కమిటీలు, జిల్లా కలెక్టరు ప్రభుత్వానికి, సివిల్ ప్రొసీజర్ కోడ్ 1908 క్రింద దావాల విచారణలో ఏదేని సివిల్ కోర్టుకుగల ఈ క్రింది అధికారాలుంటాయి.

ఎ) ఎవరైనా వ్యక్తిని విచారణకొరకు హాజరుకమ్మని సమన్లు జారీ చేయడం, వారిని ప్రమాణ పూర్వకంగా విచారించడం.

బి) ఏవేని పత్రాలను కనుగొని సమర్పించాలని కోరటం.

సి) అఫిడవిట్ల ద్వారా సాక్ష్యాలను రాబట్టడం.

డి) ఏదేని న్యాయస్థానం లేక కార్యాలయం నుండి ప్రజాసంబంధ రికార్డు లేక నకళ్ళను కోరడం.

ఇ) సాక్ష్యాలు, పత్రాలు పరిశీలనకు కమీషన్లకు జారీచేయడం.

ఎఫ్) స్థానిక విచారణ, తనిఖీలు నిర్వహించడం.

## నకిలీ కులధృవీకరణ పత్రాలను రద్దుచేయుట: సెక్షన్ (5) రూలు (9):

జారీ చేసిన కులధృవీకరణ పత్రాలపై ఏవైనా ఫిర్యాదులు వచ్చినప్పుడు, విచారణ జరిపించి అవి నకిలీవని తేలితే వాటిని రద్దు చేయు అధికారం **జిల్లా కలెక్టరుకు మరియు ప్రభుత్వానికి** మాత్రమే కలదు.

## కులధృవీకరణ పత్రం యొక్క చెల్లుబాటు : రూలు (16):

కాంపిటెంట్ అధికారిచే ఈ చట్టం మరియు నిబంధనల క్రింద జారీ చేయబడిన కుల, నివాస, జనన తేది ధృవీకరణ పత్రం **శాశ్వతంగా చెల్లుబాటు అవుతుంది**. కావున ఒకసారి పై ధృవీకరణ పత్రం జారీ చేస్తే అదే వ్యక్తికి ఇంకో పత్రం జారీ చేయరాదు.

## కులధృవీకరణ పత్రం నకలు జారీ చేయుట : రూలు (17):

ఎవరైనా కులధృవీకరణ పత్రం పోగొట్టుకుంటే వారికి నకలు పత్రం జారీ చేయవచ్చును. ఇందుకోసం, అసలు ధృవీకరణ పత్రం పోగొట్టుకున్న వ్యక్తి రూ.10/-లు విలువగల స్టాంపు పేపర్‌పై, ధృవీకరణ పత్రం పోగొట్టుకోవడానికి దారితీసిన పరిస్థితులను వివరిస్తూ, ఒక అఫిడవిట్‌ను జతచేస్తూ దరఖాస్తును సంబంధిత అధికారికి వెంటనే ఇవ్వాలి. అందులో తన అసలు ధృవీకరణ పత్రము యొక్క వివరాలు తెలియజేయాలి. సంబంధిత అధికారి తమ రికార్డుల్లో పై వివరాలను పరిశీలించి, నకలు కుల, నివాస, జనన తేది ధృవీకరణ పత్రం జారీ చేయాలి.

ఇందుకోసం లేదా ఏదేని జారీ చేయబడ్డ కులధృవీకరణ పత్రంపై విచారణ చేయవలసి వచ్చినప్పుడు, వాటి వివరాలు సులభంగా తెలుసుకోవడానికి వీలుగా తమ కార్యాలయం నుండి జారీ చేయబడ్డ అన్ని కులధృవీకరణ పత్రాలకు సంబంధించి క్రింది వివరాలను నెలవారిగా ఒక రిజిస్టరులో నమోదు చేయడం చాలా అవసరం.

1 వరుస సంఖ్య, సర్టిఫికెట్ సంఖ్య

2 జారీ చేసిన తేది

3 అభ్యర్థి పేరు

4 తల్లి / తండ్రి / సంరక్షకుని పేరు

5 సాధారణ నివాస స్థలం

6 అభ్యర్థి తెగ / ఉపతెగ పేరు

7 కులధృవీకరణకు అభ్యర్థి సమర్పించిన లేదా అధికారి సేకరించిన / పరిశీలించిన సాక్ష్యాదారాలు / పత్రాలు మరియు చేసిన విచారణ వివరాలు.

**ఈ చట్టం క్రింద నిర్ణీతమైన కులధృవీకరణ పత్రం శాశ్వతమైనది కావున 1997కు ముందు కులధృవీకరణ పత్రాలు పొందిన వ్యక్తులు కూడా మరల శాశ్వత కులధృవీకరణ పత్రం జారీకి దరఖాస్తు చేసుకుంటారు. అలాంటి సందర్భాల్లో, ఇంతకుముందే కులధృవీకరణ పత్రం జారీ అయింది కనుక దాని ఆధారంతోనే ఈ చట్టం క్రింద కులధృవీకరణ పత్రం ఇవ్వడం సరికాదు. దానిపై ఈ చట్టం, నిబంధనల ప్రకారం విచారణ జరిపి, సాక్ష్యాధారాలను పరిశీలించిన తరువాతనే శాశ్వత కులధృవీకరణ పత్రం ఇవ్వాలి.**

**మినహాయింపు క్లాజు : సెక్షన్ (21), రూలు (21):**

1997 సంవత్సరానికి ముందే కాంపిటెంట్ అధికారిచే ఇవ్వబడిన కులధృవీకరణ పత్రాలు కూడ వాటిని ఏ కారణాలతోనైనా రద్దు చేయకపోతే అవి చెల్లుబాటు అవుతాయి మరియు వాటిని ఈ చట్టం మరియు రూల్స్ ప్రకారం ఇచ్చినట్లుగానే పరిగణించాలి.

**ఈ సందర్భంగా గుర్తుంచుకోవలసింది ఏమంటే కొందరు వ్యక్తులు తమ శాశ్వత కుల ధృవీకరణ పత్రాలు అసలు కాపీలు తాము ప్రవేశించిన విద్యాసంస్థలవారు లేక ఉద్యోగంలో చేరిన కార్యాలయాలవారు మొదలగువారు తీసుకున్నారని అందువల్ల మరో కులధృవీకరణ పత్రం జారీ చేయమని దరఖాస్తు చేస్తుంటారు. ఈ కారణంగా మరో ఒరిజినల్ సర్టిఫికెట్ జారీ చేయకూడదు.**

**సాంఘిక సంక్షేమ శాఖ వారి ఇ.మెమో.నెం.14355/ఎస్.డబ్ల్యు.డి./2002-2, తేది 08.04.2004లో అన్ని గవర్నమెంటు డిపార్ట్‌మెంట్లు / ఏజన్సీలు, అభ్యర్థులు సమర్పించే ఒరిజినల్**

**కుల, నివాస, జనన తేదీల ధృవపత్రాలను పరిశీలించి, తమ రికార్డుకోసం అట్టి పత్రాల అటెస్టెడ్ కాపీలను ఉంచుకొని, ఒరిజినల్ ధృవపత్రాలను అభ్యర్థులకు వాపసు చేయాలని ఆదేశాలు ఇచ్చి ఉన్నందున మళ్ళీ మళ్ళీ ధృవపత్రాలు ఇవ్వరాదని, వారు సమర్పించిన కార్యాలయాలు, విద్యా సంస్థల నుండి వెనక్కు తెచ్చుకోమని తెలపాలి.**

## తాత్కాలిక ప్రవేశం / నియామకం : రూలు (19):

విద్యా సంస్థల్లో ప్రవేశానికి / కార్యాలయాలు, ఉద్యోగాల్లో నియామకానికి సంబంధించి ఆఖరి తేది దాటిపోతున్నప్పుడు అభ్యర్థికి, చట్ట ప్రకారం విచారణ జరిపి కుల, నివాస, జనన తేది ధృవీకరణ పత్రం జారీ చేయుటకు ఆలస్యం అవుతున్న సందర్భంలో కాంపిటెంట్ అధికారి, సంబంధిత విద్యా సంస్థ ప్రన్సిపాల్‌కు లేక నియామకం చేసే అధికారికి గాని, అభ్యర్థి లేదా తల్లిదండ్రులు / సంరక్షకులు కాంపిటెంట్ అధికారికి ఇచ్చిన దరఖాస్తు ఫారం–Iలోని ప్రకటన ఆధారంగా అభ్యర్థికి తాత్కాలిక ప్రవేశం లేక నియామకం ఇవ్వమని తెలియజేయవచ్చును. ఇలాంటి తాత్కాలిక ప్రవేశం లేదా నియామకం కాంపిటెంట్ అధికారి సమాచారం ఇచ్చిన తేదీ నుండి మూడు నెలల కాలం మాత్రమే చెల్లుబాటు అవుతుంది మరియు కాంపిటెంట్ అధికారి కులధృవీకరణ పత్రం జారీచేసిన వెంటనే రద్దు అవుతుంది. అంటే పై విధంగా తాత్కాలిక ప్రవేశం/నియామకానికి సమాచారమిచ్చిన తేదీనుండి 3 నెలల కాలంలోగా కాంపిటెంట్ అధికారి విచారణ పూర్తిచేసి సర్టిఫికెట్ ఇవ్వడంగాని, త్రోసిపుచ్చడంగాని చేయాలి. లేనిచో తాత్కాలిక ప్రవేశం/నియామకం తరువాత జరిగిన ఆలస్యాన్ని సాకుగా చూపి, కోర్టు ఉత్తర్వుల ద్వారా కొనసాగే అవకాశముంటుంది.

ఇక్కడ గుర్తుంచుకోవలసి విషయమేమంటే పైన పేర్కొన్న తాత్కాలిక ప్రవేశం లేదా నియామకానికి కల్పించబడిన వెసులుబాటు మొదటిసారి కులధృవీకరణ జారీ చేయుటలో ఆలస్యం అయ్యే సందర్భంలో మాత్రమే కలదు. అంతకుముందే జారీ చేయబడ్డ కులధృవీకరణ పత్రాలు అసలైనవాకాదా అని చేయు విచారణల విషయంలో కాదు.

## ఫిర్యాదులు : రూలు (18):

ఎవరేని ఉద్యోగి / ఉద్యోగములో చేరు వ్యక్తి / విద్యార్థి యొక్క షెడ్యూల్డు తెగ కులధృవీకరణ పత్రాలపై ఫిర్యాదులు వచ్చినప్పుడు సంబంధిత ఉద్యోగమిచ్చు అధికారి లేక విద్యా సంస్థలు అట్టి ఫిర్యాదులను, ఆ ధృవీకరణ పత్రాలు ఏ జిల్లాకు చెందిన కాంపిటెంట్ అధికారి జారీ చేశారో ఆ జిల్లా కలెక్టరుకు మాత్రమే పంపించవలసి ఉంటుంది. అట్లాంటి ఫిర్యాదులేవైనా తహశీల్దార్లకు/ ఆర్.డి.ఓలు/సబ్ కలెక్టర్లకు అందిన యెడల వాటిని సంబంధిత జిల్లా కలెక్టర్లకు పంపాలి.

# అధ్యాయం - 3

## షెడ్యూల్డు తెగ సర్టిఫికెట్లు మంజూరు చేయుటపై భారత మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలచే జారీ చేయబడిన వివరణలు

### 1) వివాహము ద్వారా షెడ్యూల్డు తెగ హోదా :

షెడ్యూల్డు తెగకు చెందని వ్యక్తులు షెడ్యూల్డు తెగకు చెందిన వ్యక్తులను వివాహము చేసుకుంటే అట్టి వ్యక్తులకు షెడ్యూల్డు తెగ హోదా రాదు. అలాగే ఇతర కులాలవారిని వివాహము చేసుకునే షెడ్యూల్డు తెగవారికి ఆ హోదా పోదు.

### 2) పుట్టుక ద్వారా షెడ్యూల్డు తెగ హోదా :

ఏదేని వ్యక్తి జన్మతహా షెడ్యూల్డు తెగకు చెందినట్లు క్లెయిము చేసినప్పుడు ఈ క్రింది అంశాలు పరిశీలించాలి. (భారత ప్రభుత్వం నెం.35/1/72–ఆర్.యు (ఎస్.సి.టి.–V)లోని ఆదేశాలు.

ఎ) అలాంటి వ్యక్తి అతని తల్లిదండ్రులు క్లెయిము చేసిన షెడ్యూల్డు తెగకు చెందిన వారేనా?

బి) అలా క్లెయిము చేసిన తెగ రాష్ట్రపతి ఉత్తర్వుల్లో (కాలానుగుణంగా సవరింపబడిన) షెడ్యూల్డు తెగల జాబితాలో గుర్తింపబడిందా?

సి) క్లెయిము చేసిన వ్యక్తి మన రాష్ట్రానికి మరియు అతను క్లెయిము చేసిన షెడ్యూల్డు తెగల జాబితాలో షెడ్యూల్డు తెగగా గుర్తింపబడిందో, ఆ ప్రాంతానికి చెందిన వాడేనా?

డి) షెడ్యూల్డు తెగవారు ఏ మతాన్ని స్వీకరించినా వారు షెడ్యూల్డు తెగగానే గుర్తింపబడతారు.

### 3) దత్తత ద్వారా షెడ్యూల్డు తెగ హోదా :

షెడ్యూల్డు తెగకు చెందనటువంటి వ్యక్తిని షెడ్యూల్డు తెగకు చెందిన తల్లిదండ్రులు దత్తత తీసుకున్నారని అందువల్ల అలాంటి దత్తత తీసుకోబడిన వ్యక్తులు కూడా షెడ్యూల్డు తెగకు చెందిన వారని క్లెయిము చేస్తుంటారు. దత్తత రిజిస్ట్రేషన్ ప్రతులను కూడా సమర్పిస్తుంటారు. అలాంటి దత్తత తీసుకోబడిన పిల్లలకు/వ్యక్తులకు షెడ్యూల్డు తెగ హోదారాదు.

**ఎందుకంటే, ‘హిందూ అడాప్షన్ మరియు మెయింటెనెన్స్ యాక్టు, 1956’లోని సెక్షన్ 2(2) ప్రకారం ఈ చట్టంలోని ఏ అంశము కూడా, రాజ్యాంగంలోని ఆర్టికల్ (366), క్లాజు (25)లో తెలుపబడిన షెడ్యూల్డు తెగల సభ్యులకు, భారత ప్రభుత్వం గెజిట్ ప్రకటన ద్వారా ఆదేశిస్తే తప్ప, వర్తించవు. అలాంటి ఆదేశాలు ఏవీ లేనందున, దత్తత ద్వారా షెడ్యూల్డు తెగ హోదా రాదు. అలాంటి క్లెయిముల్లో సర్టిఫికెట్లు నిరాకరించాలి.**

**రిట్ పిటీషన్ నెం.11914/1985 నందు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పులో షెడ్యూల్డు తెగకు చెందని వ్యక్తులు షెడ్యూల్డు తెగ వారికి దత్తత పోవడం ఆచార పరంగా వ్యక్తిగత కారణాలతో అనుమతించవచ్చుగాని, రాజ్యాంగ ప్రయోజనాల కోసం కాదు. అలాంటి వ్యక్తులు షెడ్యూల్డు తెగకు చెందినవారుగా పరిగణింపబడరు అని నిర్ధారించబడింది.**

### 4) కులాంతర వివాహాలు :

### ఎ) కులాంతర వివాహం చేసుకున్న దంపతుల్లో ఒకరు షెడ్యూల్డు తెగ అయితే పిల్లల సాంఘిక హోదా :

గిరిజన, గిరిజనేతర వ్యక్తుల మధ్య కులాంతర వివాహం జరిగి వారికి జన్మించిన పిల్లలు షెడ్యూల్డు తెగకు చెందినవారని క్లెయిము చేస్తుంటారు. ఈ అంశం పై భారత ప్రభుత్వంచే లేఖ నెం.39/37/1973–ఎస్.సి.టి.–1, తేది 04.03.1975 మరియు నెం.39387/73–ఎస్.సి.టి.–1, తేది 21.05.1977 నందు ఈ క్రింది మార్గదర్శకాలు ఇవ్వబడ్డాయి.

విల్సన్‌రీడ్ Vs సి.ఎస్.బూత్ కేసులో (ఏ.ఐ.ఆర్.1958, పేజి.128)లో అస్సాం హైకోర్టు ఇచ్చిన "ఒక వ్యక్తి సాంఘిక హోదాను నిర్ణయించే కొలమానం అతని రక్త శుద్ధత (ఎవరి రక్తం పంచుకొని పుట్టాడు) కానేరదు. కాని అతను ఏ తెగ (ట్రైబ్) యొక్క ఆచారాలను, జీవన విధానాలను పాటిస్తున్నాడు, అతన్ని ఆ తెగ ఏ విధంగా పరిగణిస్తున్నారు అనేది చూడాలి", తీర్పును, అలాగే, ముత్తు స్వామి ముదలియార్ Vs ముసలమాన్ ముదలియార్ కేసునందు, మద్రాసు హైకోర్టు ఇచ్చిన "ఒక వర్గము లేక తెగ ఇంకో కులంగా క్లెయిము చేయడం అసాధారణమేమి కాదు, కాని ఆ ఇంకో కులం వారి క్లెయిమును గుర్తిస్తే వారిని ఆ క్లెయిము చేసిన వర్గం/తెగకు చెందినట్లుగా పరిగణించవచ్చును" అనే తీర్పును, అదే విధంగా వి.వి.గిరి Vs డి.ఎస్.దొర (ఎ.ఐ.ఆర్.1959, ఎస్.సి.1318, పేజి.1327) కేసునందు సుప్రీం కోర్టు ఇచ్చిన "ఒక వ్యక్తి యొక్క కుల హోదా, ఆ వ్యక్తి ఏకులంలో ప్రవేశం కోరుతున్నాడో అట్టి కులం వారిచే అతను పొందే గుర్తింపును అనుసరించి నిర్ధారించాలి" అనే తీర్పులను బట్టి గిరిజన, గిరిజనేతర వ్యక్తుల వివాహం ద్వారా పుట్టిన పిల్లల హోదా, ఆ తెగ, వారికి ఇచ్చే గుర్తింపు, వారి తెగకు చెందిన వాడిగా అంగీకరించుట (ఆ తెగ పితృ స్వామికం లేక మాతృస్వామికమైనా) అన్నదే ముఖ్యాంశాలు. అట్టి పిల్లలను, ఆ షెడ్యూల్డు తెగ, వారి తెగకు చెందినవారుగా అంగీకరించే దానిపైనే అతని హోదా ఆధారపడి ఉంటుంది. ఇది సాధారణ న్యాయ స్థితి. కాని ఇలాంటి ప్రతి కేసును అందులోని వాస్తవాలను, పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలి. ముఖ్యంగా ఈ క్రింది విషయాలను పరిశీలించాలి.

1 తల్లిదండ్రుల కులాంతర వివాహాన్ని క్లెయిము చేయబడిన షెడ్యూల్డు తెగవారు అంగీకరించినారా?

2 పిల్లలు, క్లెయిము చేయబడిన తెగయొక్క ఆచార వ్యవహారాలకు అనుగుణంగా పెరిగినారా?

3 పిల్లలు, సాధారణంగా షెడ్యూల్డు తెగలవారు అనుభవించే సాంఘిక, ఆర్థిక, ఆరోగ్య, విద్యాపరమైన అసమానతలను, లేమి తనాన్ని అనుభవిస్తూ పెరిగినారా?

**బి)** అలాగే కులాంతర వివాహం చేసుకున్న దంపతులు షెడ్యూల్డు తెగలోని వేరు వేరు ఉప తెగలకు చెందినవారైనప్పుడు, వారి పిల్లలు ఏ ఉపతెగకు చెందినవారు అనే అంశంలో కూడా పై విధంగానే అట్టి పిల్లల్ని ఏ ఉపతెగవారు గుర్తించి, తమ తెగ వారిగా అంగీకరించినారో పరిశీలించి ఆ ఉపతెగకు చెందినవారుగా షెడ్యూల్డు తెగ ధృవీకరణ పత్రం జారీ చేయాలి.

షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు మరియు వెనుకబడిన తరగతులవారికి గల సదుపాయాలను కులాంతర వివాహాల పిల్లలకు కూడా వర్తింపజేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము జి.వొ.యం.యస్.నెం.371, ఉపాధి మరియు సాంఘిక సంక్షేమ శాఖ, తేది 13.04.1976, ఉత్తర్వులు ఇచ్చియున్నారు. దాని ప్రకారం కులాంతర వివాహాలు చేసుకున్న దంపతుల్లో ఒకరు షెడ్యూల్డు కులం లేక షెడ్యూల్డు తెగ లేక వెనుకబడిన తరగతులకు చెందిన వారైతే వారి పిల్లలు భారత ప్రభుత్వ లేఖ నెం.39/37/73–ఎస్.సి.టి.1, తేది 04.03.1975 నందు ఇవ్వబడిన మార్గదర్శకాల ప్రకారం షెడ్యూల్డు కులం/ షెడ్యూల్డు తెగ/వెనుకబడిన తరగతుల వారిగా నిర్ధారింపబడినట్లయితే వారికి ఆ కులం/తెగ/తరగతి వారికి ఇచ్చే చట్టబద్ధ రాయితీలు (అనగా ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు) ఇవ్వబడతాయి.

కాని విద్యా సంస్థలు, వృత్తి విద్యాకళాశాలల్లో ప్రవేశానికి సంబంధించి, అట్టి పిల్లలు వారి తల్లిదండ్రుల కులంలో ఏది తక్కువ అయితే దానికి చెందినట్లుగా భావించి దానికి సంబంధించిన సీట్ల రిజర్వేషనుకు వారు అర్హులు అని పేర్కొనబడినది.

పై జి.ఓ.ఎం.ఎస్.నెం.371లోని మొదటి పారాలోని ఉత్తర్వుకు 2వ పేరా విరుద్ధంగా వున్నందున, 2వ పెరాను తొలగిస్తూ, జి.ఓ.ఎం.ఎస్.నెం.91, తేది 03.10.2007 ద్వారా సవరణ ఇవ్వబడినది. కావున కులాంతర వివాహం చేసుకున్న దంపతుల పిల్లలకు జి.ఓ.ఎం.ఎస్.నెం.371 లోని మొదటి పేరా క్రింద పేర్కొనబడిన భారత ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రతి కేసును క్షుణ్ణంగా విచారణ చేసి కులధృవీకరణ పత్రాలు ఇవ్వాలి, అంతేగాని, విద్యాసంస్థల్లో ప్రవేశం కోసమని విచారణ జరుపకుండా వారు క్లెయిము చేసిన విధంగా సర్టిఫికెట్లు ఇవ్వరాదు.

## 5) వలసదారులకు షెడ్యూల్డు తెగ ధృవీకరణ పత్రాలు జారీ చేయు విధానం :

ఒక వ్యక్తిగాని, కుటుంబంగాని లేక కుటుంబాల సముదాయం తమ బ్రతుకుతెరువు కోసం, చదువుకోసం లేక ఉద్యోగంకోసం తమ స్థిర నివాసం/సాధారణ నివాస స్థలం/ప్రాంతము నుండి ఇతర ప్రాంతాలకు/రాష్ట్రాలకు వలస వచ్చినప్పుడు అటువంటి వ్యక్తులకు షెడ్యూల్డు తెగ సర్టిఫికెట్లు ఇచ్చుటలో లేక వారికి ఇంతకు ముందే ఇవ్వబడిన సర్టిఫికెట్లు సరియైనవా కావా అని చేయు విచారణల్లో అనుసరించవలసిన విధానం గూర్చి తెలుసుకుందాము.

ఈ అంశానికి సంబంధించి వలసరావడం/వెళ్ళడం అనేది ఈ క్రింది విధంగా ఉండవచ్చు.

**ఎ) సాంప్రదాయక నివాస ప్రాంతమునుండి లేక తమ కుటుంబం యొక్క స్థిర లేక సాధారణ నివాస గ్రామంనుండి అదే రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు వెళ్ళడం.**

**బి) షెడ్యూల్డు తెగల జాబితాలో కొన్ని తెగలకు నిర్దేశించిన ఏజన్సీ/షెడ్యూల్డు ప్రాంతం నుండి లేక జిల్లాలనుండి రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు వెళ్ళడం.**

**సి) తమ రాష్ట్రంనుండి ఇతర రాష్ట్రాలకు వెళ్ళడం.**

ఎ) అనుబంధంలో ఇవ్వబడిన ఆయా షెడ్యూల్డు తెగలకు సంబంధించిన సాంప్రదాయక నివాస ప్రాంతాలకు చెందిన తెగలవారు ఇతర జిల్లాలనుండి క్లెయిము చేసినప్పుడు, ఉదాహరణకు కొండరెడ్డి తెగకు చెందినట్లుగా, ఖమ్మం, ఉభయగోదావరి జిల్లాలు కాకుండా ఇతర జిల్లాల్లోనూ, కమ్మర తెగవారిగా విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల్లో కాక ఇతర జిల్లాల్లోను, మాలి తెగవారు తెలంగాణ జిల్లాల్లోను, తోటి తెగవారు తెలంగాణేతర జిల్లాల్లో క్లెయిము చేసినప్పుడు, ఆయా జిల్లాల గిరిజన సంక్షేమ అధికారులనుగాని, గిరిజన సాంస్కృతిక పరిశోధన మరియు శిక్షణ సంస్థ (టి.సి.ఆర్.&టి.ఐ.), హైదరాబాదువారిని అట్టి తెగల ఆచార వ్యవహారాలు, వృత్తులు మొదలగు వాటిపై సంప్రదించి వారి సలహా మేరకు చర్య తీసుకోవాలి. [సెక్షన్ (4) మరియు రూలు (5జి)]

**తమ స్థిర నివాసం లేక సాధారణ నివాస గ్రామంనుండి రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు బ్రతుకుతెరువుకోసం ఉద్యోగరీత్యా వలస వెళ్ళిన వారి విషయంలో ఇంతకుముందు చెప్పిన విధంగా (పేజి-6లో) వారి స్థిర/సాధారణ నివాస గ్రామానికి సంబంధించిన కాంపిటెంట్ అధికారినుండి సర్టిఫికెట్ తీసుకొనమని లేక అట్టి వ్యక్తుల తల్లిదండ్రులకు సంబంధిత కాంపిటెంట్ అధికారి ఇచ్చిన సర్టిఫికెట్ ఉంటే అది సరియైనది అని నిర్ధారణ చేసుకొని, అట్టి అభ్యర్థులకు సర్టిఫికెట్ జారీ చేయాలి.**

బి) షెడ్యూల్డు తెగల జాబితాలో గౌడు, నాయక్ మరియు వాల్మీకి తెగలు ఏజన్సీ ప్రాంతంలోనే షెడ్యూల్డు తెగలని నివాస ప్రాంత పరిమితి (ఏరియా రెస్ట్రిక్షన్) విధించబడినది. అలాగే మాలి తెగ (తెలంగాణేతర ప్రాంతంలోను), తోటితెగ తెలంగాణాలో మాత్రమే షెడ్యూల్డు తెగలుగా గుర్తించ బడ్డాయి. **పై తెగలవారు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళినా కూడా షెడ్యూల్డు తెగలుగానే గుర్తించి సర్టిఫికెట్లు జారీ చేయాలి. కాని అట్టి అభ్యర్థులు, వారి తల్లిదండ్రులుగాని, పూర్వీకులుగాని తమ ఏజన్సీ ప్రాంతంలోని ఏ గ్రామాలనుండి లేక నిర్దిష్ట ప్రాంతాలనుండి వలస వచ్చినట్లు, ఆయా ప్రాంతాల్లోని తమ బంధువులు, అక్కడ వారి ఆచార వ్యవహారాల వివరాలను తెలియబరుస్తూ సంబంధిత ఋజువులు, సాక్ష్యాలు, పత్రాలు సమర్పించి వారు క్లెయిము చేసిన తెగలకు చెందిన వారుగా ఋజువు చేసుకోవాలి. అలా ఋజువు చేసుకోకుండా, వలసవచ్చినట్లు చెప్పినంతమాత్రాన, వారికి ఎస్.టి. హోదా రాదు. ఇలాంటి కేసుల్లో, అభ్యర్థులు తాము వారి తెగకు సంబంధించిన ఏరియా రెస్ట్రిక్షన్ గల ప్రాంతాలనుండి వలస వెళ్ళినట్లు సంబంధిత తహశీల్దార్లు/మండల రెవెన్యూ అధికారులనుండి వలస ధృవీకరణ పత్రం (మైగ్రేషన్ సర్టిఫికెట్) కూడా ధాఖలు చేస్తుంటారు. కాని అందులో అభ్యర్థి కుటుంబం ఫలానా గ్రామం నుండి వలస వెళ్ళినారని మాత్రమే పేర్కొనబడి వుంటుంది. ఇలాంటి సర్టిఫికెట్ల ఆధారంగా ఎస్.టి. సర్టిఫికెట్లు జారీ చేయరాదు.**

సి) ఇతర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలనుండి మన రాష్ట్రానికి వలస వచ్చినవారికి సంబంధించి కులధృవీకరణ పత్రాలు జారీ చేయుటకు, భారత ప్రభుత్వ లేఖ నెం.16014/1/82–ఎస్.సి.&బి.సి.'డి'–1, తేది.18.11.1982 మరియు 06.08.1984నందు మార్గదర్శకాలు ఇవ్వబడ్డాయి. వీటి ప్రకారం **ఒక రాష్ట్రంలో షెడ్యూల్డు తెగలకు చెందిన వ్యక్తి ఇంకో రాష్ట్రానికి వలస వెళితే అతని తెగ పేరు, వలస వచ్చిన / వెళ్ళిన రాష్ట్రంలో షెడ్యూల్డు తెగల జాబితాలో ఉన్నా లేకున్నా, అతని షెడ్యూల్డు తెగ హోదా మారదు/తొలదిపోదు. కావున అట్టి వ్యక్తి, తన తల్లిదండ్రులకు అతని స్వంత రాష్ట్రంలో, సంబంధిత కాంపిటెంట్ అధికారి ఇచ్చిన సర్టిఫికెట్‌ను సమర్పించాలి. అట్టి సర్టిఫికెట్ సరియైనదా కాదా అని ఆ రాష్ట్రంలో జారీ చేసిన అధికారి నుండి రిపోర్టు తెప్పించుకున్న తరువాత, మన రాష్ట్రంలో అతనికి కులధృవీకరణ పత్రం ఇవ్వవచ్చును. కాని అట్టి కులధృవీకరణ పత్రం ఆధారంగా, వారికి వలసవచ్చిన రాష్ట్రంలోని రిజర్వేషను సదుపాయాలకు రక్షణలకు అర్హత రాదు. అట్టి సదుపాయాలను వారి స్వంత రాష్ట్రంలోనే పొందగలరు. అట్టివారు కేంద్ర ప్రభుత్వము, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, ఏజన్సీలలో రిజర్వేషను, ఇతర సదుపాయాలు పొందవచ్చును.**

ఈ విధంగా వలసదారులకు ఇచ్చే కులధృవీకరణ పత్రంలో ఫలానా రాష్ట్రం, జిల్లా, డివిజను, తాలూకాకు చెందిన అతని తండ్రికి ఫలానా అధికారి ఇచ్చిన కులధృవీకరణ పత్రం ఆధారంగా అతను ఫలానా షెడ్యూల్డు తెగకు చెందినవాడు అని ప్రత్యేకంగా పేర్కొనాలి. ఈ

వివరాలు వ్రాయడానికి మన రాష్ట్ర కులధృవీకరణ పత్రం నమూనాలో వీలు లేనందున, ప్రత్యేకంగా నోట్ చేయాలి.

ఇలాంటి ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చే వారి విషయంలో గుర్తుంచుకోవలసిన ముఖ్య అంశాలు ఏవంటే,

**ఇతర రాష్ట్రాల్లో షెడ్యూల్డు తెగలు కానటువంటి కులాలు మన రాష్ట్ర జాబితాలో షెడ్యూల్డు తెగలుగా ఉండవచ్చు. ఉదాహరణకు మహారాష్ట్రలో సుగాలి/లంబాడి/బంజార కులం వెనుకబడిన తరగతుల జాబితాలోను, కర్ణాటక రాష్ట్రంలో షెడ్యూల్డు కులాల జాబితాలోను ఉంది. కాని మన రాష్ట్రానికి వలస వచ్చి షెడ్యూల్డు తెగగా క్లెయిము చేసినా, పైన పేర్కొన్న విధంగా వారు స్వంత రాష్ట్రంలో ఏ కేటగిరికి (ఎస్.సి. లేదా బి.సి.) చెందుతారో ఆ కేటగిరీకి చెందినట్లుగా కులధృవీకరణ పత్రం ఇవ్వాలి.**

**ఇతర రాష్ట్రాల్లో షెడ్యూల్డు తెగ అయివుండీ మన రాష్ట్రంలో షెడ్యూల్డు తెగకాని వ్యక్తుల విషయంలో, అతను/ఆమె ఫలానా రాష్ట్రంలోని ఫలానా షెడ్యూల్డు తెగకు చెందినవారు అని సర్టిఫికెట్ ఇవ్వాలి కాని, ఈ వివరాలు లేకుండా ఇవ్వరాదు. ఉదాహరణకు 'పార్థి' తెగ మహారాష్ట్రలో షెడ్యూల్డు తెగ, మన రాష్ట్రంలో బి.సి. కులాల జాబితాలో ఉంది. కావున పార్థి తెగవారు మహారాష్ట్ర నుండి వలసవస్తే మహారాష్ట్రకు చెందిన 'పార్థి' షెడ్యూల్డు తెగ అని సర్టిఫికెట్ ఇవ్వాలి.**

**ఇతర రాష్ట్రాలు మరియు మన రాష్ట్రంలో కూడా షెడ్యూల్డు తెగల జాబితాలో ఉన్న షెడ్యూల్డు తెగలవారు మన రాష్ట్రానికి వలస వచ్చిన విషయంలో కూడా వారు ఫలానా రాష్ట్రంలో ఫలానా షెడ్యూల్డు తెగకు చెందిన వారు అని సర్టిఫికెట్ ఇవ్వాలి.**

**ఏ రాష్ట్రంలోనైనా షెడ్యూల్డు తెగ హోదా, ఆ తెగకు రాష్ట్రపతి ఉత్తర్వులు లేదా పార్లమెంట్ ద్వారా సవరణ/మార్పు చేయబడిన చట్టంలోని జాబితాలో షెడ్యూల్డు తెగగా ప్రకటించిన తేదీ నుండి మాత్రమే వస్తుంది. ఒకే రాష్ట్రంలో కూడా ఒక తెగను వేరు వేరు ప్రాంతాల్లో వేరే తేదీల్లో షెడ్యూల్డు తెగగా ప్రకటింపబడి ఉండవచ్చును. ఉదాహరణకు మన రాష్ట్రంలో ఆంధ్ర ప్రాంతంలో సుగాలి (లంబాడి), ఎరుకల, యానాది తెగలను 25.09.1 956 తేదీన, తెలంగాణా ప్రాంతంలో 27.07.1977 తేదీన షెడ్యూల్డు తెగలుగా ప్రకటించారు. ఈ తెగలకు సంబంధించిన ఇతర రాష్ట్రాలవారు సంబంధిత తేదీల కంటే ముందే వలసవచ్చి ఇక్కడే స్థిరపడినట్లయితే వారికి మన రాష్ట్రంలో షెడ్యూల్డు తెగ హోదా వస్తుంది. పై తేదీల తరువాత వలసవచ్చి ఉంటే వారిని వలసదారులుగా వారి రాష్ట్రంలో వారి యొక్క సాంఘిక హోదా ఏదైతే దాని ప్రకారమే కులధృవీకరణ పత్రం ఇవ్వాలి. అంతేగాక వారికి మన రాష్ట్రంలో షెడ్యూల్డు తెగ రిజర్వేషన్ మొదలగు సదుపాయాలు, రక్షణలు వర్తించవు.**

# అధ్యాయం - 4

## షెడ్యూల్డు తెగ క్లెయిములు మరియు జారీ చేయబడ్డ సర్టిఫికెట్ల వాస్తవికతపై విస్తృత విచారణ చేయు విధానం

సాధారణంగా ఏ వ్యక్తికైనా తాను పుట్టిన తెగ/కులమే వర్తిస్తుంది. అంటే అతని తల్లిదండ్రులు ఏ తెగ/కులమైతే ఆ తెగ/కులం హోదా అతనికి/ఆమెకు వస్తుంది. కాని తల్లిదండ్రులు కులాంతర వివాహం చేసుకున్న సందర్భాల్లో వారి పిల్లలకు భారత ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం తండ్రి లేక తల్లి తెగ వస్తుంది.

### 1) సాంప్రదాయక నివాసం, ఆచారాలు, వంశ చరిత్ర వివరాలు :

అంతేగాక మన రాష్ట్రంలోని షెడ్యూల్డు తెగలు సాంప్రదాయకంగా కొన్ని ప్రాంతాల్లో నివసిస్తుంటారు. కొన్ని తెగలకు రాష్ట్రపతి/పార్లమెంట్ ప్రకటనల్లోనే ఏరియా రెస్ట్రిక్షన్ విధించబడింది. అలాగే అన్ని షెడ్యూల్డు తెగలకు ప్రత్యేకంగా విభాగాలు, గోత్రాలు, వివాహ పద్ధతులు, పూజించే దేవతలు, చేసే పండుగలు, కుల పంచాయితీలు ఉంటాయి. విచారణలో అభ్యర్థి లేక సర్టిఫికెట్ పొందిన వ్యక్తికి సంబంధించి పై వివరాలన్నీ సేకరించడంవలన ఆ వ్యక్తి క్లెయిము లేక పొందియున్న సర్టిఫికెట్ యొక్క వాస్తవికతను చాలా వరకు తెలుసుకోవచ్చు. ఆయా వ్యక్తుల వంశ చరిత్ర (జీనియాలజీ) ద్వారా అభ్యర్థి లేక తల్లిదండ్రులు, వారి తెగ వివరాలు తెలిసిన ఇతర బంధువుల నుండి ఈ క్రింది వివరాలు సేకరించాలి.

- అభ్యర్థి యొక్క ముత్తాత నుండి అభ్యర్థి వరకు తండ్రివైపు మరియు తల్లివైపు అందరి బంధువులకు సంబంధించిన ఇంటి పేరుతోసహా పేరు, స్వస్థలము, సాంప్రదాయక వృత్తి, అతని తల్లిదండ్రుల, భార్యాభర్తల వివరాలు. వారు విద్యావంతులైతే, చదివిన విద్యా సంస్థ పేరు, చదివిన కాలము, ఉద్యోగస్తులైతే ఉద్యోగము, కార్యాలయ వివరాలు.
- వారి తెగలోని వివాహ పద్ధతులు, పూజించే దేవతలు, పండుగలు, గోత్రాలు, ఇంటిపేర్లు, సాంప్రదాయ పంచాయితీ పెద్దలు, ఆ తెగకు ప్రత్యేక భాష ఉంటే దాని వివరాలు, అభ్యర్థికి ఆ భాష వచ్చునా, రానట్లయితే కారణాలు.
- వారి కుటుంబము గతంలో (1950 సంవత్సరం నుండి) ఏ ఏ ప్రాంతాల్లో ఎంతకాలం నివసించారు.
- అభ్యర్థి ఆ తెగలో పుట్టుక ద్వారా కాకుండ, దత్తత ద్వారా క్లెయిము చేశాడా?

## 2) పరిశీలించాల్సిన రికార్డులు, పత్రాలు :

పై వివరాలకనుగుణంగా సాక్ష్యాలు, ఋజువులు అనగా వారి స్వస్థలంలో జనన మరణ రిజిస్టర్లు, సంబంధిత రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భూమి, ఇల్లు మొదలగు స్థిరాస్తుల క్రయవిక్రయాలు, సంబంధిత గ్రామ ఓటరు జాబితాలు మొదలగునవి, రేషన్ కార్డులు, చదివిన విద్యా సంస్థలు, పని చేసిన కార్యాలయాల్లోని రికార్డుల ప్రకారం వారి తెగ పేరు, తల్లిదండ్రులు, అన్నదమ్ములు, తండ్రి తరఫు బంధువుల కుల సర్టిఫికెట్ కాపీలు సేకరించాలి.

**విద్యా సంస్థల రికార్డుల్లో ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లోని ప్రవేశాల రిజిస్టరు, బదిలీ సర్టిఫికెట్ల రికార్డుల వివరాలు సేకరించాలి. ఎందుకంటే నకిలీ సర్టిఫికెట్లు పొందిన వారి విషయంలో ప్రాథమిక పాఠశాలల్లో గిరిజనేతర కులం ఉండి, హైస్థాయి విద్యాలయాల్లో గిరిజనులుగా కులం మార్పు చేయడం జరుగుతూ ఉంటుంది.**

## 3) కులాంతర వివాహాల కేసుల్లో పరిశీలించాల్సిన అంశాలు :

అభ్యర్థులు కులాంతర వివాహం చేసుకున్న (గిరిజన–గిరిజనేతర) దంపతుల పిల్లలు అయితే ఈ క్రింది అంశాలపై వివరాలు సేకరించాలి.

**1 తల్లి మరియు తండ్రి కులం/తెగ, వారి స్వస్థలం**

**2 తల్లిదండ్రుల వివాహం రిజిస్టర్డ్ వివాహమా? ప్రేమ వివాహమా? అయినచో రిజిస్టర్డ్ పత్రాల కాపీలు.**

**3 వివాహం ఎక్కడ జరిగింది – దేవాలయంలోనా? తల్లి లేక తండ్రి ఇంట్లోనా? దేవాలయంలో జరిగితే దేవాలయం నుండి ధృవపత్రాలు.**

**4 లభ్యమైనచో వివాహపు ఆహ్వాన పత్రాలు, ఫోటోల కాపీలు, ఫోటోల్లోని బంధువుల వివరాలు, వారి కులం/తెగ.**

**5 వివాహం జరిగిన గ్రామంలో, వారి బంధువులు, ఇతరులనుండి, వివాహం ఎలా కుదిరింది, ఎవరి ఆధ్వర్యంలో జరిగింది, పురోహితుడు కులపెద్దా లేక బ్రాహ్మణుడా మొదలగు వివరాలు.**

**6 వివాహము అయినప్పటి నుండి ఆ దంపతులు ఎక్కడ నివాసము ఉన్నారు?**

**7 అభ్యర్థి పుట్టిననాటినుండి ఎక్కడ పెరిగాడు ?**

**8 గిరిజన భాగస్వామి యొక్క గ్రామము, బంధువుల ఇళ్ళకు అభ్యర్థి కుటుంబం వెళుతుంటారా? ఎందుకు? ఎంత కాలవ్యవధిలో?**

**9 సాధారణంగా కులాంతర వివాహాల పిల్లల విషయంలో గిరిజనుడైన తండ్రి లేక తల్లి చనిపోయినారని లేక భాగస్వామిని వదలి వేసినారని లేక ఎటో వెళ్ళిపోయినాడని వివరాలు**

**తెలియవని చెబుతుంటారు. అలాంటప్పుడు గిరిజన భాగస్వామి వివరాలు, అతని/ఆమె స్వస్థలం నుండి, ఆ గ్రామ షెడ్యూల్డు తెగ పెద్దలనుండి, విద్యాలయం రికార్డులనుండి సేకరించాలి లేక అభ్యర్థినే దాఖలు చేయమని ఆదేశించాలి.**

పై వివరాలన్నీ ఆధారాలతోసహా నమ్మశక్యంగా ఉన్నాయని కాంపిటెంట్ అధికారి సంతృప్తి చెందినప్పుడే క్లెయిము వాస్తవమైనట్లుగా భావించాలి. ఇంకా అనుమానమున్నట్లయితే జిల్లాస్థాయి పరిశీలన సంఘపు సలహా కోరాలి.

## 4) కాలపరిమితిలోగా సర్టిఫికెట్లు ఇవ్వడానికి ఏమి చేస్తే బాగుంటుంది :

**ఈ వివరాలన్నీ ప్రతి దరఖాస్తుదారుని విషయంలో సేకరించి నిజనిర్ధారణ చేయడం, మీకున్న ఇతర అత్యవసర అధికారిక విధులు చూసుకుంటూ, వీలవుతుందా? సాధారణంగా దరఖాస్తులు ఇచ్చిన వెంటనే సర్టిఫికెట్లు ఇవ్వాలని తగిన సమయం ఇవ్వకుండా ఒత్తిడులుంటాయని మీరు చెబుతూ ఉంటారు. ఈ విషయంలో సలహా ఏమంటే, మీ అధికార పరిధిలోని గ్రామాలన్నింటిలో ఏయే షెడ్యూల్డు తెగలున్నాయి, గ్రామ వారీగా ఆయా తెగలకు చెందిన కుటుంబాల వివరాలు మీరు ఆయా గ్రామాలకు ఇతర పనులపై వెళ్ళినప్పుడు ఆ తెగల పెద్ద మనుషులు, ఇతరులను విచారించి, సేకరిస్తూ, ఒక రిజిస్టరులో నమోదు చేస్తూ ఉండాలి. ఈ వివరాల ఆధారంగా, అసలైన గిరిజన కుటుంబాలకు చెందిన వ్యక్తులకు, మీకు రూల్సు ప్రకారం ఇవ్వబడిన కాలపరిమితి (అంటే 30 రోజులు లేక అనుమానమొచ్చి విచారణ చేయాలనుకుంటే 60 రోజులు)లో సర్టిపికెట్ జారీ చేయవచ్చును.**

**ఇంకో సలహా ఏమంటే, మీ పై అధికారుల అనుమతితో, కులధృవీకరణ పత్రాల మంజూరీ కోసం చేసుకునే దరఖాస్తులు, అట్టి అభ్యర్థులకు సర్టిఫికెట్ కావలసిన సమయం కంటే 60 రోజుల ముందే సమర్పించాలని 'పబ్లిక్ నోటీసు' మీ కార్యాలయంలో ప్రకటించండి, మీరు మీ ఆధీనంలోని ఇతర అధికారులు గ్రామాలను సందర్శించే సమయంలో ఈ విషయాన్ని అందరికి తెలియజేయండి. లేక ఇతర ప్రచారమాధ్యమాల ద్వారా కూడా తెలియజేయవచ్చును. దీనికి మొదట్లో కొంత వ్యతిరేకత వ్యక్తమయినా, తరువాత అలవాటు పడతారు.**

# అధ్యాయం - 5

## కులధృవీకరణ పత్రాలు / క్లెయిముల వాస్తవికతపై వివిధ హైకోర్టులు మరియు సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పులు

### 1) షెడ్యూల్డు తెగల జాబితాలో ఒకే వరుస సంఖ్యలో కొన్ని తెగలు పేర్కొనబడినప్పుడు మొదటి తెగకు అదే వరుస సంఖ్యలోని ఇతర తెగలకు సంబంధం ఉంటుంది (ఉండాలి)

**సుప్రీం కోర్టు కేసులు - 621 (1980)**

**సివిల్ అప్పీల్ నెం.2229/1978, తేది 07.11.1979**

**దాదాజి అలియాస్ దీన (అప్పీలుదారుడు) Vs సుఖదేవ్‌బాబు మరియు ఇతరులు (ప్రతివాదులు)**

ఈ కేసులో అప్పీలుదారుడు "క్షత్రీయ బిద్వయిక్‌మాన" కులానికి చెందినవాడు. మహారాష్ట్రలో షెడ్యూల్డు తెగకు రిజర్వు చేయబడిన చంద్రపూర్ జిల్లా, ఆర్మోరి అసెంబ్లి నియోజకవర్గం నుండి 1978 ఎన్నికల్లో అతను 'మాన' షెడ్యూల్డు తెగకు చెందినట్లుగా పోటీ చేసి గెలుపొందినాడు. అతను షెడ్యూల్డు తెగకు చెందినవాడుకాదని, అతని ఎన్నిక చెల్లదని వేసిన ఎన్నికల వ్యాజ్యంలో బొంబాయి హైకోర్టు (నాగపూర్ బెంచ్) వారు అతను షెడ్యూల్డు తెగకు చెందినవారు కానందువలన అతని చెల్లదని తీర్పు ఇచ్చారు. దీనిపై అతను సుప్రీం కోర్టులో అప్పీలు చేశారు.

మహారాష్ట్ర షెడ్యూల్డు తెగల జాబితాలో 1950 రాష్ట్రపతి ఉత్తర్వులో "గోండు Including మడియ (మరియ) మరియు ముడియ (మురియ)" అని ఉండినది. 1956 సంవత్సరంలో చేసిన సవరణ చట్టంలోని జాబితాలో గోండు Including అరక్, అగారియా, మాన మొదలగు 40 ఉపతెగలు పేర్కొనబడ్డాయి. 1976 సంవత్సరంలో చేసిన సవరణ చట్టంలో గోండ్ తరువాత Including అనే పదము తీసివేసి రాజ్‌గోండ్, అరక్, మాన మొదలగు 58 ఉపతెగలు పేర్కొనబడ్డాయి. ఈ జాబితాలో జరిగిన సవరణల ఆధారంగా, అప్పీలుదారుడి వాదన ఏమంటే 1956 సంవత్సరంలోని సవరణలో పేర్కొనబడిన 'మాన' మరియు 1976 సవరణలో Including అనే పదము తీసివేసినందున ఈ జాబితాల్లోని 'మాన' తెగలో అన్ని విధములైన 'మాన' తెగలు చేర్చబడ్డాయి. అందువలన 'క్షత్రియ బద్వయిక్' కులానికి చెందినతాను కూడా షెడ్యూల్డు తెగకు చెందుతాడు.

దీనిపై సుప్రీంకోర్టువారు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 342(1) మరియు 342(2)లోని వాక్యాలను చట్టాలు సవరణ చేసేముందు, పార్లమెంటు జాయింట్ కమిటీ చేసిన వ్యాఖ్యలను దృష్టిలో ఉంచుకొని షెడ్యూల్డు తెగల జాబితాలో ఒకే వరుస సంఖ్యలో ఒక తెగ తరువాత

ఇవ్వబడిన తెగలన్నీ మొదట పేర్కొన్న తెగకు ఉపతెగలు లేక పర్యాయపదాలున్నూ మరియు అట్టి మొదటి తెగకు సంబంధం కలవిగానూ ఉంటాయని నిర్ణయించింది. ఉదాహరణకు మహారాష్ట్ర షెడ్యూల్డు తెగల జాబితాలోనే కోయ తెగను వరుస సంఖ్య (18) క్రింద గోండ్ తెగ క్రింద ఉపతెగ గాను, మరియు వరుస సంఖ్య (33) క్రింద కోయ, భినెకోయ, రాజ్‌కోయ అని ప్రకటింపబడి వున్నది. అంటే గోండు తెగకు సంబంధమున్న కోయ తెగను గోండ్ ఉపతెగగాను, అలా సంబంధము లేని కోయ తెగను వరుస సంఖ్య (33) క్రింద వేరే తెగగాను పేర్కొనబడింది. అందువల్ల ఒక వరుస సంఖ్యలో వివిధ తెగలుంటే, మొదటి తెగకు మిగతా తెగలన్నీ ఉపతెగలు లేక పర్యాయ పదాలు మరియు ఆ తెగతో సంబంధము కలిగి ఉంటాయి.

ప్రస్తుత కేసులో అప్పీలుదారుని తెగ/కులం షెడ్యూల్డు తెగలో గోండుకు ఉపతెగగాను లేక వేరే ప్రత్యేక తెగగాను పేర్కొనబడలేదు గావున, అతడు షెడ్యూల్డు తెగకు చెందినవాడు కాదని సుప్రీంకోర్టుచే నిర్ణయింపబడింది.

**2) షెడ్యూల్డు తెగ కానటువంటి గౌడ (కలాలి) కులంవారు ఏజన్సీ (షెడ్యూల్డు) ప్రాంతంలో నివసిస్తున్నా కూడ వారికి గౌడు (ఏజన్సీ) షెడ్యూల్డు తెగ హోదా రాదు.**

**ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, హైదరాబాద్**

**రిట్ అప్పీల్ నెం. 439/1980**

**సెక్రటరీ, సాంఘిక సంక్షేమ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము మరియు ఇతరులు (అప్పీలుదారులు)**

**Vs**

**1. శ్రీమతి దాసరి సుబ్బాయమ్మ**

**2. వడిశల రామన్న (ప్రతివాదులు)**

ఈ కేసు పూర్వాపరాలు ఏమంటే, శ్రీమతి దాసరి సుబ్బాయమ్మ కలాలి (గౌడ) (బి.సి.) కులానికి చెందినవారు మరియు పశ్చిమగోదావరి జిల్లా, పోలవరం తాలుకా ఏజన్సీలోని ఎల్.ఎన్.డి. పేట గ్రామస్తురాలు. ఆమె కలాలి (గౌడ బి.సి.) కులధృవీకరణ పత్రం కూడా కలిగియున్నారు. ఆమె ఒక షెడ్యూల్డు తెగ కుటుంబంనుండి భూమి కొనుగోలు చేసి అలాంటి భూమిని ఆంధ్రప్రదేశ్ భూబదలాయింపు చట్టం నుండి కాపాడుకోవడానికి తన కులం గౌడ అయినందున, తాను ఏజన్సీ గ్రామం నివాసి అయినందున తాను గౌడు షెడ్యూల్డు తాగకు చెందినదానినని, అందువలన తాను షెడ్యూల్డు తెగనుండి భూమిని కొన్న పద్ధతి భూబదలాయింపు చట్టం ప్రకారము సక్రమమేనని వాదించారు.

దీనిపై హైకోర్టు సింగిల్ జడ్జిగారు కూడ గౌడ కులస్తులు ఏజన్సీ ప్రాంతాల్లో నివసిస్తుంటే వారికి షెడ్యూల్డు తెగ హోదా వస్తుంది అని నిర్ధారించారు. దానిపై ప్రభుత్వము డివిజన్ బెంచ్‌కు అప్పీలు చేశారు. అప్పీలును పరిశీలించిన హైకోర్టు డివిజన్ బెంచ్‌తన తీర్పులో –

- ఆర్టికల్ 342(1) ప్రకారం షెడ్యూల్డు తెగల జాబితాలను ప్రకటించుటకు రాష్ట్రపతికి, అట్టి జాబితాను సవరించుటకు ఆర్టికల్ 342(2) ప్రకారం పార్లమెంట్‌కు మాత్రమే అధికారం కలదు. తదనుసారంగా భారత రాష్ట్రపతి, రాజ్యాంగ (షెడ్యూల్డు తెగలు) ఉత్తర్వు, 1950 విడుదల చేశారు. ఈ ఉత్తర్వు, షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల ఉత్తర్వులు (సవరణ) చట్టం, 1976 ద్వారా, సవరణ చేయబడింది.
- ఈ సవరణ చట్టం ప్రకారమ గౌడు తెగ ఏజన్సీ ప్రాంతాల్లోనే షెడ్యూల్డు తెగగా గుర్తించబడింది.
- ఆర్టికల్ 16 (4) ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ.ఎమ్.ఎస్.నెం.1793, తేది 23.09.1970లో వెనుకబడిన కులాల జాబితాను ప్రకటించింది. ఈ జాబితాలో గ్రూపు–బి నందు ఈడిగ, గౌడ (గమల్ల, కలాలి), గౌండ్ల, సెట్టిబలిజ (విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి మరియు కృష్ణ జిల్లాల్లో) కలవు.

- పై జాబితాల ప్రకారం గౌడు తెగ ఏజన్సీ ప్రాంతాల్లో మాత్రమే ఉంటుంది. అలాగే గౌడ (కలాలి), గౌండ్ల కులం రాష్ట్రమంతటా ఉంటుంది. ఒకటేమో కుల వ్యవస్థబయట ఉన్న ట్రైబ్/తెగకాగా ఇంకోటి కులవ్యవస్థలోని శూద్ర కులము.
- ఆర్టికల్ 342 ప్రకారం, షెడ్యూల్డు తెగలు, వాటి సముదాయాలు, లేక విభాగాలు లేక వాటిలోని, వర్గాలను నిర్దిష్టపరచుటకు మాత్రమే రాష్ట్రపతికి అధికారం కలదు. ట్రైబ్/తెగ కానివారిని కులవ్యవస్థలో ఉన్న వెనుకబడిన తరగతుల్లోని కులాలను షెడ్యూల్డు తెగగా మార్పుచేయలేరు.
- కావున ప్రస్తుత కేసులో ప్రతివాది సమర్పించిన కులధృవీకరణ పత్రం ప్రకారం ఆమె కలాలి (గౌడ) (బి.సి.) కులానికి చెందినది కాని 'గౌడు' షెడ్యూల్డు తెగకు చెందినదికాదు. **షెడ్యూల్డు తెగకు చెందడమనేది పుట్టుక ద్వారా వస్తుంది కాని తాను ఎంచుకున్నట్లు, కోరుకున్నట్లు రాదు**.
- షెడ్యూల్డు తెగ 'గౌడు' వారి నివాస ప్రాంతాలు, సాంప్రదాయ వృత్తి, ఆచార వ్యవహారాలు, భాష, గోత్రాలు, దేవతలు మొదలగునవి గౌడకులం (బి.సి.) వారి వృత్తులు, ఆచార వ్యవహారాలు పూర్తిగా భిన్నమైనవి.
- ప్రతివాది అభిప్రాయాన్ని అంగీకరించినట్లయితే గౌడ/గౌండ్ల/కలాలి కులానికి చెందిన వారందరు ఏజన్సీ ప్రాంతంలో ఇల్లు లేక భూమిని పొంది తాను అక్కడ నివసిస్తున్నందున, షెడ్యూల్డు తెగ 'గౌడు'గా క్లెయిము చేసే పరిస్థితి వస్తుంది. దాని ప్రకారం, ఇద్దరు అన్నదమ్ముల్లో ఒకరు ఏజన్సీ ప్రాంతంలో నివసిస్తే షెడ్యూల్డు తెగకు చెందినట్లుగా, ఇంకొకరు బయట నివసిస్తే బి.సి.గా గుర్తించాల్సి ఉంటుంది. అంతేగాక గౌడ కులుస్థులు రాష్ట్రమంతటా విస్తరించి ఉన్నారు. వారి ప్రధాన వృత్తి కల్లుగీత, విక్రయం. వారిలో కొంతమంది పెద్ద పెద్ద కాంట్రాక్టర్లు, లక్షల విలువగల కాంట్రాక్టులు తీసుకోగల వ్యక్తులున్నారు. వారంతా ఏజన్సీ ప్రాంతాల్లో ఒక్క రాత్రిలో నివాసమేర్పరచుకొని షెడ్యూల్డు తెగలుగా మారిపోయే విచిత్ర పరిస్థితి నెలకొంటుంది.
- పై కారణాలవల్ల గౌడ (బి.సి.) కులానికి చెందిన ప్రతివాదికి, ఏజన్సీ ప్రాంతంలో నివాసమున్న కారణంగా షెడ్యూల్డు తెగ హోదారాదు, అని నిర్ధారించారు.

**ఈ కోర్టు తీర్పును అనుసరించి మనము గుర్తించవలసిందేమిటంటే గౌడ, కలాలి, గౌండ్ల, ఈడిగ, సెట్టిబలిజ కులాలవారు అలాగే బోయవాల్మీకి కులంవారు లేక బోయ నాయకుల కులంవారు ఏజన్సీ ప్రాంతాల్లో నివసించినంత మాత్రాన వారికి షెడ్యూల్డు తెగ హోదా రాదు.**

**3) ఒక షెడ్యూల్డు తెగ యొక్క సమానార్థకాలు, పర్యాయపదాలు, ఉపకులాలు రాష్ట్రపతి ఉత్తర్వులలోని (కాలానుగుణంగా పార్లమెంట్‌చే సవరించబడిన) జాబితాలో ప్రకటించబడిన వాటికే షెడ్యూల్డు తెగ హోదా వస్తుంది.**

**ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, హైదరాబాద్**

**రిట్ అప్పీల్ నెం. 864/1982**

**1. ప్రిన్సిపాల్, గుంటూరు మెడికల్ కాలేజి,**

**2. స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తరపున సెక్రటరీ, వైద్య ఆరోగ్య శాఖ, హైదరాబాద్ (అప్పీలుదారులు)**

**Vs**

**వై. పాండురంగారావు (ప్రతివాది)**

ప్రతివాది, 'మన్యకాపు' కులానికి చెందినవాడని, మన్యం కాపు కులం షెడ్యూల్డు తెగల జాబితాలో లేనందున అతను షెడ్యూల్డు తెగల కోటాలో మొదటి సంవత్సరం ఎం.బి.బి.ఎస్. కోర్సులో అడ్మిషను పొందడానికి అర్హుడుకాదని, అతనికి అడ్మిషన్ నిరాకరించబడింది. దీనిపై హైకోర్టు సింగిల్ జడ్జి 14.09.1982 తేదీన పిటీషనరు కులం 'మన్యకాపు' షెడ్యూల్డు తెగ అయిన 'కొండకాపు'కు పర్యాయపదము అయినందున, అతనికి అడ్మిషన్ ఇవ్వాలని, తీర్పు ఇవ్వడం జరిగింది. దీనిపై అప్పీలు దారులు, మన్యంకాపు షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల ఉత్తర్వు (సవరణ) చట్టం, 1976లో లేనందున, అలాంటి క్లెయిమును విచారించరాదని మరియు రాష్ట్రపతి ప్రకటించిన జాబితాను పెంచటానికి కోర్టుకు అధికారం లేదని నిజానికి మన్యంకాపు తెగను షెడ్యూల్డు తెగల జాబితాలో చేర్చమని భారత ప్రభుత్వాన్ని కోరామని కాని 1976 సంవత్సరంలో సవరించిన చట్టంలో మన్యంకాపు కులం షెడ్యూల్డు తెగల జాబితాలో చేర్చనందువల్ల, అలా చేర్చబడని కులం/తెగ జాబితాలో చేర్చబడిన ఇంకో తెగకు సంబంధించినదని విచారణ చేయడానికి వీలు లేదని హైకోర్టు డివిజను బెంచ్‌కి అప్పీలు చేశారు.

దీనిపై ప్రతివాదితరపు న్యాయవాది మన్యంకాపు కులాన్ని షెడ్యూల్డు తెగలో చేర్చమని అప్పీలుదారు ప్రభుత్వము కోరియున్నందువలన అలాంటి కోరికను నిరాకరించినట్లు ఆధారాలు కోర్టుకు సమర్పించలేదు కావున ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మరియు సబార్డినేట్ సర్వీసు రూల్స్‌లో షెడ్యూలు x లో మన్యంకాపు లేక కొండకాపు ఏజన్సీ ఏరియాలో ఆదిమవాసుల (అబొరిజనల్ ట్రైబ్స్)కు చెందినట్లు చూపబడినందున, మన్యంకాపుల ఆచారాలు మరియు సాంఘిక అలవాట్లను పరిశీలించి అవి జాబితాలో చేర్చబడిన కొండకాపు తెగ ఆచారాలు ఒకటే అని విచారించు అధికారం కోర్టు కోల్పోలేదని వాదించారు.

ఈ అంశంపై సుప్రీం కోర్టు వివిధ కేసుల్లో ఇంతకుముందు వెలువరించిన తీర్పులను క్షుణ్ణంగా పరిశీలించిన హైకోర్టు డివిజన్ బెంచ్ ఈ క్రింది విధంగా తమ తీర్పును వెలువరించారు.

- **రాష్ట్రపతి ఉత్తర్వుల్లో పేర్కొనబడని ఒక తెగ యొక్క ఉపతెగలు మరియు పర్యాయపదాలను గురించి విచారణ చేసి వాటిని జాబితాలో చేర్చబడినట్లుగా భావించుటకు వీలులేదు.**
- **కక్షిదారులకు, షెడ్యూల్డు తెగల జాబితాలో చేర్చబడనటువంటి కులాలను/వర్గాలను జాబితాలో చేర్చబడినాయని తెల్పుటకు ఋజువులను సమర్పించుటకు అనుమతి ఇస్తే, రాజ్యాంగం ఆర్టికల్స్ 341 మరియు 342 యొక్క ముఖ్యమైన లక్ష్యం విఫలమవుతుంది.**
- **ఒక తెగ షెడ్యూల్డు తెగ అవునాకాదా అనే విషయాల్లో వివాదాలను నివారించుటకే రాజ్యాంగంలో రాష్ట్రపతికి, పార్లమెంటుకు మాత్రమే అధికారం ఇవ్వబడింది. ఒకసారి క్లాజు (1)లో రాష్ట్రపతి ప్రకటిస్తే, దాన్ని సవరించడానికి, మార్చడానికి పార్లమెంటుకు మాత్రమే అధికారం ఇవ్వబడింది. ప్రకటించిన జాబితాలో ఏదైనా ఒకతెగ పొరపాటున వదలివేయబడింది అనుకున్నా ఆ పొరపాటును సరిదిద్దడం పార్లమెంటు మాత్రమే చేయగలదు. ఏ న్యాయస్థానం కూడా వివరణలు, సాక్ష్యాధారాలను స్వీకరించుట ద్వారా ఏ కులాన్ని/ తెగను షెడ్యూల్డు తెగల జాబితాలో చేర్చడంకాని తొలగించడంకాని చేయలేదు.**
- **రాష్ట్ర సబార్డినేట్ సర్వీసు రూల్సులో మన్యంకాపు కులాన్ని కొండకాపు తెగకు పర్యాయపదంగా అబొరిజనల్ ట్రైబ్‌గా పేర్కొన్నా కూడా రాష్ట్ర చట్టాల్లో అలా ప్రకటించడం భిన్నమైన విషయము. రాష్ట్ర ప్రభుత్వము అలాంటి అబొరిజనల్ ట్రైబ్స్‌కు కూడా ప్రత్యేక అవకాశాలు ఇవ్వవచ్చు కాని షెడ్యూల్డు కులాలకు, షెడ్యూల్డు తెగలకు రాజ్యాంగ హక్కుల విషయములో మనం ఆర్టికల్ 341 మరియు 342లనే చూడాలి.**

అందువలన ప్రస్తుత కేసులో అప్పీలుదారులు, ప్రతివాదికి షెడ్యూల్డు తెగల క్రింద రిజర్వేషను నిరాకరించడం న్యాయసమ్మతమే.

## 4) షెడ్యూల్డు తెగకాని వ్యక్తులను తెగవారు దత్తత తీసుకుంటే అలాంటి దత్తతవలన షెడ్యూల్డు తెగ హోదా రాదు.

**ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, హైదరాబాద్**

**రిట్ అప్పీల్ నెం.11914/1985**

**బండి శ్రీనివాసరావు రావు (వాది)**

**Vs**

**1. బి.ఇ./బి.టెక్. ప్రవేశాల ప్రత్యేక అధికారి, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్,**

**2. డైరెక్టర్, గిరిజన సంక్షేమ శాఖ, హైదరాబాద్ (ప్రతివాదులు)**

వాదియైన బండి శ్రీనివాసరావు నిజానికి గొల్ల (బి.సి.) కులానికి చెందినవాడు. తనను షెడ్యూల్డు తెగ (నాయికపు)కు చెందినటువంటి, సంతతి లేని బుద్ధారం గ్రామ వాస్తవ్యురాలైన మహిళ దత్తత తీసుకున్నదనీ, తాను చిన్నతనం నుండి ఆమె వద్దనే పెరిగినానని, ఆ గ్రామ షెడ్యూల్డు తెగల వారందరు తనను అంగీకరించారని, తనకు, గార్ల మండల రెవెన్యూ అధికారి వారు 15.07.1985 తేదీన షెడ్యూల్డు తెగ సర్టిఫికెట్ జారీ చేశారని కావున తాను షెడ్యూల్డు తెగ కోటాలో బి.ఇ./బి.టెక్. మొదటి సంవత్సరం కోర్సులో ప్రవేశానికి అర్హుడనని క్లెయిము చేశారు.

2వ ప్రతివాది దాఖలు చేసిన కౌంటరు అఫిడవిట్‌లో, వాదియైన బండి శ్రీనివాసరావు తిరుమలాయపాలెం మండలం, కాచిరాజుగూడెం గ్రామస్థుడైన బండి వీరాస్వామి కుమారుడనీ; అతను, దత్తత తీసుకున్న తల్లి యొక్క స్వగ్రామం బుద్ధారంలో ఎప్పుడూ నివసించలేనీ; అతనికి గార్ల మండల రెవెన్యూ అధికారి ఇచ్చిన సర్టిఫికెట్‌లో అతను దత్తత ద్వారా షెడ్యూల్డు తెగకు చెందిన వాడని తెలుపలేదనీ; అతని స్కూలు/కాలేజి రికార్డులన్నింటిలో అతని తండ్రి పేరు వీరాస్వామి అనే ఉన్నదనీ; విచారణలో అతని బంధువులందరూ గొల్ల (బి.సి.) కులస్తులని తేలిందనీ; ఇంటర్మీడియట్ కోర్సులో ప్రవేశానికి సమర్పించిన దరఖాస్తులో కూడా అతని కులం గొల్ల (బి.సి.); స్వగ్రామం కాచిరాజు గూడెం అని పేర్కొన్నాడని; అతను 1980 సంవత్సరంలో బి.సి. సర్టిఫికెట్ గార్ల మండల రెవెన్యూ అధికారినుండి తీసుకున్నాడనీ, అదే అధికారి 1985లో ఇచ్చిన షెడ్యూల్డు తెగ సర్టిఫికెట్ అసత్యమైనదనీ; దీనిని షోకాజ్ నోటీసు ఇచ్చి విచారణ జరిపి 12.11.1985 తేదీన రద్దు పరచినారనీ; ఈ విచారణాధికారి ఎదుట అభ్యర్థి అతని దత్తత ఎప్పుడు, ఎక్కడ జరిగిందో తెలుపలేదనీ; వాది యొక్క లాయరుగారు, వాది యొక్క దత్తత ఆచార/వాడుక న్యాయం ప్రకారం చెల్లుబాటవుతుందనీ; హిందూ దత్తత మరియు నిర్వహణ చట్టం, 1956లోని సెక్షన్

12లో తెలుపబడిన అన్ని ప్రయోజనాలకు అర్హుడనీ; షెడ్యూల్డు తెగలకు లభించే అన్ని ప్రయోజనాలకు హక్కు కలిగినాడని; అతన్ని దత్తత తీసుకున్న తల్లి షెడ్యూల్డు తెగ నాయకపుకు చెందనదనటంలో ఎలాంటి వివాదం లేదనియూ; దత్తత వల్ల షెడ్యూల్డు తెగ హోదా రావడమనేది రాజ్యాంగ విరుద్ధమైతే ఆర్టికల్ 340 క్రింద కమీషను వేసి చట్టానికి సవరణ తేవచ్చును అని అంతవరకు పరిగణింపబడుటకు హక్కు కలిగియున్నాడనీ బి.ఇ./బి.టెక్. కోర్సు ప్రవేశ నిబంధనల్లో దత్తత విషయంలో, విచారణ చేయడానికి అవకాశం కల్పించబడలేదనీ అందువల్ల విచారణ చేయడానికి 2వ ప్రతివాదికి అధికార పరిధిలేదని, వాదించారు.

ఇంతకుముందు షెడ్యూల్డు తెగల హోదాపై కోర్టు వెలువరించిన తీర్పులను పరిశీలించి, హైకోర్టు వారు:

- హిందూ దత్తత మరియు నిర్వహణ చట్టం, 1956లోని సెక్షన్ 2(2) ప్రకారం 'దత్తత' షెడ్యూల్డు తెగలకు వర్తించదనీ అలాగే హిందూ వివాహ చట్టం, 1955 మరియు హిందూ వారసత్వ చట్టం, 1956లోని సెక్షన్ 2(2) ప్రకారం కూడా ఈ చట్టాలు షెడ్యూల్డు తెగలకు వర్తించవని, ఈ కేసులో ఆచార న్యాయం యొక్క వర్తింపు పరిధి తమకు సంబంధము లేనందున దానిని పరిశీలించడం అనవసరం.

- చట్ట ప్రకారంకాని, ఆచార న్యాయం ప్రకారంకాని జరిగిన దత్తత మత సంబంధమైనది అయితే, దాని వెనుకగల ఉద్దేశ్యము గురించి విచారణ అసందర్భము. కాని రాజ్యాంగంలో ఇవ్వబడిన ప్రయోజనాలకోసం అయితే దాన్ని క్షుణ్ణంగా పరిశీలించి దాని ఉద్దేశ్యాన్ని బహిర్గత పరచవలసి ఉంటుంది.

- దత్తత కేసులు రాజ్యాంగం ఆర్టికల్స్ 15(4) మరియు 16(4) నందు ఇవ్వబడిన ప్రయోజనాలు పొందుటకోసం, వేసే కొత్త ఎత్తుగడలుగాను, అసలైన గిరిజనుల హక్కులకు హానికరమైనవి గాను భావించాలి.

- చట్టబద్ధ నాయ్యంగాని, ఆచార న్యాయంగాని ప్రాథమిక చట్టమైన ప్రత్యేకమైన దేశ రాజ్యాంగం పై మిన్నజాలవు. పిటిషనరు న్యాయవాది యొక్క వాదనపై నమ్మకముంచినా, అంగీకరించినా, న్యాయ సంబంధయుక్తుల ద్వారా షెడ్యూల్డు తెగల జాబితాలో చేరి రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(4) మరియు 16(4) లక్ష్యాన్ని విఫలం చేయడానికి చేసే మార్గాలను ప్రోత్సహించి నట్లవుతుంది.

- అందువలన, గిరిజనేతర వ్యక్తులు ఆచార సంబంధ న్యాయం ద్వారా గిరిజనులకు దత్తత వెళ్ళడం ఆమోదించదగ్గదే అయినా, అట్టి దత్తత వ్యక్తిగత న్యాయంకోసమే అయివుండాలి.

కాని రాజ్యాంగం కోసమయితే అనగా రాజ్యాంగం క్రింద లభించే రాయితీలు, ప్రయోజనాల కోసము అలాంటి దత్తత తీసుకోబడిన వ్యక్తిని షెడ్యూల్డు తెగకు చెందినట్లుగా పరిగణించడానికి వీలులేదని తీర్పు వెలువరించినారు.

ఈ కేసులోని తీర్పును అనుసరించి గుర్తుంచుకోవాల్సిన ముఖ్య అంశాలేమంటే.

- **హిందూ దత్తత మరియు నిర్వహణ చట్టం, 1956లోని సెక్షన్ 2(2) ప్రకారం, ఈ చట్టం షెడ్యూల్డు తెగలకు వర్తించదు కావున, ఈ చట్టం ప్రకారం దత్తత తీసుకున్నా అట్టి దత్తత వ్యక్తులకు షెడ్యూల్డు తెగ హోదా రాదు.**
- **దత్తత వ్యక్తిగత కారణాలతోనూ, ఆచారం ప్రకారం చేసుకునే వీలున్నా, రాజ్యాంగంలో షెడ్యూల్డు తెగలకు ప్రకటించిన ప్రయోజనాలు పొందుటకు మాత్రము అనుమతించలేదు.**

**కావున దత్తత ద్వారా ఎవరైనా షెడ్యూల్డు తెగ హోదా కోసం చేసే దరఖాస్తులను నిర్ద్వందంగా తిరస్కరించవచ్చును అలాగే దత్తత ఆధారంగా ఇంతకు ముందు మంజూరు చేసిన షెడ్యూల్డు తెగ సర్టిఫికెట్లను చట్ట ప్రకారం విచారణ జరిపి రద్దు చేయాలి.**

## 5) కులాంతర వివాహం చేసుకున్న దంపతుల్లో ఒకరు షెడ్యూల్డు తెగకు చెందినవారైతే వారి పిల్లల షెడ్యూల్డు తెగ హోదా.

**ఎ) భారత సుప్రీం కోర్టు**

**సివిల్ అప్పీల్ నెం.4413/2003**

**శోభాహైమవతి (అప్పీలుదారు)**

**Vs**

**సెట్టి గంగాధరస్వామి, ఇతరులు (ప్రతివాదులు)**

అప్పీలుదారు శ్రీమతి శోభాహైమవతి దేవిగారు విజయనగరం జిల్లాలో షెడ్యూల్డు తెగలకు రిజర్వు చేయబడిన శృంగవరపుకోట అసెంబ్లీ నియోజక వర్గం నుండి ఎం.ఎల్.ఏగా గెలుపొందినారు. ఎన్నికల్లో ఓడిపోయిన ప్రతివాదియైన శెట్టి గంగాధరస్వామిగారు అప్పీలుదారు అగ్రవర్ణమైన పట్నాయక్ శిష్టికరణం కులానికి చెందినదని కావున షెడ్యూల్డు తెగలకు రిజర్వు చేయబడిన నియోజక వర్గంనుండి ఆమె ఎన్నిక చెల్లదని ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కేసు వేయగా, హైకోర్టువారు వాదప్రతివాదనలు, సాక్ష్యాధారాలను పరిగణలోకి తీసుకొని అప్పీలుదారు పట్నాయక్ శిష్టికరణము కులానికి చెందినదని నిర్ధారించి, ఆమె ఎన్నికను రద్దు చేసినది. ఈ హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టులో అప్పీలు చేయబడింది.

ఈ కేసు పూర్వాపరాలు ఏమంటే శోభాహైమవతి దేవి (అప్పీలుదారు) తల్లి శ్రీమతి సింహాచలం బగత షెడ్యూల్డు తెగకు చెందినది. ఆమెకు మురహరిరావు అనే పట్నాయక్ శిష్టికరణము కులస్తునితో వివాహము జరిగి, అప్పీలుదారుతో పాటు 6 మంది పిల్లలు కలిగినారు. అప్పీలుదారు వాదన ఏమంటే తన తల్లికి శ్రీ మురహరిరావుకి అసలు వివాహము జరుగలేదు కావున తాన మరియు ఇతర పిల్లలు అక్రమ సంతానము. తన తల్లికి లడ్డా అప్పలస్వామి అనే బగత తెగ అతనితో వివాహము జరిగి, రద్దు కాలేదు. శ్రీ మురహరిరావుకు కూడా అతని అక్క కూతురైన కళావతితో వివాహము జరిగింది. ఈ వివాహము కూడా రద్దు కాలేదు. కావున తన తండ్రియైన శ్రీ మురహరిరావుకు, తల్లి సింహాచలానికి వివాహము జరిగే అవకాశం లేదు. అంతేగాక తాను తన మేనమామ మరియు బగత తెగకు చెందిన అప్పలస్వామిని వివాహము చేసుకుంది. అందువలన తనకు బగత తెగకు చెందిన షెడ్యూల్డు తెగలకు కేటాయించిన నియోజక వర్గం ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హతకలదు. దీనిపై ప్రతివాదులు – అప్పీలుదారు తల్లియైన సింహాచలం మొదట లడ్డా అప్పలస్వామిని వివాహము చేసుకోలేదనియు, అలాగే ఆమె తండ్రి శ్రీ మురహరిరావు మొదట కళావతిని వివాహము చేసుకోలేదనియు ఆమె తల్లిదండ్రులు అంటే సింహాచలం,

శ్రీ మురహరిరావుల చట్ట సమ్మతమైన వివాహం ద్వారానే శోభాహైమవతీ దేవి ఇతర పిల్లలు పుట్టినారని వాదించారు.

సాక్ష్యాధారాలను పరిశీలించిన హైకోర్టువారు, సింహాచలానికి లడ్డా అప్పలస్వామికి వివాహము జరుగలేదని నిర్ధారించారు. ఒకవేళ అట్టి వివాహము జరిగియున్నా అట్టి వివాహము సింహాచలం శ్రీ మురహరిరావుతో కలిసి జీవించడానికి ముందే రద్దు చేయబడినట్లు భావించాలి. అంతేగాక శ్రీ మురహరిరావు సింహాచలాన్ని వివాహము చేసుకున్నాడని, ఆమె ద్వారా కలిగిన ఆరుగురు పిల్లలు చట్టబద్ధంగా పుట్టినవారేనని భావించారు. అప్పీలుదారు, తన తండ్రి శ్రీ మురహరిరావుకు అతని అక్కకూతురు కళావతితో ముందే వివాహమైనట్లు సాక్ష్యాధారాలతో నిరూపించలేకపోయారు. అందువలన శ్రీ మురహరిరావు సింహాచలాన్ని చట్టబద్ధంగా వివాహము చేసుకోవడానికి ఆరుగురు పిల్లల్ని పొందడానికి ఎలాంటి ఆటంకము లేదు. అలా పుట్టిన పిల్లల్లో ఒకరైన ఆమె తండ్రి కులము తీసుకున్నది కావున అప్పీలుదారు కులం పట్నాయక్ శిష్టికరణం అవుతుంది, బగత షెడ్యూల్డు తెగకాదు. తరువాత శ్రీమతి శోభాహైమవతి దేవి, తన మేనమామ బగత తెగకు చెందిన అప్పలరాజును వివాహము చేసుకున్నందువలన ఆమెకు షెడ్యూల్డు తెగకు చెందినట్లుగా పరిగణించవచ్చా అనే అంశంపై ఇంతకుముందు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుననుసరించి, మొదట ఆమె అగ్రవర్ణానికి చెందినదికావున, షెడ్యూల్డు తెగకు చెందిన వ్యక్తిని వివాహమాడినంత మాత్రాన రిజర్వు చేయబడిన నియోజక వర్గ ఎన్నికల్లో పోటీ చేసే అర్హత పొందలేదు. ఈ అంశాల ఆధారంగా ఆమె ఎన్నికపై చేసిన సవాలును హైకోర్టు సమర్థించింది.

సాక్ష్యుల వాంగ్మూలాలు, సాక్ష్యాధారాలను అనుసరించి ఈ అప్పీలు కేసులో సుప్రీంకోర్టు పరిగణించిన అంశాలు నిర్ధారణలు ఏవంటే :

- అప్పీలుదారు తండ్రి ఆమె తల్లిని వివాహం చేసుకున్నాడు. వారిద్దరు కలిసి జీవించారు, అప్పీలుదారుతో సహా ఆరు మంది పిల్లల్ని కన్నారు, వారిని భార్యాభర్తలుగా గ్రామస్తులు గుర్తించారు, పిల్లలు శిష్టికరణం కులానికి చెందినవారిగానే పెరిగారు కాని బగత షెడ్యూల్డు తెగకు చెందిన వారిగా కాదు.
- ఆమె తల్లిదండ్రులు చాలాకాలం కలిసి జీవించడము, అప్పీలుదారుతోసహా ఆరుమంది పిల్లల్ని కనడం వల్ల వారిద్దరికి వివాహము జరుగలేదు అన్నది అంగీకరించలేము.
- అలాగే వారి తల్లికి లడ్డా అప్పలస్వామితో ముందే వివాహము జరిగినట్లు, తన తండ్రికి ముందే అతని అక్క కూతురు కళావతితో వివాహము జరిగినట్లు అప్పీలుదారు సాక్ష్యాధారాలతో ఋజువు చేయలేకపోయారు.

- అప్పీలుదారు యొక్క వకీలుగారు, అప్పీలుదారు శిస్టికరణ కులానికి చెందిన తండ్రికి పుట్టిననూ, ఆమెను ఆమె తల్లి యొక్క బగత తెగ సభ్యురాలుగా పరిగణించబడుతున్నదనియూ బతగ తెగ వారు ఆమెను వారి తెగకు చెందినదానిగా అంగీకరించారని ఆమె తన మేనమామ బగత తెగకు చెందిన అప్పలరాజును బగత ఆచారాల ప్రకారం పెళ్ళి చేసుకున్నదనీ, ఆమెకు చట్ట ప్రకారం సంబంధిత అధికారిచే జారీ చేయబడ్డ షెడ్యూల్డు తెగ సర్టిఫికెట్ వున్నందువలన ఆమె షెడ్యూల్డు తెగకు చెందిన దానిగా పరిగణించాలని వాదించారు. కాని ఆమె స్కూలు రికార్డుల్లో ఆమె కులం శిస్టికరణంగా నమోదు చేయబడినందున ఆమె తన విద్యాభ్యాసమంతా విశాఖపట్నంలోనే చేసిందని, తన తల్లిగారి గిరిజన గ్రామమైన భీమవరంలో ఎప్పుడూ నివసించలేదు కనుక, ఆమె పెళ్ళి బగత ఆచారాల ప్రకారం జరిగిందనడానికి సాక్ష్యాలు లేవుకనుక పై వాదనను అంగీకరించలేము. అలాగే ఆమె బగత తెగ జీవన విధానాలు అనుసరించిందని తెలుపడానికి ఏ ఋజువులు లేవు.
- షెడ్యూల్డు తెగకు చెందిన వ్యక్తిని పెళ్ళి చేసుకున్నంత మాత్రాన అగ్రకులానికి చెందినదానిగా జీవితం ప్రారంభించిన ఆమెకు రిజర్వేషను ప్రయోజనాలు వివాహము ద్వారా పొందుటకు అర్హత రాదు.
- ఇక మిగిలిందేమంటే ఆమెకు చట్టపరంగా సంబంధిత అధికారిచే జారీ చేయబడ్డ షెడ్యూల్డు తెగ సర్టిఫికెట్. దీనికి సంబంధించిన సాక్ష్యాలు పరిశీలించినచో, సర్టిఫికెట్లు ఆమె ఎం.ఎల్.ఏగా కలిగిన పలుకుబడివలన ఒకటి తరువాత ఒకటి, దరఖాస్తు చేసుకున్న వెంటనే, తగిన విచారణ చేయకుండా జారీ చేయబడినట్లు తెలుస్తుంది. అంతేగాక, చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం ఈ సర్టిఫికెట్లు స్థానిక సంస్థలు, సహకార సంస్థల పదువుల ఎన్నికలకు చెల్లుబాటు అవుతాయికాని, అసెంబ్లీ లేక పార్లమెంటు ఎన్నికలకు కాదు. ఎన్నికల పిటిషన్లలో ప్రవేశ పెట్టే ఇతర సాక్ష్యాలను మదింపు చేయడానికి ఈ సర్టిఫికెట్లను ఉపయోగించుకోవచ్చును. అంతేగాక పై సర్టిఫికెట్లు జారీ చేసే ముందు తగినటువంటి విచారణ చేయలేదని అప్పీలుదారు మాటపై జారీ చేయబడినట్లు మేము భావించాము.

పై అంశాలన్నీ పరిగణించిన తరువాత సంబంధిత ఆంధ్రప్రదేశ్ అసేంబ్లీకి అప్పీలుదారు ఎన్నిక చెల్లదని ఇచ్చిన హైకోర్టు తీర్పు సక్రమమే అని విశ్వసిస్తూ అప్పీలును కొట్టివేస్తున్నాము.

**ఈ కేసులోని పై వాదనలు, తీర్పులనుబట్టి మనము గుర్తించుకోవలసిన విషయాలు ఏవంటే:**

**కులాంతర వివాహాలు చేసుకున్న దంపతుల్లో ఒకరు షెడ్యూల్డు తెగకు చెందినప్పుడు వారి పిల్లలకు షెడ్యూల్డు తెగ సర్టిఫికెట్ ఇచ్చేముందు**

- **తల్లిదండ్రుల వివాహాన్ని షెడ్యూల్డు తెగవారు అంగీకరించినారా?**

- వివాహము ఆ తెగ ఆచారాల ప్రకారం జరిగిందా?
- పిల్లల్ని ఆ తెగకు చెందినవారిగా అంగీకరించారా? ఆ తెగ ఆచార వ్యవహారాలు పాటిస్తూ, తెగకు చెందిన తల్లి లేక తండ్రి గ్రామంలో పిల్లలు నివసించారా?
- స్కూలు రికార్డుల్లో పిల్లల కులం ఎవరిదిగా నమోదు చేసారు?
- ఆ పిల్లలకు క్లెయిము చేసిన తెగ యొక్క ఆచారా వ్యవహారాలు, సంస్కృతి తెలుసునా / పాటిస్తున్నారా?

మొదలగు అన్ని విషయాలపై క్షుణ్ణంగా విచారణ చేయాలి. స్కూలు రికార్డుల్లో షెడ్యూల్డు తెగగా నమోదు అయ్యిందనో, తెగకు చెందిన వారినుండి నోటరీ అఫిడవిట్ సంబంధిత అభ్యర్థి / తల్లిదండ్రులు సమర్పించినంత మాత్రాన అవి నిజమని నమ్మి సర్టిఫికెట్లు జారీ చేయరాదు. పైన తెలిపిన ప్రతి విషయాన్ని ప్రత్యేకంగా విచారం చేయాలి.

బి) భారత సుప్రీం కోర్టు

**(2006) 3 సుప్రీం కోర్టు కేసులు - 287**

**సివిల్ అప్పీల్ నెం.6445/2000**

**అంజన్ కుమార్ (అప్పీలుదారు)**

**Vs**

**యూనియన్ ఆఫ్ ఇండియా మరియు ఇతరులు (ప్రతివాదులు)**

అప్పీలుదారు శ్రీ అంజన్ కుమార్ తల్లి, మధ్యప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డు తెగ అయిన ఓరాన్ తెగకు చెందినది. తండ్రి బిహార్ రాష్ట్రం 'కాయస్థ' అగ్రవర్ణ కులానికి చెందినవారు. ఇతనికి గయ జిల్లా ప్రత్యేక జిల్లా మెజిస్ట్రేట్‌గారు అతని తల్లి షెడ్యూల్డు తెగలకు చెందినదనే ఆధారంగా ఓరాన్ తెగకు చెందినట్లు షెడ్యూల్డు తెగ ధృవీకరణ పత్రం 07.08.1992 నాడు జారీ చేసారు. దీని ఆధారంగా 1992 సంవత్సరంలో సివిల్ సర్వీసెస్ వ్రాత పరీక్షలో ఉత్తీర్ణుడై 1993 సంవత్సరంలో ఇంటర్వ్యూలో ఎంపికై, అతనికి ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్, గ్రేడ్-ఎ, కేటాయించబడింది. కాని అతనికి నియామకపు ఉత్తర్వులు ఇవ్వలేదు. దీనిపై అతను భారత ప్రభుత్వానికి తాను షెడ్యూల్డు తెగలకు చెందినవాడినని ఉపతెగ ఓరాన్ అని ఉత్తర్వుల కోసం చాలాసార్లు వినతి పత్రాలు సమర్పించినా, సానుకూల జవాబు రానందున కేంద్ర అడ్మినిస్ట్రేషన్ ట్రిబ్యునల్‌లో కేసు (ఒ.ఎ. నెం.2291/1994) వేసి, భారత ప్రభుత్వానికి తనను ట్రైనింగులో చేర్చుకోవడానికి ఆదేశాలు ఇవ్వాలని కోరినాడు. దీనిపై నోటీసు అందుకున్న భారత ప్రభుత్వము, అభ్యర్థి గిరిజన పరిసరాల్లో/ సంస్కృతిలో పెంచబడలేదనీ అతని తండ్రి గిరిజనేతరుడు అయినందువలన, అతన్ని షెడ్యూల్డు తెగకు చెందినట్లుగా పరిగణించలేమని, జవాబు ఇచ్చింది. ట్రిబ్యునల్ ఆదేశాలమేరకు, అభ్యర్థి షెడ్యూల్డు తెలగకు చెందినవాడా కాదా అని విచారణ జరిపి, అతనికి వ్యతిరేకంగా ఇవ్వబడిన రిపోర్టును ట్రిబ్యునల్‌కు సమర్పించింది. ఈ రిపోర్టును పరిశీలించిన ట్రిబ్యునల్ అతని కేసును త్రోసిపుచ్చింది. దీనిపై మధ్యప్రదేశ్ హైకోర్టులో రిట్‌పిటిషన్ నెం.647/1997 వేయగా హైకోర్టు సింగిల్ జడ్జిగారు సంబంధిత రికార్డులు, విచారణ రిపోర్టును పరిశీలించి రిట్‌పిటీషన్‌ను కొట్టి వేసినారు. దీనిపై హైకోర్టు డివిజన్ బెంచ్‌కు అప్పీలు చేయగా డివిజన్ బెంచ్ కూడా అప్పీలును కొట్టివేశారు. దీనిపై సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు.

ఇందులో అప్పీలుదారు వాదన ఏమంటే.

- విచారణాధికారి అప్పీలుదారుని ప్రమేయం లేకుండా వెనుకనుండి విచారణ చేసినారని, అట్టి రిపోర్టును విచారణలో సేకరించిన వివరాలపై ఆధారపడి రిట్‌పిటీషన్ / అప్పీలును కొట్టివేసిన సింగిల్ జడ్జి / డివిజన్ బెంచ్ తప్పుచేశారు.

- అప్పీలుదారుని తల్లి (షెడ్యూల్డు తెగ), తండ్రి (కాయస్థ కులం) యొక్క వివాహాన్ని గ్రామస్తులు ఆమోదించి, అంగీకరించారు మరియు అప్పీలుదారున్ని గిరిజనుల్లో కలుపుకున్నారు. అందువలన అతనికి షెడ్యూల్డు తెగ హోదా పొందుటకు అర్హత ఉన్నందువలన అతనికి షెడ్యూల్డు తెగ ధృవీకరణ పత్రం సరిగానే మంజూరు చేయబడింది.

- దీనికి సంబంధించి 04.03.1975 తేదీన కేంద్ర ప్రభుత్వంచే జారీ చేయబడ్డ సర్క్యులర్‌లోని షెడ్యూల్డు తెగకు చెందిన స్త్రీకి షెడ్యూల్డు తెగ కానటువంటి పురుషునితో వివాహము జరిగి అట్టి వివాహాన్ని షెడ్యూల్డు తెగవారు అంగీకరించినచో పుట్టిన పిల్లలను వారి తెగకు చెందినవారిగా షెడ్యూల్డు తెగకు చెందినవారిగా పరిగణించవచ్చును.

పై వాదనలపై సుప్రీం కోర్టు –

- అప్పీలుదారుని తల్లి (షెడ్యూల్డు తెగ) వివాహము అతని తండ్రి (అగ్రవర్ణం)తో కోర్టుద్వారా వారి గ్రామం వెలుపల జరిగింది. కోర్టుద్వారా జరిగిన వివాహాలు సాధారణంగా వధువు లేక వరుని తల్లిదండ్రులు లేక ఆయా గ్రామ ప్రజలు (కుల సభ్యులు) అంగీకరించకపోతేనే జరుగుతాయి. అలాంటి సందర్భాలలో వధువు లేక వరుడు కుల సభ్యుల / బంధువుల వ్యతిరేకతను, కులబహిష్కరణకు గురికాబడే ప్రమాదాన్ని ఎదుర్కోవలసి ఉంటుంది. కావున వీరి వివాహాన్ని కుల సభ్యులు అంగీకరించి, గుర్తించినట్లు అనుకోవడానికి వీలులేదు.

- అంతేగాక, అప్పీలుదారుని తల్లిదండ్రులు నగరంలో స్థిరపడ్డారు. అంటే, షెడ్యూల్డు తెగకు చెందిన తల్లి యొక్క గ్రామంలో నివసించలేదు. అప్పీలుదారుడు కూడా నగరంలోనే పుట్టినాడు, అతని తండ్రి యొక్క అగ్రవర్ణ పరిసరాలు / ప్రభావంలోనే పెంచబడినాడు. ఆ విధంగా అతను షెడ్యూల్డు తెగల సమాజం అనుభవించే వివక్షత, ప్రతికూలతలను పొందలేదు. అతని తల్లి యొక్క గ్రామానికి సెలవుల్లో వెళ్ళడం మరియు తల్లి యొక్క సమాజంతో మంచి సంబంధాలు ఉన్నంత మాత్రాన అప్పీలుదారున్ని అట్టి సమాజం తమలో ఒక్కడిగా అంగీకరించినట్లుగా ఆమోదించలేము. అలాగే ఎప్పుడో ఒకసారి తల్లిగారి గ్రామానికి వెళ్ళడం, ఆ గ్రామంలో స్థిర నివాసమున్నట్లుగాని, షెడ్యూల్డు తెగ సమాజం అతన్ని గుర్తించి అంగీకరించినట్లుగా కనీసం ఊహించడం కూడా సరికాదు.

- షెడ్యూల్డు తెగకు చెందినట్లుగా క్లెయిము చేయాలంటే అతను సాంఘికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా అన్ని విషయాల్లోను వివక్షతకు, ప్రతికూల పరిస్థితులకు గురికాబడి వుండాలి. కావున, షెడ్యూల్డు తెగ ధృవీకరణ పత్రం జారీ చేసేముందు, సంబంధిత అధికారి అట్టి అభ్యర్థిపై ప్రతికూల పరిస్థితులకు గురికాబడి ఉన్నాడని, సంతృప్తి చెందాల్సిన వృత్తి బాధ్యతకు నిబద్ధుడై ఉండాలి. అలా కాకుండా కులధృవీకరణ పత్రాలను నిత్య పరిపాటిగా (రోటీన్‌గా) జారీ చేస్తే, రాజ్యాంగ విధిని వదిలిపెట్టి మోసము చేసినట్లు అవుతుంది.

- అంతేగాక షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల కులధృవీకరణ పత్రాలు అంటే పంచిపెట్టడానికి ఉద్దేశించిన ధనం కాదు. వాటిని అర్హులైన, సాంఘికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా మరియు అన్ని విషయాల్లో వెనుకబడ్డ, వివక్షతకు గురైన మరియు రాజ్యాంగంలో గుర్తించబడిన తెగల / కులాల వారికే జారీ చెయ్యాలి.

పై కారణాలవల్ల, అప్పీలు పిటిషన్‌కు యోగ్యత లేదని, త్రోసిపుచ్చుతూ అప్పీలుదారుని షెడ్యూల్డు తెగ సర్టిఫికెట్‌ను రద్దు చేయడం జరిగింది.

సి) **1997 (1) ఎ.ఎల్.టి.789 (డి.బి.)**

**ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, హైదరాబాద్**

**రిట్ అప్పీల్ నెం.1188/1996, తేది.06.12.1996**

**డబ్ల్యు.ఎస్.వి. సత్యనారాయణ (అప్పీలుదారు)**

**Vs**

**సంచాలకులు, గిరిజన సంక్షేమ శాఖ, ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్ మరియు ఇతరులు (ప్రతివాదులు)**

అప్పీలుదారు తండ్రి బలిజ కులానికి చెందినవాడు, తల్లి కొండకాపు షెడ్యూల్డు తెగకు చెందినది. అతను షెడ్యూల్డు తెగ సర్టిఫికెట్ ఎం.ఆర్.ఓ., ఒంగోలు నుండి పొంది, దాని ఆధారంగా ఎం.బి.ఏ. కోర్సులో అడ్మిషన్ పొందినాడు. దీనిపై ప్రతివాది కోరిన వివరణ నోటీసుకు జవాబు ఇవ్వకుండా, హైకోర్టులో రిట్ పిటీషన్ వేశాడు. ఈ రిట్ పిటీషన్ పెండింగులో ఉండగానే ఎం.బి.ఏ. కోర్సు పూర్తి చేశాడు. రిట్ పిటీషన్‌పై హైకోర్టు సింగిల్ జడ్జిగారు –

పిటీషనర్ తండ్రి బలిజ కులస్థుడైనందువలన, తల్లి షెడ్యూల్డు తెగకు చెందినా కూడా, అతనికి తండ్రి కులమే వస్తుందనీ, జి.ఓ.ఎం.ఎస్.నెం.371 ఉపాధి మరియు సాంఘిక సంక్షేమ శాఖ, తేదీ 13.04.1976 ప్రకారం, విద్యాలయాల్లోను వృత్తిపరమైన కళాశాలల్లోను ప్రవేశం కోసం, కులాంతర వివాహాల వల్ల పుట్టిన పిల్లలు వారి తల్లిదండ్రుల కులాల్లో ఏది తక్కువ కులమైతే, ఆ కులానికి చెందినవారుగా పరిగణించవచ్చును అనే ఉత్తర్వులను రిట్ పిటీషన్ నెం.14875/1985 నందు హైకోర్టు, కార్యనిర్వహణాధికారుల అధికార పరిధిలో లేవని (అల్ట్రావైర్స్) రాజ్యాంగానికి విరుద్ధముగా తీర్పు ఇచ్చినందువల్ల పిటీషనరు యొక్క షెడ్యూల్డు తెగ సర్టిఫికెట్ ఈ ఉత్తర్వుల కారణంగా జారీ చేయబడినందున, దీనిని పరిగణలోకి తీసుకోలేము, అని తీర్పునిచ్చారు. ఈ తీర్పుపై ఈ అప్పీలు పిటీషను వేయబడింది.

అప్పీలుదారుని వకీలు – ప్రభుత్వ ఉత్తర్వులోని తల్లిదండ్రుల్లో తక్కువ కులం పిల్లలకు వస్తుందనీ, ఈ కేసులో తల్లి యొక్క షెడ్యూల్డు తెగ అప్పీలుదారునికి ఆటోమేటిక్‌గా వస్తుందని, సింగిల్ జడ్జిగారు – హిందూశాస్త్రం ప్రకారం పితృస్వామ్యం వలన తండ్రి కులం పిల్లలకు వస్తుందనే తీర్పు మాతృత్వంవల్ల వచ్చే స్త్రీల హక్కులకు, స్త్రీ పురుషుల సమానత్వానికి వ్యతిరేకమని వాదించారు.

దీనిపై ప్రతివాదుల వకీలు – అప్పీలుదారుని కులధృవీకరణ పత్రము సరియైనది కాదని, విచారణ చేయకుండానే, తప్పు భావనలతో, కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను పాటించకుండా జారీ చేయబడిందని వాదించారు.

హైకోర్టు డివిజన్ బెంచ్‌వారు – ఈ అంశంపై ఇంతకుముందు, వివిధ హైకోర్టులు, సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులను ఆధారంగా – ఒక వ్యక్తిని అతని తల్లిదండ్రుల కులాల్లో ఏ కుల సమాజం ఆ వ్యక్తిని తమవానిగా అంగీకరించి గుర్తింపునిస్తుందో, ఆ సమాజపు కులానికి చెందుతాడు.

ప్రస్తుత కేసులో, అప్పీలుదారుడు అలాంటి షెడ్యూల్డు తెగ సమాజం యొక్క అంగీకారం, గుర్తింపు కలిగియున్నాడా లేదా అనే అంశంపై విచారణ జరుగలేదు.

ప్రభుత్వ ఉత్తర్వు నెం.371, తేది 31.04.1976లో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన లేఖ నెం.39/387/73–ఎస్.సి.టి., తేది.04.03.1975లోని మార్గదర్శకాలకు అనుగుణంగా తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు ఎస్.సి./ఎస్.టి./బి.సి. లైతే తల్లిదండ్రుల కులాల్లో దేనికి చెందినట్లుగా పిల్లలు నిర్ధారింపబడతారో ఆ కులానికిచ్చే సదుపాయాలకు వారు అర్హత పొందుతారు. ప్రతి కేసును ఈ మార్గదర్శకాల ఆధారంగా విచారించి కులాంతర వివాహాల పిల్లల కులాన్ని నిర్ధారించాలని ఉంది.

**మండుల రెవెన్యూ అధికారి అప్పీలుదారునికి కులధృవీకరణ పత్రం ఇచ్చుటలో ఈ మార్గదర్శకాలను పూర్తిగా ఉపేక్షించినారు.**

**అందువలన, షెడ్యూల్డు తెగలకు చెందిన వ్యక్తులు బయటి వ్యక్తులతో వివాహము చేసుకున్నప్పుడు వారి పిల్లలకు షెడ్యూల్డు తెగ హోదా రావడాన్ని ఆ షెడ్యూల్డు తెగ మాతృస్వామ్యం లేక పితృస్వామ్యం ఏదైనా కూడా, ఆ పిల్లలను తమవానిగా అంగీకరించి, గుర్తింపు ఇవ్వడము అనేది నిర్ధారిక అంశము. తుది ఫలితం/నిర్ణయం ఆ బాలల్ని షెడ్యూల్డు తెగవారు తమలో ఒకరిగా ఇచ్చే అంగీకారం, గుర్తింపు పైనే ఆధారపడుతుంది.**

**అందువలన, అప్పీలుదారుణ్ని కొండకాపు షెడ్యూల్డు తెగవారు తమలో ఒకనిగా అంగీకరించి, గుర్తించారా అని నిర్ధారించుటకు విచారణ చేయడం ప్రతివాదుల ఉద్యోగ విధి / బాధ్యత. ఈ విచారణలో పైవిధంగా అంగీకారం, గుర్తింపు ఉన్నట్లు తేలితే అతన్ని షెడ్యూల్డు తెగకు చెందినట్లుగా పరిగణించాలి. అలా తేలని పక్షంలో అతని కులధృవీకరణ పత్రాన్ని రద్దు చేయాలి. అంతవరకు దాన్ని నిలుపుదల చేయడమైనది.**

**ఈ తీర్పువల్ల మనం గుర్తుంచుకోవలసింది ఏమంటే కులాంతర వివాహాల పిల్లలకు షెడ్యూల్డు తెగ హోదా విషయంలో ప్రతి కేసులోను, వారికి క్లెయిము చేసిన షెడ్యూల్డు తెగ యొక్క అంగీకారం, గుర్తింపు ఉన్నాయా అనే విషయంలో తగిన విచారణ చేసి నిర్ణయం తీసుకోవాలి. ఇంకో విషయం, ప్రభుత్వం ఉత్తర్వు నెం.371లోని 2వ పేరాను, ఉత్తర్వు నెం.91 సాంఘిక సంక్షేమ శాఖ, తేది 03.10.2007 ద్వారా రద్దు చేయడం జరిగింది. కావున మొదటి పేరాలోని ఆదేశాల ప్రకారం, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా చర్య తీసుకోవాలి.**

**6) వలసదారులకు షెడ్యూల్డు తెగ హోదా**

**ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, హైదరాబాద్**

**రిట్ అప్పీల్ నెం.4268/1993, తేది 07.10.2003**

**చిల్వార్ సరోజినీ దేవి (అప్పీలుదారు)**

**Vs**

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున గిరిజన సంక్షేమ శాఖ, సంచాలకులు మరియు ఇతరులు (ప్రతివాదులు)**

పిటీషనరు తల్లిదండ్రులు మహారాష్ట్రలోని మన్నెర్‌వార్లు షెడ్యూల్డు తెగకు చెందినవారు. ఆమె తండ్రి ఆల్ ఇండియా రేడియోలో పని చేస్తూ, హైదరాబాదుకు 1963లో బదిలీపై వచ్చినారు. పిటీషనరు మహారాష్ట్రలోనే 1957లో పుట్టింది. ఆమె తండ్రి చనిపోయిన తరువాత కూడా హైదరాబాద్‌లోనే నివాసమున్నారు. 1992 సంవత్సరంలో సాంఘిక సంక్షేమ శాఖలో మేట్రన్ గ్రేడ్–2 ఉద్యోగానికి షెడ్యూల్డు తెగల కోటాలో సెలెక్టు కాబడింది కాని, ఆమె పోస్టింగ్ ఉత్తర్వులు నిలుపుదల చేసి, ఆమె షెడ్యూల్డు తెగ హోదాపై ధృవీకరణ కోసం, గిరిజన సంక్షేమ శాఖ, కమీషనర్‌గారికి రిఫర్ చేశారు. పిటీషనర్ సమర్పించిన వాంగ్మూలాలు, సాక్ష్యాలు, ఆధారాలను పరిశీలించి, గిరిజన సంక్షేమ శాఖ, కమీషనరు – కేంద్ర ప్రభుత్వ, దేశీయ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సర్క్యులర్ నెం.బి.సి.16014/1/82–ఎస్.సి. మరియు బి.సి.–డి.1, తేది 22.02.1985లో ఇచ్చిన "సొంత రాష్ట్రంనుండి ఇంకో రాష్ట్రానికి విద్య లేక ఉద్యోగము కోసం వలస వెళ్ళిన కులాలు/తెగలకు కల్పించబడిన సదుపాయాలు పొందుటకు స్వంత రాష్ట్రంలోనే హక్కు కలిగి వుంటారు కాని వలస వెళ్ళిన రాష్ట్రంలో కాదు" అనే వివరణ ఆధారంగా పిటీషనరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో షెడ్యూల్డు తెగ కోటాలో ఉద్యోగం పొందుటకు అర్హులుకాదని నిర్ధారించారు.

ఈ ఉత్తర్వులపై హైకోర్టులో పిటీషన్ క్రింది వాదనలతో దాఖలు చేయబడింది.

**కమీషనరరు, గిరిజన సంక్షేమ శాఖ వారికి, పిటీషనరు యొక్క సాంఘిక హోదాను నిర్ధారించే హక్కు లేదు ఎందుకంటే షెడ్యూల్డు తెగ హోదాను నిర్ణయించి ప్రకటించే అధికారం రాష్ట్రపతికి మాత్రమే కలదు.**

**స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర Vs కుమారి తనూజ (ఎ.ఐ.ఆర్.1999–ఎస్.సి.791) కేసులో సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం, పిటీషనరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వలస వచ్చినా కూడా, షెడ్యూల్డు తెగకు ఇవ్వబడిన సదుపాయాలు పొందుటకు అర్హత కలదు.**

ప్రతివాదుల పరఫున ప్రభుత్వ వకీలు – మహారాష్ట్ర యాక్షన్ కమిటీ **Vs** యూనియన్ ఆఫ్ ఇండియా కేసు (1994 (ఎస్) ఎస్.సి.సి.244)లో సుప్రీంకోర్టు, రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు ప్రకారం తన స్వంత రాష్ట్రంలో స్థిర లేక ఆర్డినరి నివాసులైయుండి షెడ్యూల్డు కులం / షెడ్యూల్డు తెగలకు చెందిన వ్యక్తి విద్య, ఉద్యోగం మొదలగు వాటికోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళితే అతన్ని వలస వెళ్ళిన రాష్ట్రంలో ఆ విధంగా పరిగణించలేమని వాదించారు.

పై కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఆర్టికల్ 341 మరియు 342 క్లాజు (1) క్రింద ఒక రాష్ట్రము లేక కేంద్రపాలిత ప్రాంతానికి సంబంధించి, షెడ్యూల్డు కులాలను/షెడ్యూల్డు తెగలను ప్రకటించే అధికారం రాష్ట్రపతికి మాత్రమే కలదు. అంటే, షెడ్యూల్డు కులాలు/షెడ్యూల్డు తెగలను ఒక రాష్ట్రం లేక కేంద్రపాలిత ప్రాంతానికి సంబంధించి ప్రత్యేకంగా ప్రకటించాలి. కావున ఒక కులం లేక తెగ ఏ రాష్ట్రానికి / కేంద్రపాలిత ప్రాంతానికి సంబంధించి ప్రకటించబడిందో ఆ రాష్ట్రంలోనే షెడ్యూల్డు కులం లేక షెడ్యూల్డు తెగగా పరిగణింపబడుతుంది. ఒక కులాన్ని, తెగను, తరగతిని షెడ్యూల్డు కులం లేక షెడ్యూల్డు తెగ లేక వెనుకబడిన తరగతుల జాబితాలలో ఒక రాష్ట్రంలో ప్రకటించడానికి కారణాలు, ఆ రాష్ట్రంలో ఆయా కులం, తెగ లేక తరగతి వారు అనుభవించిన ప్రతికూల పరిస్థితులు, సాంఘిక కష్టాల స్వభావం, తీవ్రతపై ఆధారపడి ఉంటాయి. అట్టి కారణాలు వాటి తీవ్రత ఆ కులాలు / తెగలు / తరగతులకు వారు వలసవెళ్ళిన రాష్ట్రంలో వాటికి లేకపోవచ్చు. ఒకే పేరుగల కులం లేక తెగ రెండు రాష్ట్రాల్లో ప్రకటింపబడినా, వాటిని ప్రకటించడానికి గల కారణాలు ఆ రెండు రాష్ట్రాల్లో వేరేగా ఉండవచ్చు. ఒక రాష్ట్రంలో షెడ్యూల్డు కులంగా ప్రకటించబడిన కలం పేరు ఇంకో రాష్ట్రంలో కూడా షెడ్యూల్డు కులంగా ఉన్నంత మాత్రాన మొదటి రాష్ట్రం యొక్క షెడ్యూల్డు కులానికి చెందిన వ్యక్తి రెండో రాష్ట్రంలో షెడ్యూల్డు కులానికి ఉద్దేశింపబడిన రాజ్యాంగపరమైన హక్కులు, సదుపాయాలు పొందడానికి అర్హత వుంటుందని ఉద్దేశ్యము / అర్థము కాదు అని తీర్పునిచ్చారు.

పై తీర్పును అనుసరించి ఈ కేసులో కూడా పిటీషనరుకు తను వలసవెళ్ళిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో షెడ్యూల్డు తెగలకు కేటాయించిన ఉద్యోగము పొందుటకు అర్హురాలు కాదని సుప్రీం కోర్టు నిర్ధారించారు.

అందువలన కేంద్ర ప్రభుత్వ ఆదేశాలననుసరించి గిరిజన సంక్షేమ శాఖ, కమీషనరు ఇచ్చిన ఉత్తర్వులు సరియైనవే అనియూ, అవి రాజ్యాంగం ఆర్టికల్ 19కి విరుద్ధము కాదని, పిటీషనరు యొక్క సాంఘిక హోదాను నిర్ధారించలేదని, ఆమెకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో షెడ్యూల్డు తెగలకు ఇవ్వబడిన హక్కులు, సదుపాయాలను పొందే అర్హత ఉందా లేదా అని మాత్రమే నిర్ణయించినందువలన పిటీషను త్రోసిపుచ్చబడినది / కొట్టివేయబడినది.

## అనుబంధము

| వ.నెం. | షెడ్యూల్డు తెగలు | మొట్టమొదట ఎస్.టి. జాబితాలో చేర్చబడిన రాష్ట్రపతి ఉత్తర్వు, సం॥ | ప్రస్తుత నివాస ప్రాంత పరిమితి | సాంప్రదాయకంగా నివసించే జిల్లాలు / ప్రాంతాలు |
|---|---|---|---|---|
| 01 | అంధ్ | రాజ్యాంగ (షెడ్యూల్డు తెగల) ఉత్తర్వు, 1950 | రాష్ట్రమంతా | ఆదిలాబాద్ |
| 02 | బగత | -do- | -do- | విశాఖపట్నం, విజయనగరం జిల్లాల అటవీ ప్రాంతం |
| 03 | భిల్ | -do- | -do- | ----- |
| 04 | చెంచు | -do- | -do- | కర్నూలు, మహబూబ్‌నగర్, ప్రకాశం, గుంటూరు, నల్గొండ జిల్లాలోని నల్లమల అటవీ ప్రాంతం మరియు రంగారెడ్డి జిల్లా. |
| 05 | గదబ | -do- | -do- | శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల అటవీ ప్రాంతాలు |
| 06 | గోండు | -do- | -do- | అదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల అటవీ ప్రాంతాలు |
| 07 | గౌడు | -do- | ఏజన్సీ ప్రాంతాలు | విశాఖపట్నం, విజయనగరం ఉభయ గోదావరి జిల్లాల అటవీ ప్రాంతాలు |
| 08 | కొండరెడ్డి/హిల్‌రెడ్డి | -do- | రాష్ట్రమంతా | ఖమ్మం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని అటవీ ప్రాంతాలు |
| 09 | జాతాపు | -do- | -do- | శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల అటవీ ప్రాంతాలు |
| 10 | కమ్మర | -do- | -do- | విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల అటవీ ప్రాంతం |

| వ.నెం. | షెడ్యూల్డు తెగలు | మొట్టమొదట ఎస్.టి. జాబితాలో చేర్చబడిన రాష్ట్రపతి ఉత్తర్వు, సం॥ | ప్రస్తుత నివాస ప్రాంత పరిమితి | సాంప్రదాయకంగా నివసించే జిల్లాలు / ప్రాంతాలు |
|---|---|---|---|---|
| 11 | కట్టునాయకన్ | -do- | -do- | ---- |
| 12 | కోలాము | -do- | -do- | అదిలాబాద్ జిల్లా అటవీ ప్రాంతం |
| 13 | కొండదొర | -do- | -do- | శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాల అటవీ ప్రాంతం |
| 14 | కొండకాపు | -do- | -do- | విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల అటవీ ప్రాంతం |
| 15 | ఖోండు | -do- | -do- | శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల అటవీ ప్రాంతం |
| 16 | కొటియ | -do- | -do- | శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల అటవీ ప్రాంతం |
| 17 | కోయ | -do- | -do- | ఉభయ గోదావరి, ఖమ్మం, వరంగల్, అదిలాబాద్ జిల్లాల అటవీ ప్రాంతాలు |
| 18 | కులియ | -do- | -do- | విశాఖపట్నం జిల్లా అటవీ ప్రాంతం |
| 19 | మాలి | షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల ఉత్తర్వులు (సవరణ) చట్టం 1956 | తెలంగాణ మినహా అన్ని జిల్లాలు | విశాఖపట్నం జిల్లా అటవీ ప్రాంతం |
| 20 | మెన్నెదొర | రాజ్యాంగ (షెడ్యూల్డు తెగల) ఉత్తర్వు 1950 | రాష్ట్రమంతా | విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల అటవీ ప్రాంతాలు |
| 21 | మూకదొర | -do- | -do- | విజయనగరం, విశాఖపట్నం జిల్లాల అటవీ ప్రాంతాలు |

| వ.నెం. | షెడ్యూల్డు తెగలు | మొట్టమొదట ఎస్.టి. జాబితాలో చేర్చబడిన రాష్ట్రపతి ఉత్తర్వు, సం॥ | ప్రస్తుత నివాస ప్రాంత పరిమితి | సాంప్రదాయకంగా నివసించే జిల్లాలు / ప్రాంతాలు |
|---|---|---|---|---|
| 22 | నాయక్ | షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల ఉత్తర్వులు (సవరణ) చట్టం 1956 | ఏజన్సీ ప్రాంతాలు | పశ్చిమ గోదావరి, ఖమ్మం జిల్లాల అటవీ ప్రాంతాలు |
| 23 | నాయక్‌పోడు | రాజ్యాంగ (షెడ్యూల్డు తెగల) ఉత్తర్వు 1950 | రాష్ట్రమంతా | అదిలాబాద్, కరీంనగర్, వరంగల్ ఖమ్మం, నిజామాబాద్ |
| 24 | పర్ధాన్ | -do- | -do- | అదిలాబాద్ |
| 25 | పోర్జ | -do- | -do- | శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల అటవీ ప్రాంతాలు |
| 26 | రెడ్డిదొర | -do- | -do- | విశాఖపట్నం జిల్లా అటవీ ప్రాంతం |
| 27 | రోన, రేన | షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల ఉత్తర్వులు (సవరణ) చట్టం 1956 | -do- | విశాఖపట్నం జిల్లా |
| 28 | సవర | రాజ్యాంగ (షెడ్యూల్డు తెగల) ఉత్తర్వు 1950 | -do- | శ్రీకాకుళం, విజయనగరం, జిల్లాల అటవీ ప్రాంతాలు |
| 29 | సుగాలి, లంబాడి | ఆంధ్ర ప్రాంతంలో షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల ఉత్తర్వులు చట్టం 1956 | -do- | శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి మినహా మిగతా అన్ని జిల్లాలు |
| 30 | తోటి | రాజ్యాంగ (షెడ్యూల్డు తెగల) ఉత్తర్వు 1950 | -do- | అదిలాబాద్ జిల్లా |
| 31 | వాల్మీకి | షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల ఉత్తర్వులు (సవరణ) చట్టం 1956 | ఏజన్సీ ప్రాంతాలు | శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయగోదావరి, జిల్లాల్లోని ఏజన్సీ ప్రాంతాలు |

| వ.నెం. | షెడ్యూల్డు తెగలు | మొట్టమొదట ఎస్.టి. జాబితాలో చేర్చబడిన రాష్ట్రపతి ఉత్తర్వు, సం॥ | ప్రస్తుత నివాస ప్రాంత పరిమితి | సాంప్రదాయకంగా నివసించే జిల్లాలు / ప్రాంతాలు |
|---|---|---|---|---|
| 32 | యానాది | ఆంధ్ర ప్రాంతంలో షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల ఉత్తర్వులు చట్టం 1956<br>తెలంగాణ ప్రాంతంలో షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల ఉత్తర్వులు (సవరణ) చట్టం 1976 | -do- | శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి మినహా మిగతా అన్ని జిల్లాలు |
| 33 | ఎరుకుల | -do- | -do- | అన్ని జిల్లాలు |
| 34 | నక్కల | షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల ఉత్తర్వులు (సవరణ) చట్టం 2002 (చట్టం నెం.10–2003) | -do- | అన్ని జిల్లాలు |
| 35 | ధులియ, పుటియ, పెయికొ | రాజ్యాంగ (షెడ్యూల్డు తెగల) ఉత్తర్వు 1950 | విశాఖపట్నం విజయనగరం జిల్లాలు | |